సాహిత్య

# ప్రస్థానం

ఫిబ్రవరి 2016

వెల రూ. 10



అద్దేపల్లి రామమోహన రావు
1936 - 2016

సాహితీస్రవంతి






కాకినాడలో అద్దేపల్లి రామమోహనరావు అంత్యక్రియల్లో పాల్గొని మాట్లాడుతున్న సాహిత్య ప్రస్థానం సంపాదకులు తెలకపల్లి రవి

విజయవాడలో సాహిత్య, సాంస్కృతిక సంఘాల ఆధ్వర్యంలో ఎం.బి. విజ్ఞాన కేంద్రంలో జరిగిన సంస్మరణ సభలో మాట్లాడుతున్న కొత్తపల్లి రవిబాబు









పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో జరిగిన అద్దేపల్లి సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న తెలకపల్లి రవి.

కాకినాడలో జరిగిన అద్దేపల్లి సంస్మరణ సభలో మాట్లాడుతున్న తూర్పుగోదావరి జిల్లా సాహితీస్రవంతి ప్రధాన కార్యదర్శి గనారా.

విజయనగరంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగిన సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న కవి పాయల మురళీకృష్ణ.






తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగిన సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న జోశ్యుల కృష్ణబాబు

తూర్పుగోదావరి జిల్లా కొత్తపేటలో కళా సాహితీ, రోటరీ క్లబ్, గ్రంథాలయ సాధకుల సమాఖ్యఆధ్వర్యంలో జరిగిన అద్దేపల్లి సంస్మరణ సభ








కాకినాడలో సూర్య సాహితీ వేదిక ఆధ్వర్యంలో జరిగినఅద్దేపల్లి సంస్మరణ సభ.

కర్నూలులో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగిన సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు

తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగిన అద్దేపల్లి సంస్మరణ సభ.

సాహిత్య ప్రస్థానం
ఫిబ్రవరి 2016
సంపుటి : 15 సంచిక : 2

## దురహంకారం.. ధిక్కారం...

దార్శనికతకూ ఆదర్శీకరణకూ చాలా తేడా. వర్తమానాన్ని సరిగ్గా అర్థం చేసుకుని భవిష్యత్తు ఇలా వుండబోతుందని చెప్పడం దార్శనికత. వర్తమానంలో ఫలానాది బాగాలేదని తెలుసుకున్నాం గనక భవిష్యత్తు అద్భుతంగా వుండబోతుందని చిత్రించడం ఆదర్శీకరణ. ఒకదానికి భౌతిక వాస్తవం ప్రాతిపదిక అయితే మరోదానికి భావుకత కారణమవుతుంటుంది. సృజనలోనూ విజ్ఞాన శాస్త్రంలోనూ కూడా సిద్ధహస్తుడైన కొడవటిగంటి కుటుంబరావు కొన్ని దశాబ్దాల కిందట కులంగాడి అంత్యక్రియలు అనే కథానిక వంటిది రాశారు. పట్టణ జీవితంలో కులం అంతరించిపోతుందని ఆయన వూహించారు. అయితే అది ఆయన ఆదర్శీకరణ తప్ప దార్శనికత కాదని రోజురోజుకు మరింతగా రుజువవుతున్నది. దురహంకారం బుసలు కొడుతున్నది. ఇంకా సందేహాలున్న వారికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ బలికేక తిరుగులేని సమాధానం ఇస్తున్నది. రోజూ దళిత స్మరణ చేసే పాలకుల నిజస్వరూపం వెల్లడించడమే గాక రోహిత్ దళితుడు కాదని నిరూపించేందుకు శవపరీక్షలు చేస్తున్న వారిని చూసి మానవత్వమే సిగ్గుపడుతున్నది. దీనిపై ప్రతిఘటన సామాజికన్యాయం కోసం పోరాడే వారి చైతన్యాన్ని చాటుతున్నది.

.............

సాహిత్య లోకానికి పెద్ద దిక్కుగా అందరి ఆప్తమిత్రుడుగా ప్రతివారి గౌరవం పొందిన అద్దేపల్లి రామమోహనరావు కన్నుమూత అక్షరాలా పెద్ద వెలితి. సాహితీ స్రవంతి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడుగానే గాక తెలుగు రాష్ట్రాల మూలమూలనా సంచరించి ప్రోత్సహించిన నిబద్ధ నిరాడంబర సాహిత్య జీవి ఆయన. ప్రస్థానం ఆయనకు జోహార్లర్పిస్తూ ఈ సంచికలో ప్రత్యేక వ్యాసాలు అందిస్తున్నది.

ముఖచిత్రం : గిరిధర్

## ఈ సంచికలో ...

కవిత ..................................................... 4
నిబద్ధ సాహిత్యవేత్త డా॥ అద్దేపల్లి ..................... 5
సాగిపోయిన రాస్తాలూ..
మలుపు తిప్పిన చౌరస్తాలూ...... ..... 7
కవిత్వాన్ని అనుభవించి పలవరించిన అద్దేపల్లి .... 15
అద్దేపల్లితో నా సాహిత్య ప్రయాణం.................. 18
ప్రపంచీకరణ నేపథ్యం – అద్దేపల్లి కవిత్వం......... 20
కవిత ..................................................... 26
ప్రపంచీకరణ దిక్సూచి................................. 27
కలం మూసిన కవితా యోధుడు..................... 30
కాలం మీద సంతకం చేసి వెళ్లిపోయాడు........... 34
కులాల కూపాలు తరాల పాపాలు.................. .. 36
స్త్రీవాదుల బాధ్యతను ఎరుకజేసిన 'స్నేహిత'......... 39
నేటి తెలుగు కవిత్వం – చాకలివారి జీవనం....... 42
విస్పష్ట అత్యాధునిక కవిత్వం................. ....... 45
స్వీకారం ................................................. 48
అద్దేపల్లికి ఘన నివాళి................. .............. 50

సంపాదకవర్గం
తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
వొరప్రసాద్
వల్లభాపురం జనార్దన
కె.లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్‌భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్ ఆర్టీసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్ - 500 020

మనీ ఆర్డర్లు, రచనలు పంపించవలసిన చిరునామా:
ఎడిటర్, సాహిత్య ప్రస్థానం, ఎం.బి. విజ్ఞానకేంద్రం, డో.నెం. 27-30-4, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ - 520 002,
సెల్: 9490099059
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

## కవిత

# అద్దేపల్లికి అశ్రునీరాజనం

-మాల్యశ్రీ
9290070043

ఉభయగోదావరులకు
సారస్వత సారధి
బందరు నుండి కాకినాడకు
విస్తరించిన సాహిత్యనిధి
తీరాంధ్ర కవులకు
తీయని నేస్తం
అఖిలాంధ్ర తెలుగు కవులకు
అమృత హస్తం



రోడ్డుమీద సూరీడు
బంగాళాఖాత సముద్రుడు
సహృదయ సమీక్షకుడు
పురోగామి విమర్శకుడు
నిత్యసంతోషి నిరంతర అన్వేషి
అతడు అద్దేపల్లి
కవితా అంగార వల్లి
అతనికి మా నీరాజనం!
అక్షరాశ్రు నైవేద్యం!!

# సత్సంశయం

- ఎరుకలపూడి గోపీనాథరావు
9848293119


ఆయన వెళ్ళిపోయారనడమేమిటి...?
అక్షరాలతో అవినాభావంగా, ఆమూలాగ్రంగా
సమగ్రంగా అల్లుకునుండే ప్రజాకవి...
అక్షరారాధకులతో ఆత్మీయంగా పెనవేసుకునుండే ప్రేమజీవి
అకస్మాత్‌గా...ఏకపక్షంగా...బంధాలన్నీ త్రెంపుకుంటూ
అసలెలా...అలా...అదృశ్యమైపోగలరు...?
జనహృదయంలో జాగృతమైవున్న ఆతని మధురస్వరం
ధారాళ సాహితీ ప్రవాహమై పరిసరాల నిండా ఘోషిస్తుండగా...
అసంఖ్యాకుల అంతరంగంలో
మూర్తిమంతమైవున్న అతని మోహనాకారం
హేరాళ సారస్వత ప్రకాశమై సర్వత్రా గోచరిస్తూ వుండగా
కానరాని దూరతీరాలకాయన కదలిపోయారనడమేమిటి...?
అహరహం సాహితీ సృజనలో తలమున్కలై వుండే 'వేది'
అనవరతం ప్రజా సంక్షేమంకోసం తపించే అభ్యుదయ వాది
సాహితీ జగంలో- చెక్కవలసిన వర్ణశిల్పాలింకా మిగిలి వుండగానే...
ఎక్కవలసిన ఘన శిఖరాలింకా మిగిలివుండగానే...
మరులోకానికేగి ఇకపై మరలిరాడనడమేమిటి...?
సాహిత్యపు లోతులన్నీ సాధికారికంగా స్పృశిస్తూ
సభారంజకంగా ప్రసంగించే మాటకారి...
సాహితీలోకపు దిక్కులన్నీ సముత్సాహంతో సందర్శిస్తూ
చైతన్యాన్ని ప్రసరింపజేసే బాటసారి...
నిత్యరమణీయమూర్తి...సతతస్మరణీయ మూర్తి...
సర్వవ్యాప్తుడైవుండగా
పరమపదించారంటూ సాగే ప్రచారం
అసత్య ప్రచారం కదూ...అనృత ప్రసంగం కాదా...?
ఆత్మతో శ్రద్ధగా ఆలకించే వారికోసం
కావ్యవేదికలపై ఆయన పలుకులు ప్రతిధ్వనిస్తుండగా...
మనసుతో బుద్ధిగా దర్శించే వారికోసం
కవనమందిరాలలో ఆతని కదలికలు ప్రత్యక్షమౌతుండగా...,
అస్తమించని కాంతిపుంజంలా-
దశదిశలా ఆయన కీర్తి విస్తరిస్తుండగా...,
ఆయన వెలిగించిన అక్షరస్ఫూర్తి-
సాహితీ ప్రియుల సహృదయంలో
దినదిన ప్రవర్ధమానమౌతూ వికసిస్తూ వుండగా
'అద్దేపల్లి' లేక - శూన్యమావహించిందనే వ్యాఖ్యానాలూ,
అంతటా అచేతనావస్థ అలముకున్నదనే వాదాలూ
కల్పనలేననుకోవాలి....కట్టుకథలేననుకోవాలి.

**నివాళి**

# నిబద్ధ సాహిత్యవేత్త డాక్టర్ అద్దేపల్లి

**- తెలకపల్లి రవి**

**'నువ్వు ఆర్యుడవైతేనేమిటి, ద్రావిడుడవైతే నేమిటి నీ వొంట్లో బహుళజాతి రక్తం ప్రవహిస్తున్నప్పుడు' అని ప్రశ్నించిన సాహసి. 'అట్లాంటిక్ తీరం నుంచి వచ్చిన రెండు గ్లోబల్ అడుగులు' 'తల మీద అడుగులు పెట్టుకునే పరాధీనత మాత్రం అప్పుడూ ఇప్పుడూ మేడిన్ ఇండియాయే' అని ఆక్షేపిస్తాడు. 'గోదావరిలో నీళ్లు దోసిట్లోకి తీసుకున్నాను.. నా ముఖం కనిపించలేదు.. వీరేశలింగం కనిపించాడు' అని చారిత్రిక వారసత్వాన్ని చెబుతాడు.**



ప్రగతిశీలతకు, ప్రతిభకు మారుపేరైన కవి, విమర్శకుడు, ఉపన్యాసకుడు డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు మరణవార్త తెలుగుసాహిత్య ప్రపంచానికి ఒక పెద్ద దిగ్భ్రాంతి. సాహితీ స్రవంతికి, ప్రజాశక్తి సాహితీ సంస్థకూ అత్యంత సన్నిహితంగా మెలిగిన వ్యక్తి ఆయన. నిత్యసాహిత్య సంచారి, నిరంతర రచనాశీలి, నిఖిల సజ్జన సన్మిత్రుడు.. నిబద్ధ సామ్యవాద భావుకుడు.. అద్దేపల్లి రామమోహనరావును గురించి సభల్లో తరచూ ఇలా వర్ణిస్తుండేవాణ్ణి. ఇవన్నీ అతిశయోక్తులు కాదు. యాభైలనాటి చాలా మంది సాహిత్యకారుల లాగే ఆయన కూడా ప్రాచీన ముద్ర నుంచి ప్రగతి వైపు నడిచారు. రక్తసంధ్య, మధుజ్వాల, అంతర్జ్వాల, గోదావరి నా ప్రతిబింబం, అయినా ధైర్యంగానే, పొగచూరిన ఆకాశం, ఆకుపచ్చని సజీవ సముద్రం, నా నేల వంటి అనేక కవితా సంపుటాలు ఆయన వెలువరించారు. 'నువ్వు ఆర్యుడవైతేనేమిటి, ద్రావిడుడవైతే నేమిటి నీ వొంట్లో బహుళజాతి రక్తం ప్రవహిస్తున్నప్పుడు' అని ప్రశ్నించిన సాహసి. 'అట్లాంటిక్ తీరం నుంచి వచ్చిన రెండు గ్లోబల్ అడుగులు' 'తల మీద అడుగులు పెట్టుకునే పరాధీనత మాత్రం అప్పుడూ ఇప్పుడూ మేడిన్ ఇండియాయే' అని ఆక్షేపిస్తాడు. 'గోదావరిలో నీళ్లు దోసిట్లోకి తీసుకున్నాను.. నా ముఖం కనిపించలేదు.. వీరేశలింగం కనిపించాడు' అని చారిత్రిక వారసత్వాన్ని చెబుతాడు.

అద్దేపల్లి సాహిత్య సంస్థలన్నిటికీ సన్నిహితంగా మెలిగారు. కొన్ని వెబ్‌సైట్లు చెబుతున్నట్టు ఆయన 1970లో పుట్టిన విరసంతోనే ప్రేరణ పొందినవాడు కాదు. యాభైల నుంచి లోతుగా అధ్యయనం చేసిన వ్యక్తి. 1962 నాటికే శ్రీశ్రీపై రాసిన విమర్శకుడు. వివిధ సాహిత్య పరిణామాల మధ్య విమర్శకుడుగా తన ప్రత్యేకత కాపాడుకొన్నారు. గత పదిహేనేళ్లలోనూ సాహితీస్రవంతి నిర్వహించిన ఏ ప్రధాన కార్యక్రమం ఆయన లేకుండా జరగలేదు. కాకినాడలో నెలనెలా కార్యక్రమాలు పెద్ద ఆకర్షణగా మారాయి. ఇంత వయసులోనూ ఒక్కసారి కూడా విడువకుండా వాటిని నడపడంలో గనారా సహాయంతో అద్దేపల్లి ముందు నిలిచారు. సైద్ధాంతిక నిబద్ధతతో పాటు సాహిత్య శిల్పం గురించిన అవగాహన కూడా ముఖ్యమని ఎప్పటికప్పుడు విశ్లేషించేవారు. యువకవులకు, పరిశోధకులకు సూచనలు చేయడం, అధ్యయన తరగతులు ఇవన్నీ ఆయన నిత్యకృత్యాలు.

'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' పేర శ్రీశ్రీపై తొలి పరిశీలనా గ్రంథం ఆయనదే కావడం ఒక చారిత్రిక యదార్థం. తన నేపథ్యం రీత్యా శ్రీశ్రీ కవిత్వాన్ని చూసి ప్రాచీన సాహిత్య ప్రమాణాలు ఎలా నిలబెట్టారో నిరూపించాడు. ఈ విమర్శనా శైలి సరికాదని రారా ధ్వజమెత్తాడు.. ఈ క్రమంలో ఆయన సాధించిన ఒక సాహిత్య విజయం ఉంది. ఇతరేతర శక్తులు లేస్తే పడిపోయెను పేకమేడలై అని దేశచరిత్రలులో శ్రీశ్రీ చేసిన ప్రయోగం శ్రామిక శక్తికి ప్రతీకగా చెబుతుండేవారు. కానీ

ఆయన తతిమ్మా అన్న మామూలు అర్థంలోనే ఆ ప్రయోగం చేశారని అద్దేపల్లి తేల్చారు. ఆ విశ్లేషణ సరికాదని రారా వాదన. చివరకు శ్రీశ్రీ అద్దేపల్లితోనే ఏకీభవించారు. జాషువా పద్యాలంటే అద్దేపల్లికి మరీ ఇష్టం. ఆయనపై రాసిన పుస్తకాన్ని ఇటీవలే ప్రజాశక్తి బుక్‌హౌస్ పునర్ముద్రించింది. ప్రముఖ తమిళ రచయిత చిన్నప్ప భారతి ఏర్పాటు చేసిన సాహిత్య పురస్కారాన్ని ఆయన రచించిన 'పొగచూరిన ఆకాశం' గ్రంథానికి 2011లో ప్రదానం చేసిన సందర్భంలో తన భావజాలాన్ని ప్రస్ఫుటంగా ప్రకటించారు. ఈనాటి పరిస్థితుల్లో వామపక్షాలు ముఖ్యంగా సిపిఎం చెప్పే ప్రత్యామ్నాయ విధానాలే సరళీకరణ ప్రపంచీకరణ దాడికి విరుగుడు అని విశ్వసించడమే గాక పదే పదే ఆ విశ్వాసాన్ని వ్యక్తం చేసిన సాహిత్యకారుడు. 'నే సలాము చేస్తా ఈ జనానికి పేదవాడి కోసం పోరు చేసేవాళ్లకు' అని ఆయన పాడుతుంటే సభలో కరతాళధ్వనులు మార్మోగుతుండటం అందరికీ అనుభవమే. ప్రజల పోరాటాల గురించి, సైద్ధాంతిక సమస్యల గురించి అవకాశం దొరికితే ఆయన వివరంగా చర్చించేవారు.

చాలా మంది రచయితలు రాతగాళ్లమే గాని కూతగాళ్లం కాదని చెబుతుంటారు. కానీ అద్దేపల్లి మంచి వక్త. సాంస్కృతిక కాలుష్యం గురించిన ఆయన ఉపన్యాసం ఉర్రూతలూపుతుంది. సామ్రాజ్యవాద ఆధిపత్యాలపై ఆగ్రహం నిప్పులు కక్కుతుంది. పద్యాలు, పాటలు శ్రావ్యంగా ఆలపించగల గాత్రం. మకుటంతో రాసిన గజళ్లు అలా తీగసాగుతుంటాయి. ఈ ధనమంత పోనీ యవ్వనమంత పోనీ ఆనాటి బాల్యాన్ని ఒకసారి రానీ అని పాడుతుంటే ప్రతివారూ చిన్నపిల్లలై పోవలసిందే! ఎనభై ఏళ్లు అని చెబితే తప్ప నమ్మలేనంత హుషారుగా ఉండే వ్యక్తి ఆయన. శ్రీకాకుళం నుంచి చిత్తూరు, హైదరాబాదు నుంచి ఆదిలాబాదు వరకూ చిన్న, పెద్ద తేడా లేకుండా సాహిత్యకారులందరితో ఆత్మీయంగా మసలుతూ స్నేహం పంచిన అక్షర యోధుడు. గత నవంబరు 29న విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురజాడ శతవర్ధంతి సభలకు ఆయన అనారోగ్యంతో రాలేకపోయినట్టు చెప్పారు. నాకు తెలిసి ఆయన అనారోగ్యం వల్ల ఒక సభకు రాకుండా ఆగిపోవడం అదే మొదటిసారి, చివరిసారి. తన 80వ జన్మదినోత్సవం ఈ మధ్యనే జరుపుకొన్నారు. విశాఖలో సిపిఎం మహాసభల సందర్భంగా పుస్తక మహోత్సవంలోనూ కలిసి ఉన్నాము. తూర్పుగోదావరి జిల్లా సాహితీ స్రవంతి మహాసభలో తిరిగి

**ఈ ధనమంత పోనీ యవ్వనమంత పోనీ ఆనాటి బాల్యాన్ని ఒకసారి రానీ అని పాడుతుంటే ప్రతివారూ చిన్నపిల్లలై పోవలసిందే! ఎనభై ఏళ్లు అని చెబితే తప్ప నమ్మలేనంత హుషారుగా ఉండే వ్యక్తి ఆయన.**


అధ్యక్షుడుగా ఎన్నికైనారు. గత అక్టోబరులో మా ఇంటికి వచ్చి వెళ్లారు. మరి ఇంతలోనే అస్వస్థత ఏమిటని విచారిస్తే హఠాత్తుగా ప్రోస్టేట్ కేన్సర్ బయటపడిందని చెప్పారు. అందరికీ చెప్పి ఆందోళన పర్చడం ఇష్టం లేక ఈ సమాచారం కుటుంబ సభ్యులకే పరిమితం చేశారని అద్దేపల్లికి అతి సన్నిహితుడైన స్రవంతి మిత్రుడు గనారా (నాగేశ్వరరావు) చెప్పారు. అద్దేపల్లి ఒక్కసారిగా దెబ్బతినడం పట్ల ఆపలేని దుఃఖం వ్యక్తపర్చారు. అదే రోజు ఆయన కుమారుడు, రచయిత అద్దేపల్లి ప్రభు ఫోన్‌లో కొంత మెరుగ్గా ఉన్నట్టు చెప్పడంతో మళ్లీ ఆశ కలిగింది. కానీ మూడు రోజులలోనే ఆయన ఆఖరిశ్వాస విడిచారు. చిక్కడపల్లి నుంచి ఢిల్లీ వరకూ చాలా చోట్లకు ఆయనతో కలసి వెళ్లినప్పుడు ఆయన కోసం కుర్రాళ్ల నుంచి ఐఎఎస్‌ల వరకూ రావడం చాలా ఆనందం కలిగించేది. లోతైన విషయాలు చర్చించిన ఆ విమర్శకుడు అర క్షణంలో యువకవులతో కలసి కబుర్లలో మునిగిపోయి కేరింతలు కొట్టేవారు. అంత నిర్మలమైన వ్యక్తిత్వం ఆయనది. ఆరు దశాబ్దాల సాహిత్య యాత్రలో తనకు విస్తారమైన స్నేహ సంబంధాలు, పేరుప్రతిష్టలు, పరిచయాలు ఉన్నా స్వంతానికి వాడుకోని విలక్షణ వ్యక్తి అద్దేపల్లి. కొంత మంది సాహిత్యకారుల లాగా ఆయన బిరుదుల కోసం, పదవుల కోసం ఎన్నడూ ఆరాటపడలేదు. 'కళాత్మకంగా' బతికే చాలామందికి ఉండే వ్యసనాలు, వ్యామోహాలు దరికి రానివ్వని అద్దేపల్లి నిండు కుటుంబీకుడు. ఆయనకు నలుగురు కుమారులు. వామపక్ష ఉద్యమాలతో సంబంధం ఉన్నవారే. భార్య చాలా కాలం పాటు అస్వస్థతతో ఉంటే ఈ పర్యటనల మధ్యనే దగ్గరుండి సేవ చేసి కొంత మెరుగుపడినందుకు సంతోషించారు. ఇంతలో అనుకోని విధంగా ఆయనకు కేన్సర్ ఆలస్యంగా బయటపడి అది వేగంగా ప్రాణాలు హరించేసింది.

**– మేం సలాము చేస్తాం అద్దేపల్లికి..**
**చైతన్య స్నేహం పంచి వెళ్లేవాడికి...**

నివాళి

# సాగిపోయిన రాస్తాలూ.. మలుపు తిప్పిన చౌరాస్తాలూ ...

- అద్దేపల్లి రామమోహనరావు



*06 . 09 .1936 - 13 . 01. 2016*

***బందరు హిందూ కాలేజీలో లెక్చరరుగా చేరాను. అక్కడి నుంచి నాలో మార్పు మొదలైంది. ఈ మార్పుకి జీవితంలోని సంఘర్షణలే కారణం. నిరుపేదరికం, అందువల్ల కలిగిన సామాజిక, ఔద్యోగికాది ఘర్షణలు, ప్రతిఘటన స్వభావానికి దారితీసాయి. ప్రగతిశీలతకు అవసరమైన నేపథ్యం బలపడింది. ఆధునిక సామాజిక కవులందర్నీ అధ్యయనం చేయడం ప్రారంభించాను. గురజాడ, శ్రీశ్రీ, ఆరుద్ర, కుందుర్తి, తెలంగాణా ఉద్యమ కవిత్వం - అన్నీ చైతన్యంలో లీనమయ్యేటట్లు చదివాను. ఇంతకు ముందరి నేపథ్యం నాలో సౌందర్య గ్రహణ శీలతనీ, అభివ్యక్తి వైవిధ్యాన్నీ స్థిరపరచగా, ఆధునిక స్పృహ సామాజిక వస్తు నిమగ్నతను దృఢపరచింది. అందులో కూడా నా జీవితానుభవాల్లోంచే వర్గచైతన్య దృక్పథం కూడా కవిత్వానికి పునాది అయింది.***

1954 – 56 మధ్య నేను బిఏ తెలుగు ప్రధానాంశంగా, నా జన్మస్థలమైన బందరు, నేషనల్ కాలేజి (అదే తర్వాత జాతీయ కళాశాలగా మార్చబడింది)లో చదివాను. బందర్లో ఒక చివర 'చింతగుంటపాలెం' అనే పేట ఉంది. బాల్యం అక్కడే గడిచింది. చిన్నప్పటి నుండి ప్రకృతినే చదివాను. ఆ రోజుల్లో ఈ రోజులంత భయంగా ఉండవలసిన అవసరం లేదు. అందుకే తల్లిదండ్రులు పిల్లల్ని ఆటల కోసం స్వేచ్ఛగా వదిలేవారు. బాల్యమంతా కాలవ ఒడ్డున, చెట్ల మధ్య, ప్రకృతి నీడలో గడిచింది. ఇంట్లో తండ్రి, తాతల నుండి సాహిత్య వారసత్వం లేకపోవడం వల్ల బాల్యంలో సాహిత్యమంటే తెలియదు. బిఏ వరకూ కూడా తెలియదు. బిఏలో సాహిత్యాభిలాష ఏర్పడింది. ఒక నిరంతర మిత్రుడుగా సహాధ్యాయి అభిరుచి కలిగించాడు.

అతనికి విశ్వనాథ సత్యనారాయణ కవిత్వం బాగా ఇష్టం. అతని వల్ల విశ్వనాథ అంటే ఇష్టం ఏర్పడింది. మా కుటుంబ వాతావరణంలో ఛాందసత్వం ఏ మాత్రమూ లేకపోవడం వల్ల విశ్వనాథను సంప్రదాయం కోసం మా స్నేహితుడు గానీ, నేను గానీ ఇష్టపడలేదు. ఆయన ఏకవీర, తెరచి రాజు, వేయి పడగలు మొదలైన నవలల్లోనూ, ఆయన పద్యాల్లోని (మాకు అర్థమైన మేరకే) ఉన్న అనేక విధాలైన అభివ్యక్తి మార్గాలలోనూ ఉన్న స్వయం ప్రతిభకు ఆకర్షింపబడ్డాం. ఆయా సన్నివేశాల్లోని మనస్తత్వ రహస్యాలకూ, లోకజ్ఞానానికీ, ప్రకృతి వర్ణనలకూ ఆశ్చర్యపోయాం. భావకవిత్వం కూడా ఎంతగానో ఆకట్టుకుంది. కృష్ణశాస్త్రి 'ఆమె కన్నులలో అనంతాంబరపు నీలినీడలు కలవు' అన్న భావచిత్రం కొన్నాళ్ల వరకూ వెంటాడింది. జాషువా 'నా కవితాలతాంగి వదనమ్ము...' కన్నీళ్లు తెప్పించింది. టాగూర్ కవిత్వం, ముఖ్యంగా 'చిత్ర'నాటకం, (స్ట్రేబర్డ్స్)' లఘు కవితలూ, 'గీతాంజలి' కవితా వచనాలూ రక్తంలో కలిసిపోయినై. ఇవన్నీ అనువాదం చేసుకున్నాను. 'గీతాంజలి'ని అనువదించి ఒక మిత్రుడికి వినిపించాను. ఆయన ఏమన్నాడంటే, 'వీటిని

ఐదేళ్ల తర్వాత మళ్లీ చదవండి. అప్పుడు ప్రింట్ చెయ్యండి' అన్నాడు. ఎంతో బాగా అనువదించాననుకున్న నా బాల్య గర్వం కోపం తెప్పించింది. మిత్రుని మీద అపారమైన గౌరవం ఉండటం వల్ల ఏమీ అనలేదు. అయిదేళ్ల తర్వాత చదివి, ఆ అనువాదం ఎందుకూ పనికి రాదనుకుని చింపేశాను.

**అన్ని పత్రికల్లో కవితలు ప్రచురించబడేవి. అవే తరువాత 'అంతర్జ్వాల' కవితా సంపుటిగా ముద్రణ పొందాయి. జీవితం వర్గ చైతన్యాన్నివ్వగా, విమర్శపై గల ఆసక్తి వలన కవిత్వం, అభివ్యక్తిలోని వైవిధ్యాన్నీ శబ్ద భావశిల్పాన్నీ సమకూర్చుకుంది.**

భావకవిత్వంలో (ఇంగ్లీషు రొమాంటిక్ కవులలోనూ) చాలా తాత్వికత కూడా ఉన్నది. మరో రకంగా చెప్పాలంటే అది 'జీవుని వేదన'. అది కొందరిలో దైవ సంబంధంగా, మరికొందరిలో మార్మికతాపూర్వకంగా వ్యక్తమవుతుంది. కృష్ణశాస్త్రి 'అన్వేషణ'లో రాధ వియోగంగా కనిపిస్తుంది. మరికొందరిలో మార్మిక వేదనగా రూపొందుతుంది. ఏమైనా ఈ వేదనాంశం బాగా ఆకట్టుకునేది. అలా కొన్ని వందల కవితలు రాసుకున్నాను. మరీ ముఖ్యంగా వివేకానందుడు ఆత్మశక్తి వికాసం గూర్చి చెప్పిన మాటలు నన్ను బాగా ప్రభావితం చేశాయి. నాకు మతమో, భక్తి భావనో, సంప్రదాయమో ఉండటం వల్ల పైవన్నీ ఆకర్షించలేదు. కవిత్వపు గాఢత, సౌందర్య దృక్పథం, వేదనా తీవ్రత కుదిపేశాయి. అది మొదటి కవిత్వ దశ. అది 1960 వరకూ సాగింది. ఈ సమయంలోనే నాకు ఆసక్తి కలిగింది విశ్వనాథ విమర్శమార్గం మీద. ఆయన భావాలూ, ప్రచారోద్యమం, విశ్వాసం ఎలా ఉండనీ, ప్రాచీన కావ్యాల్ని ఛాందసుల వలె కాకుండా, శిల్ప రీత్యా విశ్లేషించడం నాకు గొప్పగా అనిపించేది. అసలు అలాగే ప్రాచీన కవుల్ని చదవాలని చెప్పాడు. 'నన్నయ ధర్మాన్ని ఉద్ధరించాడు అంటే అది సాహిత్య విమర్శ కాదన్నాడు. అక్షరం దగ్గర నుండి కథా నిర్మాణం దాకా, అది ఒక నిర్మాణం, అలా పరిశీలించడమే విమర్శ అన్నాడు. నన్నయమీదా, పెద్దన మీదా అభిజ్ఞాన శాకుంతలం మీద ఈ దృక్పథంతోనే విమర్శ గ్రంథాలు రాశాడు. అక్కడక్కడ ఆయన విశ్వాసాలు ఉన్నా, అవి నాకు నచ్చేవి కావు. శిల్ప విమర్శ, మొదటిసారిగా చేసిన ఆయన విధానం ఆకర్షించింది. ఇలా విమర్శ మీద కూడా ఆసక్తి ఏర్పడింది. ఆ మార్గంలో విశ్వనాథ మీదా, తిక్కన మీదా, పెద్దన మీదా తదితరుల మీదా కొన్ని వ్యాసాలు రాశాను. ఇలా కవిత్వమూ, విమర్శ జంటగా నాలోని చైతన్యంలో సమాంతరంగా పరిణమించడం మొదలైంది.

1960-62 మధ్య తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఏ (తెలుగు) చదివాను. అప్పుడు మాకు జిఎన్ రెడ్డి, కోరాడ మహాదేవశాస్త్రి, భద్రిరాజు కృష్ణమూర్తి, తిమ్మావఝుల కోదండ రామయ్య, భూపతి లక్ష్మీనారాయణ మొదలైన వారంతా గురువులు, ఎంఎలో కొన్ని ఇంగ్లీషు విమర్శ మార్గాలు చెప్పినా, ఎక్కువగా ఆ రోజుల్లో అందరూ చదివేది అలంకార శాస్త్రమే. ఆధునికతకు కొన్ని సవరణలు ఉన్నా ఏ విమర్శ మార్గమూ అప్పట్లో నిర్దిష్టం కాలేదు. కేతు విశ్వనాథరెడ్డి, చెన్నారెడ్డి, రామప్పనాయుడు మొదలైన వారి వల్ల మార్క్సిజమ్ అనేది ఒకటి ఉందని తెలిసింది గాని, మనసు అటు వైపు పోలేదు. ఆధునికతకు బీజాలు వేసిన 'కట్టమంచి' మొదలైన వారి పుస్తకాలు చదివాను గాని, మార్క్సిస్టు సాహిత్య విమర్శ అనేది ఒకటి రూపొందలేదు. కాబట్టి, పాఠ్యాంశాల్లోనూ లేకపోయింది. ఎంఏ చదువుతున్నప్పుడు రాసింది చాలా తక్కువే. అయినా ఆధునికత అత్యల్పమే.

ఎంఏ పూర్తయిన తర్వాత, బందరు హిందూ కాలేజీలో లెక్చరరుగా చేరాను. అక్కడి నుంచి నాలో మార్పు మొదలైంది. ఈ మార్పుకి జీవితంలోని సంఘర్షణలే కారణం. నిరుపేదరికం, అందువల్ల కలిగిన సామాజిక, ఔద్యోగికాది ఘర్షణలు, ప్రతిఘటన స్వభావానికి దారితీసాయి. ప్రగతిశీలతకు అవసరమైన నేపథ్యం బలపడింది. ఆధునిక సామాజిక కవులందర్నీ అధ్యయనం చేయడం ప్రారంభించాను. గురజాడ, శ్రీశ్రీ, ఆరుద్ర, కుందుర్తి, తెలంగాణా ఉద్యమ కవిత్వం – అన్నీ చైతన్యంలో లీనమయ్యేటట్లు చదివాను. ఇంతకు ముందరి నేపథ్యం నాలో సౌందర్య గ్రహణ శీలతనీ, అభివ్యక్తి వైవిధ్యాన్నీ స్థిరపరచగా, ఆధునిక స్పృహ సామాజిక వస్తు నిమగ్నతను దృఢపరచింది. అందులో కూడా నా జీవితానుభవాల్లోంచే వర్గచైతన్య దృక్పథం కూడా కవిత్వానికి పునాది అయింది. దీనికి సంబంధించిన సిద్ధాంత పరిజ్ఞానంతో గాని, ఇతర కవుల ప్రభావం చేత గాని, నేను రాయకపోయినా,

జీవితానుభవం నుంచే రాయడం వల్ల సామాజికమైన దుర్మార్గాల పట్ల బలమైన ప్రతిఘటన శక్తి ప్రతి ఫలించింది. అభ్యుదయ కవిత్వం అనే ప్రత్యేక మార్గానికి రాకపోయినా, ప్రగతిశీలతయే ప్రధానం కావడం వల్ల అభ్యుదయ భావన కల వారినందర్నీ ఆకర్షించింది. అన్ని పత్రికల్లో కవితలు ప్రచురించబడేవి. అవే తరువాత 'అంతర్జ్వాల' కవితా సంపుటిగా ముద్రణ పొందాయి. జీవితం వర్గ చైతన్యాన్నివ్వగా, విమర్శపై గల ఆసక్తి వలన కవిత్వం, అభివ్యక్తిలోని వైవిధ్యాన్నీ, శబ్ద భావశిల్పాన్నీ సమకూర్చుకుంది. అంతకుముందే పద్యాలు రాస్తున్నప్పుడు చేసిన ఉమర్‌ఖయ్యాం రుబాయిల అనువాదం, 69లో ముద్రణ కాగా, అంతర్జ్వాల' 70లో అచ్చుపడింది. రచయితలకి పుస్తకాలు రాయడానికీ, అవి బయటకి రావడానికీ మధ్య తక్కువో, ఎక్కువో ఎడం రావడం సర్వసాధారణం.

1963 నుండీ ఆధునిక చైతన్యం ఏర్పడిన తర్వాత కొద్దికాలంలోనే సామ్యవాదం గురించిన అభిమానం ప్రారంభమయింది. దీనికి కారణం టిఎల్ కాంతారావు నాకు ప్రత్యక్ష శిష్యుడు. సాహిత్యపరమైన అనుయాయి కావడం. 64 ప్రాంతంలో దివిసీమలోని కమ్యూనిస్టు పోరాటాన్ని ఒక నిరంతరావేశంగా నింపుకుని వచ్చి, బందరు హిందూ కాలేజీలో చేరినవాడు. శ్రీశ్రీ మహాప్రస్థాన గీతాల్ని ఎప్పుడుపడితే అప్పుడు అప్పగిస్తూ ఉండేవాడు. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని గూర్చి చదవకపోయినా, ఆ చైతన్యాన్ని 'తలగడ దీవి' అనే ఊరు నుండి తనతో తెచ్చుకున్నవాడు. కాంతారావు నాతో 'మాష్టారూ' మహాప్రస్థానం గూర్చి వ్యాసాలు రాయండి అన్నాడు. 'మహాప్రస్థానం' చదివి, అందరిలాగానే గొప్ప ఉత్తేజం పొంది ఉన్నాను కాబట్టి, ఆ కవితా సంపుటిపై వ్యాసాలు రాయడం మొదలుపెట్టాను. వారం వారం అవి ఆనాడు నీలం రాజు వెంకట శేషయ్య సంపాదకత్వంలో నడుస్తున్న 'ఆంధ్రప్రభ'లోని ఆదివారం సాహిత్యానుబంధంలో వచ్చాయి. తొమ్మిది వ్యాసాలు, తొమ్మిది కవితా కోణాల విశ్లేషణతో రాశాను. అవి వస్తుండగానే సంచలనం కలిగించాయి. ఎందుకంటే 1933 నుండి 45 దాకా మహాప్రస్థాన కవితలు వచ్చినా 1964 వరకూ పరిశీలన గ్రంథం రాలేదు. చెదురుమదురుగా కొన్ని వ్యాసాలు వచ్చినా, అభివ్యక్తిని సమగ్రంగా చర్చించిన పుస్తకం రాలేదు. అందుకనే ఆ వ్యాసాలు వస్తుండగానే, అప్పటి అభ్యుదయ రచయితలు, మిగిలినవారు అందరూ ఆనందపడ్డారు. నేను శ్రీశ్రీ కవిత్వ పరిశీలనకు 'అక్షరాక్షర పరిశీలన' అనే పదబంధాన్ని సృష్టించు కున్నాను. అప్పట్లో నాతో పాటు తిరుపతిలో చదువుతూ, 'న్యూ క్రిటిసిజమ్' మీద పరిశోధనకు, అమెరికా వెళ్ళిన చిరుమామిళ్ల సుబ్బారావు, న్యూ క్రిటిసిజమ్ పద్ధతిలో నా వ్యాసాలు మొదటిసారిగా వస్తున్నాయని అన్నారు. నేను నా పరిశీలనలో పూర్తి ఆధునికతనూ, ఆలంకారిక పాశ్చాత్య శిల్పధోరణుల అన్వయం చేశాను. 'శ్రీశ్రీ స్వతంత్ర మార్గ నిర్మాత' అనే వ్యాసంలో ఇలా అన్నాను.

'శ్రీశ్రీ పేరు వినగానే ఒక విప్లవ భావం, ఒక ప్రత్యేక వ్యవస్థాభిముఖ వేదనాజ్వాల కళ్ల ముందు కనిపిస్తుంది. ఎంతమంది ఆ భావాలని తమ కవితలో రూపుగట్టి ఉండినా ఉండవచ్చు. కాని వాటి యొక్క సమగ్రానుభూతి శిఖర స్వరూపం శ్రీశ్రీ.'

నా పుస్తకంలో నాకు తెలియకుండానే ఒక ధోరణికి బీజం వెయ్యడం జరిగింది. అది, ఒకే ఒక్క కవితని, వస్తు శిల్ప కోణాల్లో సమగ్రంగా విశ్లేషించడం. ఉదాహరణకి 'శ్రీశ్రీ – కవితా ఓ కవితా' అనే వ్యాసం. అలాగే కథా కవితల్ని విశ్లేషించడం. బాటసారి, భిక్షు వర్షీయసి, ఆకాశదీపం కవితల్లోని కథాంశ నిర్వహణని చెప్పడం, 'శ్రీశ్రీ – కథన శక్తి' అనే వ్యాసంలో చేశాను.

కొన్నిచోట్ల అలంకార శాస్త్రం మొదలైన ప్రాచీన విషయాల్ని గూర్చి ఎక్కువ తీవ్రంగా ఉద్ఘాటనలు చేయడం కొందరికి నచ్చలేదు. 1964–65 సంవత్సరాల్లో మొదటిసారి ఒక అభిమాని సమగ్ర విశ్లేషణని గమనిస్తే, గమనంలోకి తీసుకుంటే సానుకూల దృక్పథం తోనే చూస్తారు. ఈ పని కుందుర్తి, త్రిపురనేని మధుసూదనరావు ఇంకా ఎందరో చేశారు.

విశ్వనాథ, ప్రాచీన సాహిత్య విమర్శ మార్గాన్ని మార్చి, ఒకే ఒక్క కావ్యాన్ని శిల్పరీత్యా సమగ్ర విశ్లేషణ చేయడం మొదలు

**ఆధునిక కావ్యాన్ని గూర్చి వస్తుశిల్ప విశ్లేషణ చేయాలనిపించింది. నాలో గొప్ప ఉత్తేజం కలిగించిన 'మహాప్రస్థానం' మీద అలా చేద్దామని 'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' రాశాను. నా తూకపు రాళ్లన్నీ వేరే.**

పెట్టినవారు. అది నాకు చాలా ప్రేరణ కలిగించింది. ఆ విధంగా ఆధునిక కావ్యాన్ని గూర్చి వస్తుశిల్ప విశ్లేషణ చేయాలనిపించింది. నాలో గొప్ప ఉత్తేజం కలిగించిన 'మహాప్రస్థానం' మీద అలా చేద్దామని 'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' రాశాను. నా తూకపు రాళ్లన్నీ వేరే. శ్రీశ్రీపై వచ్చిన నా వ్యాసాలన్నిటినీ ఒక పుస్తకరూపంలో తెస్తామని విశాలాంధ్ర ప్రచురణాలయం వారు, అప్పటి నా విద్యార్థి ఎంవిఎల్ నరసింహారావు (నూజివీడు) ద్వారా కబురు చేశారు. రెండు, మూడుసార్లు నిడమర్తి ఉమారాజేశ్వరరావును కలిశాను. చివరకు వేయడం కుదరదని చెప్పారు. వారిలో వారు ఎంతో చర్చించుకున్న మీదట, నాపైన ఎంత సానుకూల దృక్పథమున్నా, ఏదైనా వ్యతిరేక అభిప్రాయం వస్తుందని భావించి ఉండవచ్చు. ఇక ఆ పుస్తకాన్ని నేను ప్రచురిద్దామనుకున్నాను. బందర్లో జిల్లా సెంట్రల్ లైబ్రరీ పక్కన విజయా ప్రెస్ ఉండేది. వారిని సంప్రదించాను. పుస్తకానికయ్యే ఖర్చు రూ.400. ఆ రోజుల్లో నాకు చాలా ఎక్కువ. ఏమైనా వేయించడానికి నిర్ణయించాను.

> **_'ఇతరేతర శక్తులు' అనే పదం అర్థం మీద వచ్చిన వివాదంలో శ్రీశ్రీ అతి సులభంగా, నాతో విభేదించిన వారిని సమర్థించి ఉండవచ్చు. ఎందుకంటే వారికి కమ్యూనిస్టులుగా స్నేహం ఉంది. నేను ఎవరో ఆయనకు తెలియదు. శ్రీశ్రీ నేను చెప్పిన అర్థమే సరైందనీ, తాను ఆ అర్థంలోనే ప్రయోగించాననీ చెప్పడం గొప్ప నిజాయితీతో కూడిన విషయం._**

అప్పుడు టిఎల్ కాంతారావు, వాళ్ల క్లాసు వాళ్లూ బొటానికల్ టూర్ కోసం మద్రాసు, బెంగుళూరు, కొడైకెనాల్ వైపు వెళ్తున్నారు. టిఎల్ కాంతారావు మద్రాసులో శ్రీశ్రీ గారింటికి వెళ్ళాడు. శ్రీశ్రీని కలిసి 'మా గురువు అద్దేపల్లి రామమోహనరావు మీమీద రాసిన వ్యాసాలన్నీ ఒక పుస్తకంగా తెస్తున్నారు' అన్నాడు. వెంటనే శ్రీశ్రీ వంటింట్లో వున్న భార్యని ఒక్క పెద్ద కేకతో పిలిచి 'నా మీద పుస్తకం వస్తోందోయ్' అని పెద్దగా అరిచాడట. తన మీద మొదటిసారిగా ఒక పుస్తకం వస్తోందంటే కవులు ఎంత ఆనందపడతారో అందరికీ అనుభవమే. శ్రీశ్రీ, కాంతారావుకి చెప్పినమాట ఏమిటంటే 'అయితే ఆ పుస్తకానికి విశ్వనాథ వారిచేత పీఠిక రాయించమని చెప్పండి' అని, ఈ విషయాలన్నీ కాంతారావు టూర్ నుంచి వచ్చిన తర్వాత నాకు ఎంతో ఉత్సాహంగా చెప్పాడు. ఒక పత్రికలో ఈ విషయాలు రాశాడు కూడా, అనంతర కాలంలో.

ఇంక నేను బందరు నుండి విజయవాడకు విశ్వనాథను కలవడానికి మూడు నాలుగుసార్లు వెళ్లాను. ఆయన ఊళ్లో లేకపోవడం వల్ల కలవలేకపోయాను. చివరికి బహుశా ఐదోసారి ఆయన్ని కలవగలిగాను. ఇంటిదగ్గర ఆయన కోసం ఎదురుచూస్తూ కూర్చుంటే ఆయన బజార్లోకి వెళ్లి వచ్చి నన్ను చూసి కూర్చోమని 'ఏమిటి పని' అని అడిగారు. నేను చెప్పాను. వెంటనే ఆయన నాకు సుమారు అరగంట ఉపన్యాసం ఇచ్చారు. దాని సారాంశం ఏమిటంటే, 'మేమిద్దరం భిన్నాభిప్రాయాలు గలవాళ్లం. ఆయన కోరే వ్యవస్థ వేరు, నేనుకోరే వ్యవస్థ వేరు. అందువల్ల నేను నీ పుస్తకానికి ముందు మాట రాయను' అని. నేను చేసింది కవిత్వ విశ్లేషణ అని చెప్పాను. 'నువ్వు కవిత్వ విశ్లేషణ ఎంత బాగానైనా చేసి ఉండవచ్చు. ఆయన గురించి రాసిన పుస్తకానికి పీఠిక రాయను. నువ్వు వెళ్లవచ్చు' అని లేచి లోపలికి వెళ్లిపోయారు. నేను బాధగా 'మీరు ఎలాగూ రాయరనే అనుకున్నాను' అని గొణుక్కుని వచ్చేశాను. ఆయన ఎన్నోసార్లు శ్రీశ్రీ గురించి అనుకూలంగానూ మాట్లాడారు. త్రిపురనేని గోపీచంద్ రాయించిన రేడియో నాటికల్లో శ్రీశ్రీయే యుగకర్త అని కూడా రాశారు. అయినా ఎందుకో నా పుస్తకానికి ముందుమాట రాయనన్నారు.

'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' పుస్తకావిష్కరణ బందరు టౌన్‌హాలులో జరిగింది. దానిపై మాట్లాడిన వారు జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, ఆయన నా పుస్తకాన్ని ఎంతగానో ఇష్టపడ్డారు. ఆ రోజుల్లో శ్రీశ్రీని కూడా పుస్తకావిష్కరణకి పిలవాలని గాని, ఆయన అభిప్రాయాలు తెలుసుకోవాలని గాని ఇలాంటి భావాలు లేవు. పైగా ఆర్థికమైన వెసులుబాటు లేదు. అంతేగాక సాంకేతిక పురోగమనంతో వచ్చిన సభా నిర్వహణలోని అనేకాంశాలు ఆనాడు లేవు. ఇప్పుడు అనిపిస్తుంది శ్రీశ్రీని కూడా పిల్చి ఉంటే బాగుండునని.

శ్రీశ్రీ జీవితంలో ఉన్న నిజాయితీ వివాదాస్పదం కావచ్చు గాని, సాహిత్యపరంగా ఆయన నిజాయితీ మొదటి నుంచి చివరి వరకు అచంచలం. విరసంలో ఉన్నప్పుడు కూడా ప్రాచీన సాహిత్యం మొదలుకుని ఆధునిక సాహిత్యం దాకా

తన అభిప్రాయాల్ని తాననుకున్నట్లే చెప్పడానికి జంకలేదు. నా పుస్తకం వచ్చిన తర్వాత కొన్నాళ్లకు 'ఇతరేతర శక్తులు' అనే పదం అర్థం మీద వచ్చిన వివాదంలో శ్రీశ్రీ అతి సులభంగా, నాతో విభేదించిన వారిని సమర్థించి ఉండవచ్చు. ఎందుకంటే వారికి కమ్యూనిస్టులుగా స్నేహం ఉంది. నేను ఎవరో ఆయనకు తెలియదు. శ్రీశ్రీ నేను చెప్పిన అర్థమే సరైందనీ, తాను ఆ అర్థంలోనే ప్రయోగించాననీ చెప్పడం గొప్ప నిజాయితీతో కూడిన విషయం. శ్రీశ్రీ ప్రతీకల గురించి నేను చెప్పిన అంశాలు, తర్వాతి కాలంలో కొందరు ఆయన ప్రతీకల్ని పరిశీలించడానికి దారితీసింది.

1968-71 మధ్య నందిగామలో 'ది దెన్' ఎన్‌టిఆర్ కాలేజీలో లెక్చరరుగా పనిచేశాను. నందిగామ ఊళ్లో అప్పుడు సిపిఐ ప్రభావం బాగా ఎక్కువ. మా విద్యార్థుల్లోనూ చాలామంది పార్టీ సభ్యులు, కార్యకర్తలు ఉండేవారు. వారందరూ నాకు దగ్గరగా ఉండేవారు. వాళ్లందరికీ 'నా అంతర్జ్వాల' చాలా ఇష్టమైన కవితా సంపుటి.

*'ఇది అంతర్జ్వాల*
*మనిషనే అగ్గిపుల్లని*
*ఏ రోడ్డు మీద గీసినా భగ్గున మండే*
*సమాజ బాధామయ వాతావరణం*
*గుండెలో రాజుకుంటున్న మహాజ్వాల*
*పెద్ద పెద్ద యినప్పెట్టెల్లో*
*కన్నీళ్ళూ*
*చిన్నకార్లటైర్ల అడుగున*
*గుండెకాయలూ*
*ఎయిర్ కండిషన్ మేడల పునాదుల్లో*
*స్వేద ప్రవాహాలూ*
*బంగారు గుమ్మాల మీద కుంకుమబొట్లలో*
*నెత్తురు జీరలూ*
*విందు భోజనాల విస్తళ్ల కింద*
*ఆకలి చావులూ*
*తాగి తాగి తూలేవాళ్ల అరికాళ్ల కింద*
*సన్నని అరుపులూ*
*రాజకీయాల కత్తి అంచుల పొదుగునా*
*నిండు బ్రతుకులు'*

ఇలాంటి కవితలన్నీ అభ్యుదయ భావుకులందరూ చదువుతూ ఉండేవాళ్లు. వామపక్ష విద్యార్థులతో నా స్నేహం వల్ల కాలేజి అధ్యక్షుల కోపానికి కూడా గురయ్యాను.

కాలేజికి గ్రాంట్స్ లేకపోవడం వల్ల మూడేళ్లూ చెప్పరానంత కష్టాల్లోనే గడిచిపోయింది. కవిత్వం రాస్తున్నా అచ్చువేసుకునే శక్తి లేదు.

1971లో కాకినాడలో ఎంఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ప్రారంభింపబడిన సమయంలోనే లెక్చరరు ఉద్యోగం వచ్చింది. బందరు వాస్తవ్యులు, 'తెలుగు విద్యార్థి' సంపాదకులు, నాకు మంచి మిత్రులు కొల్లూరి కోటేశ్వరరావు సహకారంతో వచ్చింది. నా జన్మస్థలమైన బందరూ సముద్రతీరమే. ఉద్యోగస్థలమైన కాకినాడ సముద్ర తీరమే. అందుకే 1995లో రాసిన 'మెరుపు పువ్వు' అనే దీర్ఘకవితలో

***'బందరు సముద్రం ఒక్క తన్ను తంతే***
***కాకినాడ సముద్రం ఒడ్డున పడ్డాను'***

అని రాశాను. నాకు సముద్రం, ఒక నిత్య చైతన్యాంశం. అందుకే 'సముద్రం' భావచిత్రాలు నా కవిత్వంలో అనేకచోట్ల కనిపిస్తాయి. విదేశీ వ్యాపార సంస్కృతిని మోసుకు వచ్చే సముద్రం కూడా. ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వంలో చాలాచోట్ల భావ చిత్రీకరణ పొందింది.

1970 నుండి 75 వరకూ నా సాహితీ జీవితంలో చాలా చైతన్యవంతమైన సంవత్సరాలు. ఎందుకంటే ఆంధ్రదేశం విప్లవోద్యమంతో అట్టుడికి పోతోంది. విప్లవోద్యమాన్ని సమర్థించేటందుకు ఏర్పడిన విప్లవ రచయితల సంఘం, సరికొత్త భావాల్ని తీవ్రంగా ప్రచారం చేస్తోంది. అంతకుముందు గొప్ప రచయితలుగా పేరు పొందిన శ్రీశ్రీ, కొడవటిగంటి మొదలైన ఎందరో విప్లవ రచయితల సంఘంలో చేరి కొత్త భావజాలంతో రచనలు చేస్తున్నారు. ఆంధ్రదేశంలోని కవుల్లో ఎంతోమంది విప్లవాభిముఖమైన కవిత్వం రాస్తున్నారు. విప్లవం వల్ల అంతకు ముందరి దారుణ పరిస్థితులన్నీ మారిపోయి, సామ్యవాదం వస్తుందని ప్రజలు చాలా ఆశించిన సమయం. మరీ ముఖ్యంగా సమర్థులైన కవులెంతో మంది విప్లవాన్ని తమ కవితా వస్తువుగా చేసుకున్నారు.

> ***'సముద్రం' భావచిత్రాలు నా కవిత్వంలో అనేకచోట్ల కనిపిస్తాయి. విదేశీ వ్యాపార సంస్కృతిని మోసుకు వచ్చే సముద్రం కూడా. ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వంలో చాలాచోట్ల భావ చిత్రీకరణ పొందింది.***

విప్లవోత్తేజం నాలోనూ కలిగింది. ఈ చైతన్యం అంతకు ముందులేని ఒక అంశం మీద బాగా కృషి చేయించింది. అది రాజకీయ పరిజ్ఞానం. మార్క్సిజం గురించి ఎన్నో గ్రంథాలు చదవడం, అవగాహన కోసం తపించడం, సాహిత్యానికి మార్క్సిజంని అన్వయించే మార్గాల గూర్చి ఆలోచించడం నిత్యకృత్యమయింది. ఆ రోజుల్లో రష్యా నుండి ఎన్నో రాజకీయ, సాహిత్య శాస్త్రాల గురించిన గ్రంథాలు అతి చౌకధరలకు వచ్చేవి. వచ్చిన ప్రతి పుస్తకాన్నీ విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో కొనేవాణ్ణి. ఆ అయిదేళ్లూ ఆవేశం పూర్తిగా ఆక్రమించిన రోజులు. విప్లవ కవితలు చాలా రాశాను. ఎన్నో పాటలు రాశాను. విప్లవ రచయితలతో, శ్రీశ్రీతో ఎన్నో సభల్లో పాల్గొన్నాను. అనంతర కాలంలో నా కవితలు 'రక్త సంధ్య' అనే పేరుతో ప్రచురితమయ్యాయి.

ఆ రోజుల్లో కాకినాడలో మాకొక కవుల బృందం ఉండేది. జి. సుబ్బారావు, కడలి సత్యనారాయణ, సింగంపల్లి అశోక్‌కుమార్, రారాసి, విక్రాంత్, చంద్రశేఖర్ ముఖ్యమైన కవుల సమూహం. ఎక్కడ కవితా గోష్ఠులు జరిగినా మా విప్లవ కవితా పఠనం ఉండేది. ఎమర్జెన్సీ సమయంలో నేను రాసిన 'ఏం చెయ్యాలేం చెయ్యాలి! ఇందిరమ్మకు భజన చెయ్యాలి' అనే పాట బహుళ ప్రచారం పొందింది. మేమంతా 'నారాయణ' బార్బర్ షాపులో రోజూ కలిసేవాళ్లం. అశోక్‌కుమార్ 'తల్లీ ఎవరు నువ్వు' అనే పుస్తకం రాస్తే, దానికి పెద్ద ముందుమాట రాశాను. అది తీవ్రమైన ముందుమాట. ఎండోమెంట్స్ వారి ఆధిపత్యంలో నడుస్తున్న కాలేజీలో పనిచేస్తున్నాను గనుక, ఆ ముందుమాట నాస్తికత్వాన్ని బలపరుస్తుంది గనుక నన్ను కాలేజి నుండి డిస్‌మిస్ చేయడానికి కొందరు తీవ్ర ప్రయత్నాలు చేశారు. వారి ప్రయత్నాలు ఫలించలేదు.

అప్పటి స్నేహితుల్లో కడలి సత్యనారాయణ దళితోద్యమం రాగానే అందులో నిమగ్నమై 'గోదావరి కెరటాలు' అనే పత్రిక నాలుగైదేళ్లు నడిపి తర్వాత అస్వస్థతతో కీర్తి శేషుడైనాడు. అలాగే విక్రాంత్ కూడా మద్రాసులో చదువుతూ ప్రమాదంలో మరణించాడు. తర్వాతి కాలంలో జి.సుబ్బారావు మంచి కవిగా, విమర్శకుడిగా ప్రసిద్ధుడైనాడు. అశోక్‌కుమార్ ప్రగతిశీల మినీ కవితా రచనలో సరికొత్త రీతిలో సాగిపోతున్నాడు. శ్రీశ్రీపై అవిరళ కృషి చేస్తూ శ్రీశ్రీ బులెటిన్‌లు తెస్తూ, ఇంతకుముందు ప్రచురితం కాని ఎన్నో విశేషాల్ని బయటకి తెస్తున్నాడు. విప్లవ సాహిత్యం ముందుకి తెచ్చిన ముఖ్యమైన అంశాలు మూడు

1) అంతకు ముందు అభ్యుదయ కవిత్వంలో 'పరిష్కారం' లేదు. దీనికి పరిష్కారం ముఖ్యం.

2) విప్లవ సాహిత్యానికి 'రాజకీయం' ప్రధాన సూత్రం.

3) కవిత్వంలో అభివ్యక్తి గురించి ఆలోచన అవసరం లేదు. వస్తువు (విప్లవ వస్తువు) మాత్రమే సర్వమూ అవుతుంది.

నాలో విప్లవావేశం ఎంత ఉన్నా, పటిష్టమైన సాహితీ సృజన పునాదిగా ఉన్నవాణ్ణి కాబట్టి విప్లవ సాహిత్యంలో మమేకం కాలేకపోయాను. 'పరిష్కారం' కాలానుగుణంగా, సామాజిక చలన సూత్రాల మీద ఆధారపడి ఉంటుంది గాని, భావజాలంలా అది శాశ్వతం కాదు. పరిష్కారమే కవితా వస్తువైతే దానికి చిన్న పరిధి మాత్రమే ఉంటుంది కాని, సమాజ వైరుధ్యాలన్నిటినీ చెప్పే విస్తృతి ఉండదు. అందువల్లనే 1975 తర్వాత, ప్రగతిశీల విస్తృత పరిధి అనివార్యంగా వస్తువుకి ఏర్పడింది.

కవిత్వంలో రాజకీయమే ముఖ్యమైతే, ఆ రాజకీయానికి నేపథ్యంగా ఉన్న ప్రజా జీవితం లోని సకల పార్శ్వాలు, జీవన వాస్తవికతలూ అదృశ్యమై పోతాయి. అందువల్ల రాజకీయ స్పృహ మాత్రమే ఉన్న కవిత్వం విశాల ప్రజానీకానికి దూరమైపోతుంది.

సాహిత్యానికి అభివ్యక్తి చాలా ముఖ్యమని, మార్క్స్, లెనిన్, తదితర మార్క్సిస్టు మేధావులందరూ ముక్తకంఠంతో చెప్పారు. వివాదప్రాయమైన రచనలు ప్రయోజనం నెరవేర్చలేవనీ చెప్పారు. మార్క్స్, లెనిన్‌ల సాహిత్యపరమైన 'అనుభూతి, జగత్ ప్రసిద్ధం. షేక్స్పియర్ మార్క్సిస్టు కాదు. అయినా మార్క్స్‌కి ఆరాధ్య రచయిత. విప్లవ రచయితలూ, విమర్శకులూ, విప్లవ కేంద్రీకృత వస్తువును గూర్చి ఎన్నెన్నో లోతైన పరిశీలనలు చేశారు గాని, శిల్ప వివరణను

**విప్లవ సాహిత్యంలో మమేకం కాలేకపోయాను. 'పరిష్కారం' కాలానుగుణంగా, సామాజిక చలన సూత్రాల మీద ఆధారపడి ఉంటుంది గాని, భావజాలంలా అది శాశ్వతం కాదు. పరిష్కారమే కవితా వస్తువైతే దానికి చిన్న పరిధి మాత్రమే ఉంటుంది కాని, సమాజ వైరుధ్యాలన్నిటినీ చెప్పే విస్తృతి ఉండదు.**

అప్రస్తుతంగా భావించారు. పైగా శిల్పాన్ని అనావశ్యకంగా కూడా చూశారు. ఇది నాకు నచ్చేది కాదు. విప్లవ రచయితల వల్ల మార్క్సిజంలోని అనంతమైన విషయాల్ని అవగాహన చేసుకున్నాను గాని, ఇలాంటి అంశాలు చాలా అహేతుకంగా కనిపించేవి. రాజకీయంలోంచి సాహిత్యంలోకి వచ్చిన వాళ్లకీ, సాహిత్యం లోంచి రాజకీయాల్లోకి వెళ్లే వాళ్లకీ ఇలాంటి భేదాలు చాలా ఉంటాయి. అందువల్లనే కాకినాడలో మా కవుల బృందం విప్లవ కవిత్వం రాసింది గాని, విప్లవ రచయితల సంఘంలో చేరలేదు. కవితాత్మకమైన ఆవేశం, రాజకీయపరమైన ఉద్రేకం, సామాజికమైన కసి కలిసినప్పుడు, ఆ రోజుల్లో విప్లవ రచనా నిమగ్నుడు కావడం చాలా సులభం. మౌలికంగా తాత్కాలిక రాజకీయ నిబద్ధుడా లేక ప్రగతిశీల రచనా నిబద్ధుడా అన్నది కాలాంతరాన బయటకు వచ్చే విషయం. అందుకే నా పరిణామాన్ని గురించి నేను రాసిన 'మెరుపు పువ్వు' దీర్ఘ కవితలో ఒక చోట ఇలా అన్నాను.

**సాహిత్యానికి అభివ్యక్తి చాలా ముఖ్యమని, మార్క్స్, లెనిన్, తదితర మార్క్సిస్టు మేధావులందరూ ముక్తకంఠంతో చెప్పారు. వివాదప్రాయమైన రచనలు ప్రయోజనం నెరవేర్చలేవనీ చెప్పారు. మార్క్స్, లెనిన్‌ల సాహిత్యపరమైన 'అనుభూతి, జగత్ ప్రసిద్ధం.**

*'జలపాతంలోని జీవశక్తికి*
*తన మీద నుండి తాను జారిపడిపోవడమే తెలుసుగాని*
*తనలో తాను విశ్రమించడం తెలియదు*
*విద్యుదావేశపు జల బిందువు అచేతనపు పొరల్లో*
*వాగులున్నై, నదులున్నై*
*ఈ అన్నిటి మీద నుండి దూకుడే దాని అనివార్యవేగం*
*రోజూ దేవుణ్ణి తిట్టడమే పని పెట్టుకున్నవాడు*
*దేవుణ్ణి మరచిపోతే ఎదిగినట్లు*
*రోజూ సిద్ధాంతాలు వల్లించడమే పని పెట్టుకున్నవాడు*
*సిద్ధాంత ఉద్ఘాటనలు*
*ఆచరణలో మరచిపోతే ఎదిగినట్లు*
*వ్యతిరేక వాదాల్ని నరికిముక్కలు చేయడమే*
*పనిగా పెట్టుకున్నవాడు*
*వాదాల ఉప్పెనల వెనుక సముద్రమైపోయినప్పుడు*
*ఎదిగినట్లు*
*ఒకే ఒక విప్లవంలో కలల నిజాల కలనేతయైనవాడు*
*నిరంతర విప్లవంలో నిజమవుతూ సాగిపోతాడు'*

1975 ప్రాంతాల నుండి మినీ కవిత యువతరాన్ని ఉధృతంగా ఊపేసింది. అభ్యుదయ, విప్లవ కవుల దగ్గర నుండీ, పరిష్కార దృష్టి గాని, మార్క్సిస్టు అవగాహన గాని లేని సామాన్యుల వరకూ, తమ మనస్సులోని సామాజిక కసిని, దుష్ట రాజకీయ వ్యతిరేకతను, సాంస్కృతిక పతనాన్ని వ్యక్తీకరించడానికి మినీ కవిత అద్భుతంగా అమరింది. ఏమైనా సామాజిక వైరుధ్యఖండన, ఒక కొత్త రూపంలో వ్యక్తమై దావాగ్నిలా అల్లుకుంటోంది కాబట్టి, నేను ఆ వస్తురూప సమ్మిళిత చైతన్యంలో నిమగ్నమయ్యాను. మినీ కవితలపై జరిగిన ఎన్నో సభల్లో తెలుగునేల నాలుగు చెరగులా ఎన్నో ఊళ్లలో పాల్గొన్నాను. అప్పుడు నేను 'సాంస్కృతిక సమాఖ్య' అనే సంస్థకు రాష్ట్ర అధ్యక్షుణ్ణి. విజయవాడలో వి.శిరీష్‌కుమార్ ప్రారంభించిన ఆ సంస్థ ఎంతోమంది మినీ కవితా రచయితల్ని తయారుచేసింది. ఎక్స్‌రే కొల్లూరి మొదటిసారిగా 'మినీ కవితా విప్లవం' అనే కవితా సంపుటి తెచ్చాడు. ఆ రోజుల్లోనే 'మినీ కవిత' అనే వ్యాస సంపుటి ప్రచురించాను. అందులో మినీ కవితా నేపథ్యాన్ని గూర్చి, సామాజిక వస్తువు గురించి, అభివ్యక్తి రీతుల్ని గురించీ విపులంగా రాశాను. సామాజిక చైతన్యాన్ని విస్తృతంగా ప్రతిబింబింపచేస్తూ, యువతరం నాలుకల మీద ఆడే లక్షణం ఉంది కాబట్టే, ఆ రూపాన్ని నేను ప్రచారం చేశాను.

70ల నుండే కుందుర్తి నన్ను బాగా అభిమానించారు. నాతో కొంత ముందుగానే పరిచయం ఉంటే 1967లో తాను సంకలనం చేసిన 'వచన కవిత' వ్యాస సంపుటిలో నా వ్యాసం కూడా ఉండేది అని చాలాసార్లు అనేవారు. కుందుర్తి నన్ను అభిమానించడానికి కారణం విమర్శకులు, అభ్యుదయ విప్లవ కవిత్వాల్లోని వస్తువును గురించే చెప్పిందే చెప్తూ రాస్తారు గాని, కవి ప్రత్యేకతను తెలిపే శిల్పరీతుల్ని చెప్పడం లేదనీ, వాటిని కూడా నేను బాగా విస్తృతంగా విశ్లేషిస్తున్నాననీ. సమగ్ర విమర్శ విధానంలో కుందుర్తిని గూర్చి చాలా వ్యాసాలు రాశాను. వచన కవితలో కథా కావ్యాలు కూడా కోరిన కుందుర్తికి, మినీ కవితను చూసి

భయం పట్టుకుంది. ఇక ఎవ్వరూ పెద్ద కవితలు రాయరేమో అని అభిప్రాయ పడ్డారు. హైదరాబాద్‌లోనే, ఆయన సమక్షంలోనే ఒక చర్చా సభ ఎస్వీ ఏర్పాటు చేశారు. అందులో మేము ఆయన చెప్పిన కొన్ని అంశాల్ని విశ్లేషించి, మినీ కవితతో పెద్ద కవితలు అదృశ్యం కావనీ, అన్ని రూపాలూ వాటి వాటి వస్తువుల కనుగుణంగానే అమరిపోతాయనీ, సహజీవనం చేస్తాయనీ వివరించాము.

**1970- 80ల మధ్య చారు మజుందార్ మొదలైన వాళ్లు ఆశించినట్లు, విప్లవం జయించి, వ్యవస్థ మారితే ఎలా ఉండేదో గాని, ఆ విధంగా జరగకపోవడం వల్ల అనేకమంది రచయితలు తమ తమ అస్తిత్వాల కనుగుణంగా, అస్తిత్వ వాదాల్లోకి వచ్చేశారు.**

సుమారు 1980 నుండి 90ల వరకూ స్త్రీవాదం, దళితవాదం, సాహిత్యాన్నీ సమాజాన్నీ అత్యధికంగా ప్రభావితం చేశాయి. తర్వాత బిసి వాదం, ముస్లింవాదం, ఇస్లాంవాదం, ప్రాంతీయతావాదం వచ్చాయి. వీటన్నిటినీ అస్తిత్వ వాదాలు అనే పేర పిలుస్తున్నాం. 1970– 80ల మధ్య చారు మజుందార్ మొదలైన వాళ్లు ఆశించినట్లు, విప్లవం జయించి, వ్యవస్థ మారితే ఎలా ఉండేదో గాని, ఆ విధంగా జరగకపోవడం వల్ల అనేకమంది రచయితలు తమ తమ అస్తిత్వాల కనుగుణంగా, అస్తిత్వ వాదాల్లోకి వచ్చేశారు. నేనొక విస్తృత ప్రగతిశీల పరిధిని ముందుగానే నిర్ణయించుకుని ఉండటం వల్ల, అన్ని వాదాల్నీ విశ్లేషించాను. ముందు కొంత కలవరపడినా, రానురాను అస్తిత్వ వాదాల్ని అందరు ప్రగతిశీల వాదులూ అంగీకరించే పరిస్థితి వచ్చింది. తమ తమ సిద్ధాంతాల పరిధిలోనే సానుకూల దృక్పథం ఏర్పరచుకున్నారు.

నేను 1995లో రిటైరయ్యాను. ప్రగతిశీల దృక్పథంగాని, కవిత్వ విమర్శ రంగాల చైతన్యం గాని, వేగవంతమైన మనోగమనం గాని, నిరంతర సంచారం గానీ, ఏవీ ఆగలేదు, నిదానం కాలేదు. 1990 ప్రాంతాల నుండి 'ప్రపంచీకరణ' వేగవంతమయింది. ఇక్కడి అస్తిత్వ వాదాలన్నీ అలా ఉండగా, దేశమే తన అస్తిత్వాన్ని కోల్పోవడం ప్రారంభమైంది. 1994లో 'గాట్ మీదా డంకెల్ డ్రాఫ్ట్' మీదా భారత ప్రభుత్వం సంతకం చేసింది. ఇక పూర్తి అమెరికీకరణ మనదేశంలో ప్రారంభమైంది. వెంటనే ఒక కవిత రాశాను.

*'గాట్‌పై సంతకం జరిగిపోయింది*
*భారతదేశం అట్లాంటిక్ సముద్రం మీదకి ఒరిగిపోయింది*
*తనకు తాను ఒక తోలు బొమ్మగా మారిపోతోంది*
*దాని ఎముకల వంపులకి రిమోట్ కంట్రోల్*
*'అమరిక'గా ఉంటుంది...*
*ఒక్క సంతకం విలువ*
*ఒక దేశ సంస్కృతి అయినప్పుడు*
*వేళ్ల మీద పగబట్టినవాడే*
*తన విలువ తాను తెలిసినవాడు'*

ప్రపంచీకరణ గురించి దేశంలో అందరికీ ఆవేదన ఉంది గాని, దాని రహస్యాలు మార్క్సిస్టులకు మాత్రమే తెలుసు. ప్రపంచీకరణ ప్రక్రియ ప్రారంభం కాగానే, ప్రజలకు ఏం జరుగుతుందో అర్థం కానప్పుడు, మార్క్సిజం అవగాహన ఉన్న మేధావులు రాబోయే పరిణామాల గూర్చి హెచ్చరిస్తూ వివరంగా రాబోయే కాలం గూర్చి చెప్పారు. పదేళ్ల తర్వాత వాళ్లు చెప్పినవన్నీ నిజాలని అర్థమైంది. ఇంకా ఈ ప్రక్రియ దేశాన్ని అమెరికాగా చేసేదాకా ఆగదని అందరికీ తెలుస్తుంది. ప్రపంచీకరణ నాలో ఒక నిత్యవేదన. మారిపోయే ప్రతి సన్నివేశమూ, నా కవిత్వానికి వస్తువవుతోంది. 'అయినా ధైర్యంగానే' అన్న కవితా సంపుటి ప్రపంచీకరణ వ్యతిరేకతకు ప్రతిబింబం కాగా, 2005 లో వచ్చిన 'పొగచూరిన ఆకాశం' అక్షరాక్షరం ఆవేశాన్ని ప్రతిఫలించింది. ప్రపంచీకరణ వ్యతిరేకత, పెద్ద ప్రజా ఉద్యమంగా మారేవరకు, మంచి ఫలితాన్ని సాధించే వరకు ఆవేదన చల్లారదు. మార్క్సిస్టు సంస్థలే, ప్రపంచీకరణను అడుగడుగునా ప్రతిఘటిస్తున్నాయి కాబట్టి, ఆ సంస్థలతోనే ప్రయాణిస్తాను.

ఏభై ఏళ్ల నా సాహిత్య ప్రస్థానంలోని ప్రధాన రేఖలు ఈ విధంగా కొనసాగుతున్నాయి. కవిత్వం, విమర్శ నాకు రెండు కళ్లు. ప్రగతిశీల ఆవేదన నా ఊపిరి. నిరంతర చైతన్యం నా జీవిత మూలసూత్రం.

**(సాహిత్య ప్రస్థానం 2008 నవంబర్ – డిసెంబర్ ప్రత్యేక సంచిక నుండి)**

## నివాళి

# కవిత్వాన్ని అనుభవించి పలవరించిన అద్దేపల్లి


– అంపశయ్య నవీన్

9989291299





నాకే కాదు, వరంగల్ నగరంలోని అనేకమంది సాహితీవేత్తలకు అద్దేపల్లితో ఇంతటి ఆత్మీయమైన సంబంధం ఉండేది. ఆయన వరంగల్‌కు ఎన్నిసార్లొచ్చాడో, ఎన్ని సాహిత్య సభల్లో తన ధారాళమైన ఉపన్యాసాలతో అనేకమంది యువ కవుల్ని ప్రభావితం చేశాడో లెక్కలేదు.


అద్దేపల్లి రామమోహనరావు జనవరి 13న ఈ ప్రపంచంలోంచి వెళ్ళిపోయాడని తెలిసినప్పుడు కొన్ని క్షణాల పాటు స్తంభించిపోయాను. నాకాయనతో 50 సంవత్సరాల అత్యంత గాఢమైన అనుబంధం ఉంది. ఎప్పుడూ ఎలాంటి ఆరోగ్య సమస్యల్లేని, అందరిచేత 'నిత్య యౌవనుడ'ని పిలిపించుకునే ఆయన ఇంత అకస్మాత్తుగా వెళ్ళిపోవటం Sheer Absurdity అనిపించింది. ఈ దుర్వార్తను నా మిత్రులతో చెప్పాలనుకున్నప్పుడు నా మైండ్‌లో శ్రీకృష్ణుడు మరణించాడని ధర్మరాజుకు చెప్పిన అర్జునుడు గుర్తొచ్చాడు. ఈ సన్నివేశాన్ని తన కలంతో చిత్రించిన పోతన గుర్తొచ్చాడు.

"మన సారథి, మన సచివుడు, మన వియ్యము, మన సఖుండు, మన బాంధవుడున్ వనవిభుడు, గురువు, దేవర మనలను దిగనాడి చనియె మనుధీశా!" అని మా మిత్రులతో చెప్పాలనిపించింది. నాకే కాదు, వరంగల్ నగరంలోని అనేకమంది సాహితీవేత్తలకు అద్దేపల్లితో ఇంతటి ఆత్మీయమైన సంబంధం ఉండేది. ఆయన వరంగల్‌కు ఎన్నిసార్లొచ్చాడో, ఎన్ని సాహిత్య సభల్లో తన ధారాళమైన ఉపన్యాసాలతో అనేకమంది యువ కవుల్ని ప్రభావితం చేశాడో లెక్కలేదు.

నేను అద్దేపల్లిని మొదటిసారి 1966లో నల్లగొండలో కలుసుకున్నాను. అప్పుడు నేను నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. ఆ కళాశాలలో 'డ్రమెటిక్ క్లబ్' పేరుతో ఒక సంస్థ ఉండేది. దానికి నేను హితవరిగా పనిచేస్తుండేవాడిని. ఈ సంస్థ తరపున ప్రతి సంవత్సరం మూడు, నాల్గు రోజులపాటు సాహిత్య, సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తుండేవాళ్ళం. అలాంటి ఒక సాహిత్య కార్యక్రమానికి అద్దేపల్లిని ఆహ్వానించాం. నాతోపాటు నల్లగొండ కళాశాలలో పనిచేస్తున్న కె. రవిబాబు అద్దేపల్లి మంచి వక్త అనీ, అతన్ని ఆహ్వానించమని నాకు సూచించాడు. (ఇప్పుడు వెలువడ్తున్న 'ప్రజాసాహితి' మాసపత్రికకు సంపాదకుడు ఈ రవిబాబే)

మా ఆహ్వానాన్ని అంగీకరించి అద్దేపల్లి నల్లగొండ కొచ్చి సాహిత్యాన్ని గూర్చి చక్కని ప్రసంగం చేశాడు. విద్యార్థులందరూ ఆయన ఉపన్యాసం వింటూ ఎంతో ఉత్తేజితులయ్యారు. ఆ కార్యక్రమం ముగిశాక ఆ రాత్రి మేం రవిబాబు ఇంట్లోనే కలుసుకున్నాం. అనేక విషయాలను గురించి మాట్లాడుకున్నాం. నేను రాసిన "అథోలోకం" అనే కథను చదవమని రవిబాబు ఆయనకిచ్చాడు. ఆ కథ చదివి ఆయన స్పందించిన తీరు నన్నెంతో ఇన్‌స్పైర్ చేసింది. అలా మొదటి కలయికలోనే నాకాయన కలకాలం నిలిచిపోయే మిత్రుడయ్యాడు. మేం అనేకసార్లు కలుసుకోవడం... సాహిత్యాన్ని గూర్చిన మా అభిప్రాయాలను, అనుభూతులను ఒకరితో ఒకరం పంచుకోవడం జరుగుతుండేది.

ఆరోజుల్లోనే 'ఆంధ్ర ప్రభ' దినపత్రికలో ఆయన శ్రీశ్రీ "మహాప్రస్థానం" లోని కవితల్ని గూర్చి రాస్తున్న విశ్లేషణాత్మక వ్యాసాలు వెలువడుతుండేవి. నేనా వ్యాసాల్ని ఎంతో ఆసక్తితో చదువుతుండేవాడిని. ఎందుకంటే శ్రీశ్రీ ''మహాప్రస్థానం''లోని గీతాల్ని ఎన్నోసార్లు చదివానే గాని వాటిల్లోని నిగూడార్థాలు పూర్తిగా అర్థమయ్యేవి కావు. ఆ గీతాల్లోని శబ్దసౌందర్యమే కళ్ళకు మిరుమిట్లు గొలిపేది తప్ప భావాన్ని గూర్చి పట్టించుకు నేవాన్ని కాదు. అద్దేపల్లి వ్యాసాలు చదివాక శ్రీశ్రీ గీతాల్ని "లో నారసి" చూసినట్టనిపించింది. ఆ వ్యాసాల్ని చదువుతున్న రోజుల్లో ఆయనకు అనేక ఉత్తరాలు రాస్తుండేవాడిని.

**ఆ రోజు 'అంపశయ్య' నవలను గూర్చి అద్దేపల్లి చేసిన ప్రసంగాన్ని నా జీవితంలో ఎప్పుడూ మరచిపోలేను. ఆ నవలలోని అనేక అంశాలను ఆయన విడమర్చి చెప్పిన విధానం శ్రోతలందర్నీ ప్రభావితం చేసింది. "అంపశయ్య లాంటి నవల తెలుగు సాహిత్యంలో ఇంతవరకు వెలువడలేదన్నాడు. ఆ నవల నవీన్‌కు తెలుగు సాహిత్యంలో సుస్థిరమైన స్థానాన్ని స్థిరపరుస్తుందన్నాడు.**

1969లో నేను రచించిన నా మొదటి నవల "అంపశయ్య"ను ప్రచురించాను. ఆ నవలను అటు పాఠకులు, ఇటు నాతోటి రచయితలు ఎలా రిసీవ్ చేసుకుంటారో అని చాలా భయపడ్డాను. సాహిత్యాన్ని గూర్చిన ఎంతో లోతైన అవగాహన ఉన్నవాళ్లు తప్ప ఆ నవలలో నేను చేసిన ప్రయోగాన్ని అర్థం చేసుకోలేరేమో అనుకున్నాను. 1969, డిసెంబర్‌లో నల్లగొండలో ఆ నవల పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. ఆ కార్యక్రమానికి వరంగల్ నుండి వరవరరావు, వే. నరసింహారెడ్డి, మచిలీపట్నం నుండి అద్దేపల్లి వచ్చారు. ఆ రోజు 'అంపశయ్య' నవలను గూర్చి అద్దేపల్లి చేసిన ప్రసంగాన్ని నా జీవితంలో ఎప్పుడూ మరచిపోలేను. ఆ నవలలోని అనేక అంశాలను ఆయన విడమర్చి చెప్పిన విధానం శ్రోతలందర్నీ ప్రభావితం చేసింది. "అంపశయ్య లాంటి నవల తెలుగు సాహిత్యంలో ఇంతవరకు వెలువడలేదన్నాడు. ఆ నవల నవీన్‌కు తెలుగు సాహిత్యంలో సుస్థిరమైన స్థానాన్ని స్థిరపరుస్తుందన్నాడు. ఆనాటి ఆ కార్యక్రమంలో పాల్గొన్న సాహిత్యాభిమా నులంతా అద్దేపల్లి ఉపన్యాసం విని ఆ నవలను కొనుక్కొని ఎంతో ఉత్సాహంగా చదివారు.

అద్దేపల్లి కొద్దిరోజులు విజయవాడ దగ్గరి నందిగామ లోని ఓ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేశాక కాకినాడకు వెళ్లిపోయి అక్కడి కళాశాలలో పనిచెయ్యడం మొదలెట్టాడు. అప్పుడాయన కాకినాడలో 'అంపశయ్య' నవల పరిచయసభను ఏర్పాటు చేశాడు. ఆ సభకు కాకినాడలోని అనేకమంది సాహిత్యవేత్త లొచ్చారు. పిఠాపురం నుండి ఆ సభకు ఆవంత్స సోమసుందర్ గారు కూడా వచ్చారు. మరోసారి అద్దేపల్లి ఆ నవలను గురించి అద్భుతమైన ప్రసంగం చేశాడు. సోమసుందర్ గారైతే నన్ను కౌగలించుకొని "తమ్ముడూ నవీన్! ఎంత గొప్ప ప్రయోగం చేశావు! చైతన్యస్రవంతి శిల్పానికి సామాజిక ప్రయోజనం ఉండదని మేమందరం అనుకునే మాటను నిజం కాదని రుజువు చేశావు" అన్నాడు.

అద్దేపల్లిలోని గొప్పదనం యేమిటంటే ఆయన యేదో ఒక ఐడియోలజీ దగ్గరో, యేదో ఒక ఫిలాసఫీ దగ్గరో ఆగిపోలేదు. ఆయన నిరంతరం చైతన్యశీలిగా ఉంటూ ప్రతి కొత్త భావాన్ని ఆహ్వానించాడు.

50 యేళ్ళ తన సాహిత్య జీవితంలో అద్దేపల్లి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నాడు. శ్రీశ్రీ మీద ఆయన రాసిన వ్యాసాలను "శ్రీశ్రీ సాహిత్య ప్రస్థానం" పేరుతో పుస్తకంగా ప్రచురించినప్పుడు రా.రా. అనే విమర్శకుడు ఆ పుస్తకాన్ని చీల్చి చెండాడుతూ సాహిత్య విమర్శకుడిగా అద్దేపల్లిని భూస్థాపితం చేసే ప్రయత్నం చేశాడు. అద్దేపల్లి శ్రీశ్రీ మీద రాసిన వ్యాసాలు శ్రీశ్రీని సాంప్రదాయ వాదుల్లో చేర్చే కుట్ర అని, అద్దేపల్లి విశ్వనాథ సత్యనారాయణ శిష్యుడు కావడం వల్లనే శ్రీశ్రీ కింత ద్రోహం చేశాడని తీవ్రంగా విమర్శించాడు. అంత క్రూరమైన విమర్శకు ఎవరైనా ఎంతగా కృంగిపోయేవారో ఊహించలేం. కానీ అద్దేపల్లి ఆ విమర్శను ధైర్యంగా ఎదుర్కొన్నాడు. శ్రీశ్రీ వాడిన కొన్ని "ఇతరేతర" లాంటి మాటలకు రా.రా. చెప్పిన అర్థాలు తప్పని, అద్దేపల్లి చేసిన వ్యాఖ్యానాలే కరెక్ట్ అని స్వయంగా శ్రీశ్రీగారే చెప్పారు. "అలంకారశాస్త్రం దృష్ట్యా అద్దేపల్లి మీ కవిత్వాన్ని అంచనా వేశాడనీ, అది తప్పంటారా అని శ్రీశ్రీని అడిగినప్పుడు "నా కవిత్వం ఎవరికెలా అర్థమౌతుందో అలా వ్యాఖ్యానిస్తారు. దాంట్లో తప్పేముంది" అన్నాడు శ్రీశ్రీ. "విమర్శ రా.రా. గారు చేసినంత క్రూరంగా ఉండొచ్చా" అంటే "రా.రా. క్రూర విమర్శకుడు" అన్నాడు శ్రీశ్రీ.

అంతటి క్రూరవిమర్శను ఎదుర్కొన్నప్పటికి అద్దేపల్లి విమర్శకుడుగా తెలుగు సాహిత్యరంగంలో తన స్థానాన్ని

**పాట**

# అక్షర నీరాజనం

- గరికిపాటి మాస్టారు
8897672733



**పల్లవి:**

*మచిలీపట్టణ వాసీ!*
*కాకినాడ స్థిరనివాసీ!*
*అద్దేపల్లి రామమోహనుడు*
*నవకవులకు కరదీపికాతడు ॥మ॥*

**చరణం:**

*శిష్య – ప్రశిష్యులకు తల్లో నాలుక*
*కవితా వనికే ఏలిక*
*సాహితి స్రవంతి పాలిక*
*కవనంలో వేరెవరూ లేరు పోలిక ॥మ॥*

**చరణం:**

*ఎనిమిది పదుల నవ యవ్వనుడు*
*వర్ధమానకవులకు ఊపిరాతడు*
*ప్రజాకవి బిరుదుకే వన్నెతెచ్చాడు*
*శ్రద్ధాంజలి ఘటిద్దాం ఈనాడు ॥మ॥*

**చరణం:**

*తెలుగు నేలపై వికసిత కుసుమం*
*దెస దిశలా పరిమళించె ఈ కవి కుసుమం*
*ఈ కవి కుసుమం అద్దేపల్లి – మన అద్దేపల్లి*
*జోహార్లు చెబుదాం మళ్ళీ – మళ్ళీ ॥మ॥*

---

స్థిరపరచుకున్నాడు. మహాకవి జాషువా మీద, తొలివచన కవి కుందుర్తి మీద, నా నవల అంపశయ్య మీద ఆయన రాసిన విమర్శా వ్యాసాలు ఎంతోమంది మన్ననల్ని పొందాయి.

రచయితగా అద్దేపల్లిలో మూడు పార్శ్వాలు మనకు దర్శనమిస్తాయి. ఆయన గొప్ప కవి. ఆయన వెలువరించిన "అంతర్జ్వాల", "మధుజ్వాల", "రక్తసంధ్య", "గోదావరి నా ప్రతిబింబం", "సంఘం శరణం గచ్ఛామి", "మెరుపు పువ్వు", "పొగచూరిన ఆకాశం" "కాలం మీద సంతకం" మొదలైన ఆయన కవితా సంకలనాలు ఆయనను గొప్ప ఆధునిక వచన కవిగా నిలబెడ్తాయి.

ఆయనలోని రెండో పార్శ్వం– ఆయన గొప్ప విమర్శకుడు. ఆయన ప్రచురించిన "శ్రీశ్రీ కవితా ప్రస్థానం", "విమర్శవేదిక", "సాహిత్య సమీక్ష", "జాషువా కవితా సమీక్ష", "కుందుర్తి కవిత", "మినీ కవిత", "దృష్టిపథం", "స్త్రీవాద కవిత్వం" మొదలైన గ్రంథాలు ఆయననొక అభ్యుదయ విమర్శకుడిగా ఆవిష్కరిస్తాయి. ఆయన మూడో పార్శ్వం: ఆయన గొప్ప వక్త. ఆయన ఎన్ని సాహిత్య సభల్లో ఎన్ని ఉపన్యాసాలు చేశాడో లెక్కలేదు. ఆయన చేసిన ఉపన్యాసాలన్నీ ఎంతో అర్ధవంతంగా, ఇవ్వబడిన సబ్జెక్టుకు పూర్తి న్యాయం చేసేలా ఉండేవి. ఆయన వరంగల్లులోని ఎన్నో సాహిత్య సభల్లోనూ, పుస్తకావిష్కరణ సభల్లోను చేసిన ప్రసంగాల్ని ఎవరూ మరచిపోలేరు.

ఆయన ఎంతోమంది యువ కవుల కవితా సంకలనాలకు ముందుమాటలు రాశాడు. దాదాపు 600 పుస్తకాలకు ఆయన ముందుమాటలు రాశాడంటే ఆయన యువకవులను ఎంతగా ప్రోత్సహించాడో మనకర్థమౌతుంది. తన సహాయం కోరి వచ్చిన యే రచయితనైనా ఆయన నిరుత్సాహపరచేవాడు కాదు. ముందు మాటల్ని యేదో మొహమాటానికో, మొక్కుబడికో రాసినట్టుగా కాకుండా, ఆ ఎంతచిన్న రచయితలోని రచనలోనైనా కనిపించే పాజిటివ్ అంశాలనే చెబుతూ ఆ రచయిత ఇంకా మంచి కవిత్వం రాయటానికి కావలసిన సూచనలిచ్చేవాడు.

ఆయన ఉద్యోగ విరమణ చేశాక ఆయన సాధించిన ఒక విజయం మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. ఉద్యోగ విరమణ చేశాక ఆయన ఎం.ఏ. చదివిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డీ. చేసి డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నాడు. ఆయన రచించిన ఆ పరిశోధనా వ్యాసాన్ని "అభ్యుదయ విప్లవ కవిత్వాలు, సిద్ధాంతాలు–శిల్పరీతులు" పేరుతో పుస్తకంగా ప్రచురించాడు.

ఈ మధ్యన ఆయన ఎక్కడ ప్రసంగించినా రోజురోజుకు విస్తరిస్తున్న అమెరికా సాంస్కృతిక, ఆర్థిక సామ్రాజ్యవాదాన్ని తీవ్రంగా నిరసిస్తూ ప్రసంగించేవాడు. 'గ్లోబలైజేషన్' పేరుతో అమెరికా సాంస్కృతిక సామ్రాజ్యం విస్తరిస్తూ భారతదేశపు సంస్కృతంతా అంతరించిపోతున్నదని ఎంతో ఆవేదన చెందేవాడు.

చివరిక్షణం వరకు సాహిత్యాన్నే ప్రాణంగా, సాహితీమిత్రులనే ఆత్మీయులుగా, కవిత్వాన్ని జీవించి, కవిత్వాన్ని అనుభవించి పలవరించిన ఆ మహనీయునికి, నా ఆత్మీయునికి, ఎందరో తన కవిమిత్రులకు ఆదర్శమూర్తిగా జీవించిన ఆ మహామనీషికి నా జోహార్లు.

## నివాళి

# అద్దేపల్లితో నా సాహిత్య ప్రయాణం

- గనారా
9949228298

*సాంప్రదాయ శైలి నుండి భావుకతకు, ఆదర్శాల నుండి సిద్ధాంతం, ఆచరణ ద్వారా ఉద్యమాల వైపు ఆకర్షితుడయ్యాడు. ఆయన సాహిత్య ప్రయాణం 20వ శతాబ్దపు అర్ధభాగం మొదలు 21వ శతాబ్దపు వికృత క్రీడలు చూసి చలించిన జీవితం. అద్దేపల్లి జీవితాన్ని పరిశీలించినప్పుడు అందరి విద్యార్థులవలే అలంకారశాస్త్రం ప్రధానం అయ్యింది. ఆనాటి సాహిత్యంలో మార్క్సిస్టు విమర్శకు స్పష్టమైన రూపం లేదు.*



కాకినాడలో శ్రీశ్రీ కవితా సమీక్ష పుస్తకావిష్కరణ సభలో అద్దేపల్లి, గనారా, కె.వి. రమణా రెడ్డి తదితరులు

గ్రంథాలయాల చుట్టూ తిరుగుతూ దొరికిన పుస్తకం చదువుతూ లక్ష్యం లేని ఆదర్శాలు వల్లిస్తున్న రోజులు. కాకినాడ కేంద్రగ్రంథాలయ ఉత్సవాలకు వెళ్ళి కూర్చుంటే, కంఠానికి బేండేజ్ కట్టుకొని ఒక 'పల్లి' ఆయన్ని అనుసరించి మరో 'పల్లి' లోపలికి వచ్చారు. వాళ్ళిద్దరూ ఎవరో కాదు 'దేవులపల్లి', 'అద్దేపల్లి'.

బహుశా 1974-75 కావొచ్చు కేన్సర్‌తో మూగ బోయిన గొంతు, వ్రాసి ఇచ్చిన సందేశం, బహుశా అద్దేపల్లి చదివినట్లు గుర్తు. అదే మొదటి సారి అద్దేపల్లి రామమోహనరావును చూడడం. కొద్ది నెలల తరువాత ఆయన పట్ల ఆకర్షితుణ్ని అయి ఒక పెద్ద కథ వ్రాసి పంపాను. ఒక లేఖ. వ్రాసి ఆ కథను పంపితే. 'సొంతగొంతు శైలి ఉండాలని అభివృద్ధికి వస్తావని' నాకు పంపారు. ఇటీవల నాపాత పుస్తకాల్లో వెతికితే కథ దొరికింది కాని, ఆయన స్వరస్ఫూర్తితో కూడిన ఉత్తరం దొరకలేదు. అటు తరువాత 2012 ఆగష్టు నెల వరకూ ఆయన్ని చూడలేదు. కలవలేదు. కారణం: నేను బ్యాంకుల ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో నిండామునిగి ఉండమే.

2012 ఆగష్టులో నా కథల సంపుటి 'బతుకు బండి'ని సత్యరంజన్ ముద్రించి ఆవిష్కరణ అద్దేపల్లి తోనే చేయించాడు.

అదిగో అప్పటి నుంచి మా ఇద్దరి మధ్య సాహిత్య బంధం పెనవేసుకుపోయింది కాకినాడలో సాహితి స్రవంతి శాఖను ఏర్పరచి 'నెలనెల సాహిత్యం హేల' నడిపించడంలో ఇద్దరం కీలక పాత్ర వహించాం.

అద్దేపల్లి రామమోహనరావు వ్రాసిన విమర్శనా గ్రంథాలు, వ్యాసాలు కవితా సంపుటాల గూర్చి నాకన్నా పాఠకులకే ఎక్కువగా తెలుసు.

సాంప్రదాయ శైలి నుండి భావుకతకు, ఆదర్శాల నుండి సిద్ధాంతం ఆచరణ గూర్చి ఉద్యమాల వైపు ఆకర్షితుడయ్యాడు. ఆయన సాహిత్య ప్రయాణం 20వ శతాబ్దపు అర్ధభాగం మొదలు 21వ శతాబ్దపు వికృత క్రీడలు చూసి చలించిన జీవితం. అద్దేపల్లి జీవితాన్ని పరిశీలించినప్పుడు అందరి విద్యార్థులవలే అలంకారశాస్త్రం ప్రధానం అయ్యింది. ఆనాటి సాహిత్యంలో మార్క్సిస్టు విమర్శకు స్పష్టమైన రూపం లేదు.

తనలో మార్పుకు 'జీవితం లోని సంఘర్షణ కారణం, నిరుపేదరికం అందువల్ల కలిగిన సామాజిక ఔద్యోగి కాది సంఘర్షణల ప్రతిఘటన స్వభావానికి దారితీసాయి. ప్రగతి శీలతకు అవసరమైన నేపథ్యం బలపడింది'. దీనికి తోడు బందరు కాలేజీలో తన విద్యార్థి అయిన టి.ఎల్.కాంతారావు ప్రోద్బలంతో శ్రీ శ్రీ మహాప్రస్థానంపై వ్యాసాలు వ్రాసి తన

**కవిత్వం అతనికి ఒక తీరని దాహం అయింది. తెలుగునేల నాలుగు దిక్కుల సంచారిగా మారిపోయాడు. ఎక్కడికి వెళ్ళినా యువకుల్ని ప్రోత్సాహించి, మార్గదర్శకుడయ్యాడు. వయ స్సుతో నిమిత్తం లేకుండా స్నేహితుడు హితుడు అయ్యాడు.**

జీవిత మార్గాన్ని సరియైన దిశకు మళ్ళించుకోగలిగాడు. అప్పటి నుంచి వస్తు శిల్పాలలో మార్క్సిజం ఆక్రమించింది. అదే నిబద్ధతను చివరి వరకూ కొనసాగించాడు.

కవిత్వం అతనికి ఒక తీరని దాహం అయింది. తెలుగునేల నాలుగు దిక్కుల సంచారిగా మారిపోయాడు. ఎక్కడికి వెళ్ళినా యువకుల్ని ప్రోత్సాహించి, మార్గదర్శ కుడయ్యాడు. వయ స్సుతో నిమిత్తం లేకుండా స్నేహితుడు హితుడు అయ్యాడు. ఉద్యోగ రీత్యా నందిగామ చేరి అక్కడ నుంచి చిన్న ట్రంకుపెట్టే, ఒక కిరోసిన్ స్టవ్, బట్టల మూట నలుగురు పిల్లలతో కాకినాడ చేరుకున్నాడు. ఎంతటి లేమిలోనూ కూడా చలించక జీవితాన్ని హుందా తనంగానే గడిపానని గతాన్ని నాతో పంచుకున్నాడు. అద్దేపల్లి కాకినాడ ఎమ్.ఎస్.ఎన్ ఛారిటీస్‌లో ఉపాధ్యాయుడుగా ఇంటర్వ్యూకి వచ్చి ఆవంత్స సోమసుందర్ సహకారంతో ఉద్యోగంలో చేరి చాలీచాలనీ జీతంతో చివరి వరకూ ఉద్యోగం చేసాడు. ఎన్నో కష్టాల మధ్య నలుగురు పిల్లల్ని పోషించడంలో ఆయన భార్య అన్నపూర్ణమ్మ సహకారం కొనియాడతగినది.

'అద్దేపల్లి కులమతాల జోలికిపోని సెక్యులర్ మైండ్ అభివృద్ధికరమైన ఆలోచనతో సాహిత్య సేవ చేసారు' ఇటీవల అద్దేపల్లి సంతాప సభలో సోమసుందర్ నివాళిగా సందేశం పంపారు. అంతేకాదు, 'ప్రపంచీకరణ విష వృక్షాలు తల ఎత్తుతుంటే ఏకైక వీరుడుగా కత్తి పట్టిన సాహిత్యకారుడు, 'అద్దేపల్లి' అని శ్లాఘించారు.

'ఆరు దశాబ్దాల సాహిత్య యాత్రలో తనకు విస్తారమైన స్నేహ సంబంధాలు, పేరు ప్రతిష్టలు, పరిచయాలు ఉన్నా స్వంతానికి వాడుకోని విలక్షణ వ్యక్తి అద్దేపల్లి. కొంత మంది సాహిత్యకారుల లాగా ఆయన బిరుదుల కోసం, పదవుల కోసం ఎన్నడూ ఆరాట పడలేదు. కళాత్మకంగా బతికే చాలా మందికి ఉండే వ్యసనాల, వ్యామోహాల దరికి రానివ్వని అద్దేపల్లి నిండు కుటుంబీకుడని ప్రముఖ విశ్లేషకుడు, విమర్శకుడు తెలకపల్లి రవి కొనియాడారు.

కాకినాడ సాహిత్య, సాంస్కృతిక వారసత్వానికి పెట్టింది పేరు. ఎందరో సంస్కర్తలను కళాకారులను తెలుగు జాతికి అందించిన ఘనత ఉంది. కొంతకాలం నుండి సభ్దత నెలకొన్నప్పుడు 2012 నుంచి అద్దేపల్లి అధ్యక్షతన సాహితీ స్రవంతి శాఖ ఏర్పడింది. నిర్విరామంగా అనేక సభలు నిర్వహించగలిగింది. రెండు వార్షికోత్సవాలు జరిపి, రెండు కవితా సంకలనాలు తీసుకురాగలిగాం అంతేకాదు పదిపుస్తకాల ఆవిష్కరణలు జరిగాయి. అనేక మంది రచనలను పరిచయం చేసి తెలుగులోకి తీసుకురాగలిగాం. ప్రతీనెల జరిగే సాహిత్య హేలలో ఒక కవితాంశాన్ని ఇచ్చి యువకుల్ని పోత్సాహిస్తూవచ్చారు. ఈ ఘనత అంతా ఒక అద్దేపల్లికే దక్కుతుంది.

ఒక ఆటో డ్రైవరు కవితలు రాసేనని ప్రయాణంలో పరిచయం చేసుకుంటే అవి విని, అద్దేపల్లి సొంత ఖర్చులతో ప్రచురించి, ఆ పుస్తకాన్ని సాహితి స్రవంతి, కాకినాడ సమావేశంలో పరిచయం చేసాడు. అలాగే అనేకమంది విద్యార్థులు వచ్చి కవితలు చదివితే భుజం తట్టి వాళ్ళలో ఉన్న కవితా శక్తిని ప్రశంసించి ప్రోత్సాహించాడు. సుమారు 500ల కవితా సంపుటాలకు ముందు మాటలు వ్రాసినారు. ప్రాంతీయ విభేదాలు లేకుండా రెండు తెలుగు రాష్ట్రాలలో ఎందరికో ఆదర్శప్రాయుడు.

"అక్షరాన్ని నా ఆసిత్వపు కొలిమిలో పుటం పెట్టి ఆ బాణం మొనకి పూశాను. ఆ మొనకి గుచ్చుకున్న గుండెలన్ని పుస్తకాల పేజీలై జనం కళ్ళలోకి ఎగురుతున్నె. రాగాన్ని నా నెత్తురు తీగలకి పూసి బాణం గొంతుకి గొలుసుగా వేలాడదీశాను. బాణం పాటగా మారి నిరుపేద నేలల్లో పులకరింతలు పోసింది. రేఖలో కరిగిపోతున్న నారేఖా చిత్రాల్ని బాణం నిండా ముగ్గులు పెట్టాను. ఆ ముగ్గులు సమాజ ప్రాంగణంలో నిప్పుగీతల భావికాలముగా బిగిసిపోతున్నె" **– అద్దేపల్లి.**

నిర్విరామ అక్షర యోధుడు, ప్రగతిశీలతకు పర్యాయ పదం అయిన ప్రజాకవి అద్దేపల్లి లేక పోవడం వ్యక్తిగతంగా నన్ను కృంగదీసింది. తీరని లోటు మిగిల్చింది. ఆయన స్ఫూర్తితో సాహితి స్రవంతిని ముందుకు తీసుకుపోవడమే నిజమైన నివాళని భావిస్తాను.

నివాళి

# ప్రపంచీకరణ నేపథ్యం - అద్దేపల్లి కవిత్వం

**- ఆచార్య మేడిపల్లి రవికుమార్**
**9949164358**



**సాహితీస్రవంతి విజయవాడలో 2012లో నిర్వహించిన సాహిత్య కార్యశాలలో కె. ఆనందాచారి, అద్దేపల్లి రామమోహన రావు, మేడిపల్లి రవికుమార్**

***ప్రపంచీకరణ విధానాల అసలు రంగు సామాన్య ప్రజలకు తెలీకపోవచ్చు. లాభాలను కూడబెట్టుకునే పెట్టుబడిదారులు, స్వార్థం మూర్తీభవించిన నాయకులు, తెలిసినా, తెలియనట్లు నటించొచ్చు. కానీ మేధావులైన కవులు, కళాకారులు, రచయితలు ఈ పరిణామాలన్నింటినీ గమనిస్తారు. దేశ ప్రజల్ని జాగృతం చేస్తారు. అలాంటి వారిలో ప్రసిద్ధ కవి, విమర్శకుడు అద్దేపల్లి రామమోహనరావు ఒకరు. వారు ప్రకటించిన కవితా సంపుటాలు 'పొగచూరిన ఆకాశం', 'కాలం మీద సంతకం'. ప్రపంచీకరణ నేపథ్యంలో సామాజిక అవసరంగా వెలువడిన కవితా గుచ్ఛాలు.***

ప్రజల్ని కుహనా సంస్కరణల భ్రమల్లో ఉంచి, దేశాన్ని అతలాకుతలం చేస్తున్న ప్రపంచీకరణ విధానాల అసలు రంగు సామాన్య ప్రజలకు తెలీకపోవచ్చు. లాభాలను కూడబెట్టుకునే పెట్టుబడిదారులు, స్వార్థం మూర్తీభవించిన నాయకులు, తెలిసినా, తెలియనట్లు నటించొచ్చు. కానీ మేధావులైన కవులు, కళాకారులు, రచయితలు ఈ పరిణామాలన్నింటినీ గమనిస్తారు. దేశ ప్రజల్ని జాగృతం చేస్తారు. అలాంటి వారిలో ప్రసిద్ధ కవి, విమర్శకుడు అద్దేపల్లి రామమోహనరావు ఒకరు. వారు ప్రకటించిన కవితా సంపుటాలు 'పొగచూరిన ఆకాశం', 'కాలం మీద సంతకం'. ప్రపంచీకరణ నేపథ్యంలో సామాజిక అవసరంగా వెలువడిన కవితా గుచ్ఛాలు.

ప్రపంచీకరణ ప్రభావం వల్ల రెండు ప్రధానమైన సంస్కృతులు గ్లోబల్ విలేజ్‌లోకి అడుగుపెట్టాయి. అవి వస్తు వినిమయ సంస్కృతి, వస్తు వ్యామోహ సంస్కృతులు. ప్రపంచంలో ఎక్కడైనా మనుషులే వస్తువుల్ని లేదా సరుకుల్ని తయారుచేస్తారు. కానీ, ఈనాటి మార్కెట్టు ప్రపంచంలో, వస్తువులు లేదా సరుకులే తమకోసం తమ వినియోగం కోసం మనుషుల్ని తయారు చేసుకుంటున్నాయి. "అయామ్ ఎ కాంప్లాన్ బాయ్, ఆయామ్ ఎ కాంప్లాన్ గళ్' అనే ప్రకటనలు లాంటివి మనకు బాగా సుపరిచితం. ఆ కాంప్లాన్ సరుకు ఆ బాలబాలికల్ని రూపొందించుకున్న విషయం ఇక్కడ గమనించాలి. వస్తు వినిమయ సంస్కృతి అంటే ఇదే.

మనుషుల కంటే, మానవీయ విలువల కంటే వస్తువులకూ, సరుకులకూ ప్రాధాన్యం ఇవ్వడం; ఎక్కువగా వాటి మీదనే వ్యామోహం పెంచుకోవడం మధ్య తరగతి జీవితాల్లో కూడా ఈనాడు ప్రవేశించింది. ఎవరైనా అతిథులు తమ ఇళ్ళకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యులను కాక; ఇంట్లోని టీవీలను, ఫ్రిజ్‌లను, సోఫాలనూ, డైనింగ్ టేబుల్స్‌నూ పరిచయం చెయ్యడం, వాటి విలువల్నీ, ప్రాధాన్యతల్నీ, విశిష్టతల్నీ, గొప్పతనాన్నీ వివరించడం ఈనాడు అతి సహజమైన అంశమైంది. వస్తువ్యామోహ సంస్కృతి అంటే ఇదే. ఈ పొగచూరిన ఆకాశంలోని ఈ రెండు సంస్కృతుల్నీ కూడా అద్దేపల్లి అనేక ఖండికల్లో పట్టి చూపించాడు.

"ఈ దారి ఎక్కడికి పోతుంది" అనే కవితలో

***"అంతర్జాతీయ వ్యాపార తుఫానులో***
***సొంతముద్ర తొలగిపోయిన వింతవస్తువును నేను***

*మనిషి స్థానంలో వస్తువు నారాధిస్తున్న*
*కొనుగోలు దారుణ్ణి నేను*
*నిన్న నేను నా అవసరాలకే వస్తువులు కొన్నాను*
*నేడు నేను నా స్థాయికోసం వస్తువులు కొంటున్నాను*
*రేపు నేను ఒక వస్తువుని కావడం కోసం*
*జీవితాన్నే అమ్ముకుంటాను"*

**కుల రహిత సమాజం గురించి అంబేద్కర్ చేసిన హితబోధ దళిత వర్గాలలో మాత్రం కొంత చైతన్యం కలిగించింది. ఇతరులు అంబేద్కర్‌ను ఇంకా అందుకోలేదు. విద్యావంతులు కొందరు గుర్తించినా అంబేద్కర్‌ను దళితోద్ధారకుడిగానే పరిగణిస్తున్నారు. మొత్తం సమాజానికి సంబంధించిన జాతీయ నాయకుడిగా ఇంకా గుర్తించలేదు.**

మనిషి స్థానంలో వస్తువు నారాధించడం, తన స్థాయికోసం వస్తువులు కొనడం వస్తువ్యామోహ సంస్కృతికి చిహ్నాలు. తాను ఒక వస్తువు కావడం కోసం తన జీవితాన్నే అమ్ముకోవలసి రావడం వస్తు వినిమయ సంస్కృతిలో ఒక భాగం.

'ఫ్రెష్' అనే ఖండికలో కూడా అద్దేపల్లి ఈ వస్తు సంస్కృతులను బలంగా ఆవిష్కరించాడు. కార్పొరేటు సంస్థలు, కోట్ల రూపాయలు పెట్టుబడిగా పెట్టి 'షాపింగ్ మాల్స్' పేరుతో పట్టణాలలోనూ, నగరాలలోనూ ప్రజలెవ్వరికీ నొప్పి తెలియకుండా చేస్తున్న అందమైన దోపిడీని తెలియచేసే కవిత ఇది– ***'లోపల అడుగు పెట్టగానే***
***మనిషి వినియోగదారుడుగా మారిపోతాడు***
***బుట్ట చేత్తో పట్టి***
***ఒక్కొక్క సరుకూ లోపల వేసుకుంటూ***
***షాపంతా తిరుగుతుంటే***
***సరుకులు అవే అయినా***
***వాటి చుట్టూ ఉన్న హైటెక్ వలలో పడి***
***అందరూ పంజరంలో పక్షులై పోయి***
***స్వేచ్ఛా గీతాలు పాడుకొంటారు (కాలం మీద..పు. 80).***

అక్కడి కొనుగోలు దారుడే ఇక్కడ వినియోగ దారుడు. మనిషిని 'హిప్నటైజ్' చేయడంలో మార్కెట్ మగాడు తయారు చేసిన 'హైటెక్ వల' చాలా శక్తివంతమైంది. అందుకే, అప్పటిదాకా 'మనిషి'గా ఉన్న ఒక వ్యక్తి షాపింగ్ మాల్‌లోకి అడుగు పెట్టగానే 'వినియోగదారుడి'గా మారి పోతున్నాడు. పంజరంలోంచి బైటకొచ్చిన పక్షి స్వేచ్ఛా గీతం పాడుకోవడం సహజం. అయితే, వినియోగదారుడైన మనిషి మాత్రం పంజరంలో ఇరుక్కు పోయి స్వేచ్ఛా గీతాలు పాడుకోవడం ప్రపంచమంత విషాదం.

అద్దేపల్లి యాడ్స్ స్వరూపాన్ని 'యాడ్‌మ్యాడ్ వరల్డ్' అనే కవితలో బట్టబయలు చేశాడు.

***'గ్లోబల్ మార్కెట్ మేధావులందరూ***
***బుర్రలోని గుంజునంతటినీ***
***అదేపనిగా కంప్యూటర్లలో రుబ్బి***
***తయారు చేసిన అద్భుత అపూర్వ***
***కాక్ టెయిల్ బొమ్మ – 'అడ్వర్టయిజ్ మెంట్'***

కార్యకారణ సంబంధంలేని ఈ కాక్ టెయిల్ బొమ్మ స్వభావాన్ని కూడా కవి ఇదే ఖండికలో తేటపరిచాడు.

***'నాటి 'అమాయకుడు – నల్లమేక' కథే***
***నేటి 'నాగరికుడు – అడ్వర్‌టయిజ్‌మెంట్' కథ!***
***అది అపూర్వ చిత్ర విచిత్ర మాయాసభ***
***కూల్‌డ్రింక్ తాగి సముద్రాలు ఈదవచ్చు***
***రేజర్ పట్టుకొని లేడీకిల్లర్ కావచ్చు –***
***/..... /***
***యాడ్‌లు బాగా తాగినవాడికి***
***నిండు చలికాలంలో పసిపాపకిప్పించిన ఐస్‌క్రీమ్***
***వెచ్చని హెల్దీఫుడ్‌లా కనిపిస్తుంది.***
***......***
***అడ్వర్‌టైజ్‌మెంట్***
***పెట్టుబడి దారుడి చేతిలో యంత్రదండం***
***ఫ్రీ సెక్స్ ప్రచారానికి బండి చక్రం***
***ప్రపంచ మార్కెట్ అధినాయకుడికి బానిస భూతం'***

మార్కెట్ అధినాయకుడికి బానిసభూతం లాంటి ఈ ప్రకటనలు సామాన్యుల జీవితాలకు పెనుభూతంగా మారాయి. ఈ విషయం ఇప్పటికే మనందరి అనుభవాలకు అందింది కూడా.

కుల రహిత సమాజం గురించి అంబేద్కర్ చేసిన హితబోధ దళిత వర్గాలలో మాత్రం కొంత చైతన్యం కలిగించింది. ఇతరులు అంబేద్కర్‌ను ఇంకా అందుకోలేదు. విద్యావంతులు కొందరు గుర్తించినా అంబేద్కర్‌ను దళితోద్ధారకుడిగానే పరిగణిస్తున్నారు. మొత్తం సమాజానికి సంబంధించిన జాతీయ నాయకుడిగా ఇంకా గుర్తించలేదు.

అంబేద్కర్‌ను గౌరవించడం అంటే దళితులను గౌరవించడం అనీ, కుల నిర్మూలననూ, కుల రహిత సమాజాన్నీ ఆశించడం అనీ ఆశించిన స్థాయిలో మేధావులు భావించడం లేదు. అయితే అద్దేపల్లి ఇందుకు మినహాయింపు. ప్రపంచీకరణ చీకట్లు అలుముకున్న ఈ పరిస్థితుల్లో అద్దేపల్లి అంబేద్కర్ ఆశయాలను కవిత్వీకరించారు. అంతేకాక ***"అంబేద్కర్ మొదలెట్టిన వాక్యాన్ని పూర్తి చేద్దాం'*** అని దళితుల పక్షంగా స్పష్టంగా ప్రకటించాడు.

***'భారతదేశ చరిత్ర నేత్రాల్లో***
***కమ్ముకున్న కులాహంకారపు మరకల్ని***
***జ్ఞాన నేత్రంతో శస్త్ర చికిత్స చేసేందుకు***
***దేశమంత చైతన్యాన్ని చేతబట్టుకొని***
***గుండె వాడల మీదుగా***
***నడిచి వస్తున్న అనంత శక్తికి మారుపేరు***
***డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్"*** అని అంబేద్కర్ సిద్ధాంతాన్ని, మూర్తిమత్వాన్ని నిర్వచించారు. కవిగా తాను ఎవరిపక్షంగా నిలబడ్డాడో; భారతీయ సమాజం ఎలా ఉండాలని కోరు కుంటున్నాడో కూడా అద్దేపల్లి ఈ ఖండికలో విశ్లేషించాడు.

భారతీయ సంస్కృతిలో సుదీర్ఘకాలం బలౌతున్న వారిలో దళితుల తర్వాత ప్రస్తావించు కోవలసిన వారు స్త్రీలు. ప్రపంచీకరణ విధానాలవల్ల స్త్రీ జాతి పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టయింది. ఈ దుస్థితిని "చప్పట్లుకొట్టండి" అనే కవితలో అద్దేపల్లి అధివాస్తవిక దృక్కోణంలోంచి కవిత్వీకరించాడు.

***"ఆడవాళ్ళ చూపులమీద, మాటలమీద***
***మొత్తం శరీరం మీద***
***గొప్ప సరుకుల వ్యాపారం చేసే అవకాశం ఉండగా***
***ఈ హిందువులు ముస్లింలూ ఎంత మూర్ఖులండీ బాబూ!***
***ఆమె శరీరాన్ని తరతరాలుగా***
***అంతా దాచి పెట్టారు"***

ఈ కవితలోని 'ఐరనీ' మనం అర్థం చేసుకోవచ్చు. టెలివిజన్ ప్రసారం చేసే వివిధ ఛానళ్ళలో ప్రసారాల గురించే కాక; యాక్సిడెంట్‌లో చనిపోయిన అమ్మాయిల శవాలనుకూడా సెక్సప్పీల్ ఉట్టిపడేలా ఫోటోలు తీసి న్యూస్ ఐటమ్స్ ప్రచురించే ఈనాటి జర్నలిస్టులను కూడా అద్దేపల్లి ఇద్దే పద్ధతిలో ప్రశ్నించాడు.

'కాలం మీద సంతకం' లో 'మార్కెట్ మగాడి రెక్కలు' ఖండికలో- ***'స్త్రీని భోగవస్తువు అనుకుంటారు మీ మగవాళ్ళు /అసలు 'భోగం' అనేది పురుషాహంకారపు మాట /అందుకే ఈ పదాన్ని మేం తొలిగిస్తాం / కేవలం 'వస్తువు' అనేది మిగిలిస్తాం /ఈ వస్తువుని భాగాలు భాగాలుగా వేరు చేస్తాం / దీని వెల దానిదిగా లెక్కేసుకుంటాం'*** ఈ పాదాలలో 'మేం' అంటే మార్కెట్టు వ్యవస్థ.

భూస్వామ్య వ్యవస్థలో స్త్రీ పురుషుని ఆధీనంలో ఉండేది. అయితే ఈ ప్రపంచీకరణ వ్యవస్థలో స్త్రీ మార్కెట్ ఆధీనంలో ఉండేది. అయితే ఈ ప్రపంచీకరణ వ్యవస్థలో స్త్రీ మార్కెట్ ఆధీనంలోకి వెళ్లిపోయింది. ఇప్పుడు పురుషుడిది ప్రేక్షక పాత్ర. స్త్రీది పెనం మీదనుంచి పొయ్యిలోకి పడిపోయిన విషాద గాథ. భోగవస్తువుగా ఉన్నప్పుడు పురుషాహంకారపు పీడన ఉన్నా స్త్రీకి శరీర అస్తిత్వం ఉంది. వస్తువుగా మారిపోయిన తర్వాత సుఖం మాట దేవుడెరుగు, ఉన్న అస్తిత్వం కూడా కోల్పోయింది. స్త్రీ శరీరం ఈనాడు ముక్కలు ముక్కలుగా కోయబడి, ఏ ముక్కకా ముక్కగా వెలకట్టబడుతుంది. ఈనాటి స్త్రీ పరిస్థితి చూస్తుంటే 'కుక్కలు చింపిన విస్తరి' అనే సామెత గుర్తుకొస్తుంది. ఈ పరిస్థితుల్లో ఇంటి మగాడినీ మార్కెట్ మగాడినీ ఏమి చేయాలో కూడా అద్దేపల్లి 'మార్కెట్ మగాడు' అనే కవితలో స్పష్టం చేశాడు- ***'ఇంటి మగాడు పెంచుకుంటున్న పూలతోటని/ మార్కెట్ మగాడు కబ్జా చేసి/ పక్షుల్నీ ఫలాల్నీ పరాయివాళ్ళ కమ్ముకుంటున్నాడు/ ఇంటి మగాడిది అహంకారం / మార్కెట్ మగాడిది హింసాకారం /మార్కెట్ మగాణ్ణి ఉపేక్ష చేస్తే /ఈ తోట మన తోటగా మిగలదు/ స్త్రీ పురుషుల సమతా సంగీతం /ప్రేమ సీమల మీద ప్రవహించదు /ఇంటి మగాణ్ణి శిక్షించండి / మార్కెట్ మగాణ్ణి దహించండి'*** శిక్షించడంలో సంస్కరణ ఉంది. దహించడంలో సమూల ఛేదనం ఉంది. మొగుణ్ణి సంస్కరించుకోవాలి. మార్కెట్టును సంహరించుకోవాలి.

**ప్రపంచీకరణ విధానాలవల్ల స్త్రీ జాతి పరిస్థితి పెనంమీద నుంచి పొయ్యిలో పడ్డట్టయింది. మార్కెట్టు వస్తువుగా, మార్కెట్టు సరుకును అమ్మిపెట్టే మరో సరుకుగా స్త్రీ మలచబడింది. శరీరావయవాలే కాక ఆమె అందం, ఆమె స్వరం కూడా ఈనాడు మార్కెట్టు సరుకైంది.**

భాషకూ సంస్కృతికీ ఉన్న సంబంధాన్నే కాకుండా మనిషి జీవితంలో సంస్కృతి ఎంతగా పెనవేసుకుపోయిందో కూడా ఈ ఖండికలో మనం చూడగలం. ఈ సినిమా ద్వారా కూడా మన సంస్కృతి ఎంతగా విధ్వంసమౌతుందో అద్దేపల్లి ఈ సంకలనంలోని అనేక కవితల్లో విశ్లేషించాడు. “వెలుతురు కిరణాల చీకటి కొరడా” అటువంటి వాటిలో ఒక ఖండిక.

***ఏ జాతి సంస్కృతికి అయినా ఆ జాతి మాతృ భాష మూలస్తంభం లాంటిది. మాతృభాషను పరిరక్షించుకోవడం ద్వారా సంస్కృతి విధ్వంసం కాకుండా కాపాడుకోగలం. అయితే ప్రపంచీకరణ యుగంలో మనకు తెలియకుండానే. మన ప్రమేయం లేకుండానే ఈ సాంస్కృతిక విధ్వంసం జరిగిపోతూ ఉంది.***

***“ఒక్కొక్క గంతూ/ తన ఉజ్వల భవిష్యత్తుకి/ మెట్టుగా మారుతుందా లేదా /అనే స్పృహ అబ్బాయిది –***

***వెనక్కెళ్ళి ముందుకొస్తున్న నడుం/ సరిగ్గా ప్రేక్షకుడి శరీరాన్ని కొల్లగొడుతుందా లేదా/ అనే స్పృహ రచయితది –***

***అతి ముఖ్యమైన కామకేంద్రాల్ని / స్పష్టంగా చూపించగలుగుతున్నావా లేదా/ కెమెరా కన్నుతో/ అసలుకన్నుకి పొరలు కప్పుతున్నానా లేదా /అనే స్పృహ ఛాయా చిత్ర గ్రహకుడిది –***

***దృశ్యం ప్రేక్షకుణ్ణి కౌగిలించుకొనేసరికి / అదొక వికృతమైన /శరీర వ్యాపారమై పేల్తుంది”*** ‘ప్రతిభా’వంతమైన వారి వారి మనోవ్యాపారం ఎంత వికృతంగా మారిపోయిందో కవి ఈ ఖండికలో ప్రదర్శించాడు.

ఏ జాతి సంస్కృతికి అయినా ఆ జాతి మాతృ భాష మూలస్తంభం లాంటిది. మాతృభాషను పరిరక్షించుకోవడం ద్వారా సంస్కృతి విధ్వంసం కాకుండా కాపాడుకోగలం. అయితే ప్రపంచీకరణ యుగంలో మనకు తెలియకుండానే. మన ప్రమేయం లేకుండానే ఈ సాంస్కృతిక విధ్వంసం జరిగిపోతూ ఉంది.

ఈ పరిణామాన్ని అద్దేపల్లి ‘చీకటి నాహ్వానిస్తున్న సంజెగుమ్మం’ అనే కవితలో కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

***“సంస్కృతి నా యిల్లైతే/భాష నా వీథి గుమ్మం/ సంస్కృతి నా జీవితమైతే /భాష నా శ్వాసమార్గం /సంస్కృతి నా అమ్మైతే /భాష నా ఆరాధనా గీతం /వీధి గుమ్మాన్ని మోతరాకుండా / వాడు పగలగొడుతుంటే /ఇల్లు కన్నీటిగోడలై పునాదుల్లోకి / యింకి పోతుంది”***

ఈ ప్రపంచీకరణ నేపథ్యంలో కార్పొరేటు వ్యవసాయం ముందుకొచ్చింది. దీని మూలంగా చిన్నకారు, సన్నకారు రైతుల జీవితాలన్నీ దూదిపింజల్లా గాలిలో ఎగిరిపోతున్నై, ఈ దేశంలో ఏమూల, ఏరైతు చితికిపోయినా మొత్తం దేశానికి వెన్నుముక విరిగిపోయినట్టే. ఈ పరిస్థితుల్లో కవుల బాధ్యత మరింత పెరిగింది. అందుకే అద్దేపల్లి తన ప్రగతిశీల కవిత్వానికి కొనసాగింపుగా ప్రపంచీకరణ యుగంలోనూ తన కలాన్ని హలం పక్షంగానే నడిపించాడు. ‘‘పండుగపూట’’ అనే ఖండికలో–***“తడిసిపోయిన ధాన్యం కట్టల కళేబరాల పక్క/ ఆత్మహత్యల ఆలోచనల మంటల మీద పడి/ పొర్లుతున్న రైతుని / ప్రపంచ బ్యాంకు నిబంధనలతో కట్టి”*** పడేస్తున్న వైనాన్ని కళ్ళకు కట్టేట్టు చిత్రించాడు. అయితే, కేవలం రైతుల దైన్యాన్ని వర్ణించినంత మాత్రాన కవుల బాధ్యత తీరిపోదు. వారి పక్షాన నిలబడి జీవితంపైన నమ్మకాన్ని, విశ్వాసాన్ని కల్గించాలి. ఏడవకండేడవకండని కంటనీరు తుడవాలి. అద్దేపల్లి ఇదే ఖండికలో అదేపని చేశాడు.

***“ నాగలి కర్రు/ మట్టినాలుక మీద /బీజాక్షరాలు రాస్తుంది/ ఆకుపచ్చని కావ్యాలు/ జీవన ప్రతిబింబాలుగా విస్తరిస్తే”***

అంటే రైతు భవిష్యత్తును కవి ఎంతో ఆశావహంగా కలగన్నాడు. అలుముకున్న చీకటికి భయపడుతున్న రైతాంగ జీవితం మధ్యలో ఈ కవిత ద్వారా అద్దేపల్లి ఒక చిన్న దీపాన్ని వెలిగించాడు.

ఈ ప్రపంచీకరణ యుగంలో విద్యావ్యవస్థలో నమూలమైన మార్పులొచ్చాయి. చదువు సంధ్యల్ని ఈ రోజు ‘కేజీ’ల లెక్కన కొనుగోలు చేయాల్సి వస్తుంది. పాలుకూడా మరువని పసివయసు నుంచే బాలబాలికలు ఊపిరాడని కాన్వెంటు డ్రస్సుల్లో నాలుగు గోడల మధ్య జైలు జీవితాల్ని గడపవలసి వస్తుంది. అందువల్ల రేపటి పౌరులంతా అందమైన, అతి ముఖ్యమైన తమ బాల్య దశలను అమాయకంగా కోల్పోతున్నారు. ఈ దశలోని అన్ని అనుభూతులకూ వారు దూరం అవుతున్నారు. అందుకే ఈ దశకు చెందిన ఆటపాటలన్నీ తమ తమ రూపాల్ని కోల్పోతున్నాయి. ఈ విషాదస్థితిని కూడా అద్దేపల్లి “ఈ దారి

ఎక్కడికి పోతుంది” అనే ఖండికలో చిత్రించాడు.

***కత్తి పడవలు, నెమలికన్నులు/ ఇసకు గూళ్ళు, బువ్వాలాటలు/ కొమ్మ ఉయ్యాలలు, కోతి కొమ్మచ్చులు/ అన్నీ నేడు వీడియో గేమ్స్‌గా’*** మారిపోతున్న వైనం మనందరికీ తెలిసిందే. “ జీవితం పసిపాప దేశం మార్కెట్టులో అమ్మానాన్నల నుంచి తప్పిపోయింది. అందుకే మన ఆటపాటలకే కాక అనుభూతులకు కూడా మనం దూరం అయ్యామని కవి ఆవేదన చెందుతున్నాడు.

స్వచ్ఛందగా నిర్మలంగా ఉండవలసిన దేశం ఆకాశం ఈ విధంగా పొగచూరిపోవడాన్ని అద్దేపల్లి భరించలేకపోయాడు. అలముకున్న పొగమబ్బుల్ని తరిమికొట్టడం కోసం సామాజిక బాధ్యత వహించి తన కలాన్ని కరవాలంగా కొన్ని కవితల్లో ఝుళిపించాడు. భవిష్యత్తును సానుకూలంగా దర్శించాడు. ***“ఇక్కడ ఖాళీయైన గూళ్ళలోంచి/ ఎప్పటికైనా/ ఆకలి కళ్లు/ మందలు మందలుగా/ ఎగిరొస్తే – మరిచిపోకండి”*** అన్ని గ్లోబల్ మార్కెట్టు ‘మేధావుల్ని’ ‘పిచ్చెక్కి’ అనే ఖండికలో తీవ్రంగా హెచ్చరించాడు. అద్దేపల్లి గొప్ప ఆశావాది. దేశం భవిష్యత్తు మీద; శ్రమశక్తి మీద గొప్ప నమ్మకం ఉన్నవాడు. అందుకే–

***“మనసులోని మట్టితనం/మేల్కొనే సమయం వచ్చింది/ అమ్మతనం ముందు అమ్మకం తనం ఓడిపోతుంది./ మన శ్రమతో మనదారిలోని ముళ్ళనూ రాళ్ళనూ/ మనమే తొలగించుకొని / కొత్తదారి వేసుకున్నాక/ దేశం తల ఎత్తితే ఆకాశం తగలాలి/ దేశం చెయ్యి చాస్తే /సూర్యబింబం వచ్చి అరచేతిలో నిలవాలి!/ ఇప్పుడు దారిమోస్తున్న గమ్యం/ దేశం మీద శిరస్సులా కనిపించింది/దేశమే ఒక జండాగా/ నా గుప్పెట్లో నిలబడింది”*** అని ప్రగాఢమైన ఆత్మవిశ్వాసాన్ని ‘ఈ దారి ఎక్కడికి పోతుంది?’ అనే ఖండికలో ప్రకటించాడు.

జనశక్తి గురించేకాక, జనకవన శక్తి గురించికూడా అద్దేపల్లికి బాగా తెలుసు. కత్తికంటే కలం ఎంత గొప్పదో; డాలర్ కంటే అక్షరం ఎంతటి శక్తిమంతమైందో; అక్షరం కవిత్వంగా మారినప్పుడు ఎంతటి భీరుడైనా. ఎటువంటి శూరుడుగా మారతాడో; తాను కోల్పోయిన దానిని సాధించడం కోసం; తన భవిష్యత్తును నిర్మించుకోవడం కోసం ఎంతగా పిడికిలి బిగిస్తాడో కూడా అద్దేపల్లి వివరించాడు. “అక్షరం రాస్తున్న చెయ్యి ఆగదు” అనే ఖండిక అటువంటిదే.

***“హస్తాక్షరం/ ఆకాశ ప్రమిదలో అఖండ సూర్య దీపం/ ... /అక్షరం ఆరిపోదు / సూర్యుడు చీకట్లోకి జారిపోడు/ ప్రమిద ఎప్పటికీ పగిలిపోదు / అమ్మకడుపులో తొమ్మిది నెలలు / పిడికళ్ళు బిగించుక్కూర్చున్న శిశువు/ ..../ దీపం వెలుగుతూనే ఉంటుంది/ అక్షరం నిలబడే ఉంటుంది /యంత్రాల్లో వెలుగుని పోసి/ ఛిన్నాభిన్నం చెయ్యడానికి చాచిన చేతుల మీదనే/ ఆ వెలుగు కొత్త చరిత్రాక్షరాలు రాస్తుంది/ దీపం వెలుగుతూనే ఉంటుంది/ అక్షరం రొమ్ము విరుచుకుని నిలబడే ఉంటుంది”.*** ఒక శాస్త్రీయమైన వాస్తవానికి అద్భుత కళాత్మక రూపం పై ఖండభాగం. గర్భస్థ శిశువు రూపానికి, తెలుగు అక్షరం రూపానికి సారూప్యత కల్పించడం కవికల్పనే కావచ్చు. శిశువు పిడికిళ్ళు బిగించే వాస్తవానికి వాచ్యం చేయడం ద్వారా తెలుగు అక్షరం, తెలుగు కవిత్వం, తెలుగు కవి శక్తి, పోరాట పటిమలను కవి ధ్వనించడం అపూర్వం. సామాజిక బాధ్యతల్ని విస్మరిస్తున్న కొందరు తెలుగుకవులకు తమ గురుతర బాధ్యతల్ని కూడా అద్దేపల్లి పైపాదాలలో వ్యంజింపచేశాడు. భవిష్యత్తు గురించిన తన దర్శనాన్నీ, తన కవిత్వ దృక్పథాన్నీ కూడా స్పష్టం చేశాడు.

శిశువు రూపంలో ఉన్న ఈ అక్షరాలు ఎలా పరిణామం చెంది ఎన్నెన్ని రూపాలు పొందాయో కూడా అద్దేపల్లి కొన్ని ఇతర కవితల్లో కవిత్వీకరించాడు. అలాంటి వాటిలో ‘ప్రాణపదం’ అనేది ఒకటి.– ***‘అక్షరాలు/ నాభి వెనుక గాలి గూళ్ళలో కళ్ళు తెరచి/ హృదయ సీమల్లో రెక్కలు తగిలించుకొని / కంఠమార్గంలో వరసలు వరసలై కట్టి/ పెదవుల మీద నిలబడతై’ (కాలం మీద ...పు. 5).*** అక్షరం పరిణమించి పదంగా మారి, పెదవి మీద ఎలా నిలబడిందో కవి స్పష్టం చేశాడు. అంతేకాదు, ఆ పదం ఎంత శక్తివంతమైందో కూడా కవి అదే ఖండికలో వివరించాడు– ***‘పదాన్ని అవమానిస్తే/ అది మనిషి మీద***

***ఈ సంకలనంలోని “ఈనాటి హీరో”, “ఫైర్” “డాన్స్ బేబీ డాన్స్” వంటి ఖండికలు కూడా తొలగిపోతున్న మానుషధర్మాల్ని వాక్యానించేవే. రూపు మార్చుకుంటున్న లలిత కళల్లోని వైచిత్రతనాన్ని విశ్లేషించేవే.***



## జనవరి నెల పురస్కారాలు



**తారతమ్యం**

*కథకు: రూ.700/-*

**రచయిత : ఇంద్రగంటి నరసింహమూర్తి**

**సాహితి వ్యవసాయం**

*కవితకు : రూ .500/-*

**రచయిత : ఎస్.వి.రమేష్ కుమార్**

*సినీ రచయిత జనార్ధన మహర్షి అందిస్తున్న పురస్కార చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*



*వ్యాసం : స్త్రీవాద కవిత్వంలో మిథోపోయి రచయిత : డా॥ ఎం.ఎన్. బ్రహ్మనందయ్య*

*ఈ రచయితకు 'కర్లపాలెం రుక్మిణమ్మ స్మారక పురస్కారం రూ.500/- అందజేయబడుతుంది*

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.*

***- ఎడిటర్***

***పగబడుతుంది/ పదాన్ని ప్రాణం పోసి పోషిస్తే/ అది ప్రాణాలిచ్చి కాపాడుతుంది' (పు.5).*** అక్షరం పదంగా మారే క్రమంలో ముందు వివరించినట్టుగా ఒక శాస్త్రీయ పరిణామం పొందినపుడే ఆ పదానికి ఇంతశక్తి. అస్తిత్వాలు ఏర్పడతాయి. స్వరూప స్వభావాలు ఒక్కటే అయినా, సాధారణ వ్యక్తుల కంటే కవుల్లో ఆ పదాల రంగూ, రుచీ, వాసనలు భిన్నంగా ఉంటాయి. అద్దేపల్లి ఈ విషయాన్ని ఇదే ఖండికలో మరింత పదునుగా స్పష్టం చేశాడు–

*'కవిలో దీపం వెలగ్గానే*
*గుండె నీడల్లో నిద్రపోతున్న పదాలన్నీ*
*సైనికుల్లా సాయుధమై వచ్చి*
*వరసలో నిలబడతై*
*సమర యోగ్యత గల సైనికుల్ని*
*కవి మూడో కన్నుతో ఏరుకుంటాడు*
*అంతరంగం యుద్ధరంగమౌతుంది*
*గెలిచిన సైనికులందర్నీ*
*కలం మొన మీద నిలబెట్టి*
*కవి తన సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటాడు*
*కావ్యం, కవితా విషయ కేతనాన్ని*
*ప్రజల శిరస్సుల మీద ఎగరేస్తుంది"* అక్షరం పదంగా, పదం కావ్యంగా ఎలా పరిణామం చెందుతుందో అద్భుతంగా తెలియచేసిన ఖండిక ఇది.

ఈ సంపుటాలలోని ఏ అక్షరాన్ని ముట్టుకున్నా ప్రపంచీకరణ ప్రభావానికి ఛిద్రమౌతున్న కోటానుకోట్ల జీవిత శకలాలు ఏదో ఒక పార్శ్వంలో గుచ్చుకుంటూ ఉంటాయి. పాఠకలోకంలో ప్రపంచీకరణ పట్ల అప్పటివరకూ ఉన్న భ్రమలు తొలగిపోతాయి. సంస్కరణలు వెనుక పొంచివున్న మోసాన్ని సామాజికుడు గ్రహించగలుగుతాడు.

భవిష్యత్తు గురించిన ఆలోచనలకు శంఖం పూరిస్తాడు. ఈ సంపుటాల ద్వారా అద్దేపల్లి సాధించదలచుకొన్న ప్రయోజనమేమిటి! "చుట్టూరా ఆవరించుకుని వున్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం కంటే, ప్రయత్నించి ఎంత చిన్న దీపాన్నయినా వెలిగించడం మంచిది" అని విజ్ఞులు చెప్పారు. అద్దేపల్లి చేసింది ఇదే! పొగచూరని నిర్మలమైన ఆకాశాన్ని మచ్చలేని అద్దంతో పోలుస్తారు. వేగంగా ప్రవహిస్తూ ఉన్న కాల స్వభావాన్ని అధ్యయనం చేయడంలోనూ, ప్రపంచీకరణ నేపధ్యంలోని సామాజిక స్థితిగతుల్ని అంచనా కట్టడంలోనూ అద్దేపల్లికి ఉన్న 'విజన్'కు ఈ 'పొగచూరిన ఆకాశం' ఒక "పొగచూరని ఆకాశం". ఇవి కేవలం కవితలు కావు. అద్దేపల్లి కాలం మీద చేసిన సంతకాలు.

కాలం మీద సంతకాలు చేసిన ఏ కవికైనా కాలం చేయడం ఉండదు. కందుకూరి, గురజాడ, శ్రీశ్రీ, జాషువా వంటి అనేకమంది ప్రతిభావంతులైన కవుల వరుసలో ఇది అద్దేపల్లికీ చెల్లుతుంది. ☙

కవిత

# ఒక చుక్క గగనానికెక్కె...

- ఝాన్సీ కె.వి కుమారి
9010823014

గగనానికెక్కింది ఒక చుక్క
చైతన్య జ్వాలలను
దిగంతాలలో రువ్వుతూ
తన చిరునవ్వుల సంతకాన్ని
అక్షరాల్లో వెలిగిస్తూ...
క్రాంతిని దర్శించిన అక్షరం
అన్యాయం కానిది
అబద్ధాలంటనిది
అమ్ముడు పోనిది
చీకట్లను తరిమేది
అహో! ఆ అక్షరం
అక్షయం సుమా!
అక్షయమైన అక్షరం
ఏ గుండెలో విస్ఫుటిస్తుందో
ఆ గుండె
శాశ్వత సంగీతమవుతుంది
అక్షరాల్లో శ్వాసిస్తుంది
రేపటి తరాలను శాసిస్తుంది



వెలుగులతో నడిపిస్తుంది...
యుద్ధరంగంలో కవాతుచేసిన అక్షరం
ఆయుధాలన్నింటిని ఎక్కుపెట్టింది
గజళ్ళ గజాలను మోహరించింది
ప్రక్రియలన్నింటా ప్రయోగాలు
యోధులకే సాధ్యం
కొత్త సైన్యాన్ని
సమాయత్తం చేయడం
సైన్యాధ్యక్షుడి అత్యవసరం
అక్షర మహావీరుడు
నేలకొరిగిన వేళ
యుద్ధరంగం బిత్తరపోయిన వైనం
ఎనిమిది పదుల యవ్వనం
చిరునవ్వుల మాటున లాస్యం
యుద్ధం కొనసాగించడమే
నేటి అసలైన కర్తవ్యం...
కృష్ణానదీ తీరాన విజయవాటిక
నడిబొడ్డున...ఠాగూరు గ్రంధాలయమా
నీ ఒడిలో ప్రతిధ్వనించిన ఆ స్వరం
"నిశ్శబ్దరాగంలో విస్ఫుటించిన అక్షరం
పీడిత ప్రజల గుండెల్లో ఆశాదీపం
స్వేచ్ఛాభారతి చిరునవ్వులకోసం ఆరాటం
'కృపాక్రాంతి' కవిగాయకుల స్ఫూర్తి"
అంటూ శుభాశంసలతో
సౌభ్రాతృత్వాన్ని ఆవిష్కరించిన
అన్నా, అద్దేపల్లీ,
ఏ పల్లెల ప్రగతిని
గగనంలో రగిలించేందుకు
ఈ మరోప్రస్థానం....?

# అద్దేపల్లి

- నూనెల. శ్రీనివాసరావు
9492970231



అద్దేపల్లి లేదని,ఇక రాదని
కన్నీటి పర్యంతమైయ్యే నను కని
నా ముందర అక్షరాలు నవ్వాయి
నా కన్నీళ్ళు తుడిచి ఇలా పలికాయి-
ఏ నవ్వులో అనురాగం పలుకుతుందో
ఏ చూపులో ఆప్యాయత కురుస్తుందో
ఏ చేయి తాకితే ప్రోత్సాహం ప్రతిభై నడిపిస్తుందో
ఆ చైతన్యమూర్తి మాలోనే వున్నాడు చూడు
ఎక్కడో దూరాన కాదు !,మా వర్ణమాలలోనే
అ అంటె అమ్మే కాదు...అద్దేపల్లి కూడా..
అఆలు దిద్దేందుకు తడబడేవాడిని
కవిగా మలచిన శిల్పిని
కవిత్వమే ఆశగా శ్వాసగా బ్రతికిన వాన్ని
మా అక్షరాల్ని నేలనేలంతా విత్తులా జల్లిన వాన్ని
ఎల్లలుగా  సాహిత్య సుగంధాన్ని వెదజల్లిన వాన్ని
మా అక్షరాల్ని గోదావరి గలగలల్లో నిలిపిన వాన్ని
మా అక్షరాల్ని అస్త్రాలుగా దోపిడిపై గురిపెట్టించిన వాన్ని
సరికొత్త సమాజాన్ని...సమున్నత సంస్కృతిని కలగన్న వాన్ని
మనిషి కోసం...మమత కోసం కలం పట్టిన మహర్షిని
మా వర్ణమాలలో ప్రధమాక్షరంలోనే పొదుగుకుంటాము
అ అంటె అమ్మతో పాటు అద్దేపల్లిని
సగర్వంగా పలికిస్తామని ఆర్తిగా పలికిన  అక్షరాల వంక
చెమ్మగిల్లి చూసాను..
అ ఆ లలో అద్దేపల్లి ప్రతిబింబం నవ్వింది
అదే నవ్వు..అదే స్వఛత..అదే భావావేశం
భావితరానికి సత్కవులనందించే చిరుదరహాసం.

నివాళి

# ప్రపంచీకరణ దిక్సూచి




–దాట్ల దేవదానం రాజు

9440105987


**అద్దేపల్లి తన కవిత్వ మార్గంలో వస్తువుకోసం వెతుక్కోనవసరం లేకపోయింది. అనంతర కాలంలో ఆయన రాసిన కవిత్వం వస్తువులో ఏకరూపత పొందేంతగా మమేకం అయ్యాడు. 'పొగచూరిన ఆకాశం'లోని కవితలు ప్రపంచీకరణ వ్యతిరేకత సంతరించుకున్న ఒక దీర్ఘకవితగా పేర్కొనవచ్చును. కాసింత వరుస మార్చి సమన్వయించుకుంటే చాలు దీర్ఘకవిత అయిపోతుంది.**

**వా**స్తవాల నుంచి దూరంగా పారిపోవడం స్వేచ్ఛ ఎలా అవుతుంది?వాస్తవాల్ని మరుగుపరచి అభివృద్ధి అంటే ఎలా కుదురుతుంది?ఒక పక్క ఆలింగనం చేసుకుంటూనే చాపకింద నీరులా సమస్త అంగాల్ని అధీనంలోకి తెచ్చుకునే ప్రక్రియను ఏమంటారు?తమ ప్రయోజనాల్ని కాపాడలేని వాటినన్నింటినీ విధ్వంసం చేసేయడం ఒకటే మార్గమా? స్వేచ్ఛా వ్యాపారమే అత్యంత లాభసాటిగా మారి అదే ప్రగతి అని చెప్పకనే చెబుతున్న ఆధునిక అభివృద్ధి నమూనాను తయారు చేస్తున్న దెవరు? ఏవో కొన్ని మెరుపులుంటాయి. కాంతివంతమైన ప్రలోభాలుంటాయి. ఆకర్షించే బాటలుంటాయి. వాటి వెనుక దాగిన చీకటిని ఎత్తి చూపించేవాడే కవి. పాఠంలా బోధించేవాడే కవి.ముందుగా ఊహించి హెచ్చరికలు చేసేవాడే క్రాంతి ద్రష్ట అయిన కవి. భవిష్యత్ దర్శనం చేసి అప్రమత్తంగా మెలగడానికి దారి చూపించేవాడే కవి.వీటన్నింటికి ఉదాహరణగా నిలిచినవాడే అద్దేపల్లి రామమోహనరావు. వలసపాలనలో మగ్గి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లభించాయని సంబరపడినంతసేపు ఉండదు తిరిగి వలస పాలనలోకి వెళ్ళడానికి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా బహుళజాతి కంపినీలు మీదపడి రక్కుతాయి. లాభాలు తరలించుకు పోతాయి. వీటిని ఎదుర్కొని పోటీప్రపంచంలో నిలదొక్కు కోడానికి ఆత్మవిశ్వాసం మెండుగా కావాలి.

దేశీయ కంపెనీల్ని అంతర్జాతీయ పోటీకి సమాయత్తం చేయడానికి బోలెడంత కసరత్తు చేయాలి.ఇట్లాంటి సానుకూల వాతావరణం కల్పించడానికి కవి తన రచనల ద్వారా బాధ్యత తీసుకుంటాడు. తనదైన మార్గంలో నిర్వర్తించడానికి నిరంతరం శ్రమిస్తునే వుంటాడు. జనం తన భావాలతో కలిసే దాకా లేదా వారందరి మనసుల్ని దివ్యతేజో వికాసంగా చక్కదిద్దడానికి కవి మథన పడుతూనేవుంటాడు. ఆల్ ఈజ్ వెల్ విత్ ది వరల్డ్ అన్నట్లుగా ఎప్పటికప్పుడు ఉన్నదాంతో సంతృప్తిపడుతూ లేదా రాజీపడుతూ హాయియైన వెన్నెల్ని ఆస్వాదిస్తూ, అందమైన పూలవనాన్ని అవలోకిసన్తూ, ప్రకృతిపట్ల అపార ప్రేమానురాగాల్ని ఆలపిస్తూ కూర్చోక మరి ఈ కవి ఎందుకు మూలన నిలబడి ఊరికే గగ్గోలు పెడుతూ గుండెలు బాదుకుంటూ, ఆకాశాన్ని కళ్ళు ఎర్రజీరల్తో ప్రదర్శిస్తూ, మాటిమాటికీ పిడికిలి బిగిస్తూ, కొండకచో తొడగొట్టి సవాలు చేస్తూ, చీల్చిచెండాడే మాటల్ని అస్త్రాలుగా ప్రయోగిస్తూ, యుద్ధభేరీ మోగిస్తూ, చొక్కా చింపుకుని నగ్నంగా నిలబడి తన నేలకు వంగి వంగి నమస్కరిస్తూ, తన చుట్టూ వున్న వాళ్ళని ఆలింగనం చేసుకుంటూ, ఉండుండి పెడబొబ్బలు పెడుతూ, తను నుంచున్న నేల మీది ధూళిని నెత్తి మీద పోసుకుంటూ.... అతనెందుకలా? పై సర్వావస్థలనూ ముద్దచేసి

ఆకారంగా మలిస్తే ఆ ఆకారం అద్దేపల్లి రామమోహనరావు అవుతుంది.

అద్దేపల్లి తనకవిత్వ మార్గంలో వస్తువుకోసం వెతుక్కోనవసరం లేకపోయింది. అనంతర కాలంలో ఆయన రాసిన కవిత్వం వస్తువులో ఏకరూపత పొందేంతగా మమేకం అయ్యాడు. 'పొగచూరిన ఆకాశం'లోని కవితలు ప్రపంచీకరణ వ్యతిరేకత సంతరించుకున్న ఒక దీర్ఘకవితగా పేర్కొనవచ్చును. కాసింత వరుస మార్చి సమన్వ యించుకుంటే చాలు దీర్ఘకవిత అయిపోతుంది.

**నిండా పొగచూరిన ఆకాశం వల్ల మన నగ్ననేత్రాలు తాత్కాలి కంగా అసలు రంగుల్ని గుర్తించకపోవచ్చు. కవి ఇచ్చే జ్ఞాన నేత్రాలు ఒక్కో పొరను విప్పుతుంది. అపుడు ముందుగా కాంతి దర్శనం చేసిన కవికి వందనం చెయ్యక తప్పదు.**

సామ్రాజ్యవాదులు తమ దృష్టి మార్చుకుని మొత్తం ప్రపంచాన్ని గుప్పెటలో పెట్టుకునే ప్రయత్నం లోంచే ప్రపంచీకరణ పుట్టింది. వలసపాలనలో మగ్గినంత కాలం అణగివుండి స్వాతంత్ర్యం పొందామని ఏటా సంబరాలు చేసుకోవడంతో సరిపోదు. పరోక్షంగా దొంగ బెబ్బులిలా మీదకురికే సమయం కోసం సామ్రాజ్యవాదులు వేచి వున్నారన్న సంగతి మరచిపోకూడదు. దేశవిదేశీయ పరిణామాల్ని అత్యంత జాగరూకతతో పరిశీలిస్తున్న వారే నిజమైన దేశభక్తులు. భ్రమల్లో ఉంచే సంస్కరణల గుట్టు విప్పే మేధావులు. అట్లాంటి చైతన్యంతో కలం జులిపించే బాధ్యతాయుత కార్యాన్ని భుజాన వేసుకున్నవారే అద్దేపల్లి రామమోహన రావు.

పుష్కలంగా సంపద ఉంటుంది. వనరులు ఉంటాయి. ఒకచోట పోగుపడ కుండా చూడగలిగితే పదివేల కోట్ల జనాభాకైనా బ్రహ్మాండంగా సరిపోతుంది. సంకుచిత కులమత ప్రాంతీయ రాజకీయాలు, సిద్ధాంతాల పేరిట ఎదుటివాడ్ని నమ్మబలికే రాజకీయాలు, ప్రపంచవ్యాప్తంగా ఆర్థికవ్యవస్థల్ని అతలా కుతలం చేసే ఆయిల్ రాజకీయాలు, స్వార్థపర ఆలోచనలతో ప్రకృతివనరుల్ని దోచుకునే రాజకీయాలు... ఇవన్నీ అంతిమంగా మానవత్వాన్ని మంటగలిపే విధ్వంసానికి కారణాలవుతాయి. 'ఏ పౌరుడూ మరొకడ్ని కొనగలిగేంత ధనాన్ని కూడబెట్టకూడదు. అలాగే ఏ పౌరుడూ తన్ను తాను మరొకడికి అమ్ముకునేంత పేదవాడు కాకూడదు.'అని రూసో చెప్పాడు. సమకాలీన సంఘటనల్ని గమనిస్తే రూసో మాటలకు పూర్తివైరుధ్యంగా సాగుతున్నాయని తెలుసుకోవచ్చు. ఇది గమనించే అద్దేపల్లి ఈ దారి ఎక్కడికి పోతుందని ఆవేదనచెంది 'నిన్న నేను నా అవసరానికి వస్తువులు కొన్నాను! నేడు నా స్థాయికోసం వస్తువులు కొంటున్నాను! రేపు నేను ఒక వస్తువు కావడం కోసం! జీవితాన్ని అమ్ము కుంటున్నాను' అంటాడు. మనిషి తనే ఒక వస్తువు కావడం వెనుకగల అగత్యం చూసారు కదా. మానవీయత కంటే వ్యామోహమైనదేదో దానికోసం పాకులాడటం, అవసరంకంటే సామాజిక హోదాకోసం అర్రులు చాచడం తనే జీవితాన్ని అమ్ముకోవలసిరావడం... ఇదంతా ఒక విషాదయోగం.

కవి ఎప్పుడూ ప్రాపంచిక విషయాలపట్ల అప్రమత్త తో మెలుగుతాడు. ఆధిపత్యాన్ని, అధికారాన్ని సూటిగా ప్రశ్నించ డంతో బాటు మౌలికమైన విషయాల్ని దృష్టిలో పెట్టుకుని జరుగుతున్న వాటిని సమర్థవంతంగా మన మెదడులోకి జొప్పించే ప్రయత్నం చేస్తాడు. దాంతో ఒక పరిణామ క్రమం లోని దశను చెబుతాడు. 'పడమటి సూర్యోదయం' కవిత చూడండి. శీర్షిక ఒక అసంగతమై నది. అయినా కవి ఎవరిని ఉద్దేశించి చెబుతున్నాడో తెలిసిపోతున్నది. 'వాడు మన పోరు పడలేక పోతూ పోతూ! దేశం మెదడులో వ్యాపార విత్తనం నాటి పోయాడు! ఏభై ఏళ్ళుగా అక్కడ్నుంచి! ఎరువులు పంపుతూనే ఉన్నాడు.' అంటూ 'దేశాన్ని తూర్పు తిరిగి దణ్ణం పెట్టమని! రేపు సూర్యుడు పడమటి నుండి ఉదయిస్తాడు'అని వ్యంగ్యంగా ముగిస్తాడు అద్దేపల్లి. యిట్లాంటి వ్యంగ్య వైభవాన్ని అద్దేపల్లి రాసిన చాల కవితల్లో చూస్తాం. ముఖ్యంగా తాను నమ్మిన సిద్ధాంతాల పట్ల నిబద్ధతను పాటించడం అద్దేపల్లి కవిత్వ సారాంశంగా చెప్పుకోవచ్చు.

ఆలోచనల్లో విశాలతను సాధించడం చేసే పనిని నిమగ్నతగా అద్దే పల్లి ఇష్టపడతారు. 'మీ నేల మీద నడవండి! పడిపోకుండా ఆకాశాన్ని పట్టుకోండి! మీ మట్టి మీద నిలబడండి! కూరుకుపోకుండా భూగోళాన్ని పట్టుకోండి! అన్ని వైపుల నుంచీ వచ్చే గాలులకి! కిటికీలన్నీ తెరవండి.'అంటూ మట్టి మీద నిలబడటానికి మట్టిని ప్రేమించ డానికి దేశీయత పట్లగల అభిమానాన్ని తెలియజేస్తాడు, అలాగే 'నా ఎదట మూసుకున్న తలుపుల్ని! దేశమంత అరచేత్తో! అదేపనిగా తడుతున్నాను.' అంటూ సాంస్కృతిక విధ్వంసం పట్ల తన స్పందన ఆత్మ విశ్వాసాన్ని ప్రకటిస్తున్నారు. అద్దేపల్లి తానొక్కడై

నినదిస్తున్న ధర్మాగ్రహం పట్ల కొంత మంది ఉదాసీనత ప్రకటించొచ్చు, ప్రత్యక్ష అనుభవంలో సమస్యలు, ఇబ్బందులు కనిపించకపోవడం వల్ల. ఆ ఆగ్రహం లోని నిజాల్ని కాలమే నిర్ణయిస్తుంది. నిండా పొగచూరిన ఆకాశం వల్ల మన నగ్ననేత్రాలు తాత్కాలికంగా అసలు రంగుల్ని గుర్తించకపోవచ్చు. కవి ఇచ్చే జ్ఞాన నేత్రాలు ఒక్కో పొరను విప్పుతుంది. అప్పుడు ముందుగా కాంతి దర్శనం చేసిన కవికి వందనం చెయ్యక తప్పదు. 'ఇందు మూలముగా తెలియబరచునదేమనగా, అన్ని దేశములునూ ఇకపై నాకు భయపడి బానిసలు కావలెను. అందరునూ తమతమ కళ్ళెములను నాచేతిలో పెట్టవలెను. ఇకపై ఏ దేశమునకునూ సొంత నాగరికతలు లేవు. నా శాసనమే ప్రపంచశాంతిని, యుద్ధం ద్వారా స్థాపించును.' ఇది సామ్రాజ్య వాద దేశం స్వయంప్రకటిత ధృవపత్రం. దీన్ని ముందుగా కవి దర్శించి ఇందు మూలంగా సమస్త ప్రజానీకానికి తెలియజేస్తూ బట్ట బయలు చేస్తున్నాడు. నిన్న ఇరాక్ నేడు లిబియా రేపు ఇరాన్ కావచ్చు. ఏ దేశమైనా స్వయంసమృద్ధి సాధించి సహజవనరులతో నిండి ఉండి ధిక్కార స్వరమై ఎదిరిస్తే చాలు ఈ ధృవ పత్రాన్ని బయటకు తీస్తుంది. వెయ్యి గొడ్లను తిన్న రాబందు యుద్ధవిమానంలా ఎగురుతూ ఎగురుతూ కూలే సంగతి తర్వాత మాట.

ప్రపంచీకరణ ముఖ్యంగా మానవసంబంధాల్ని దెబ్బ తీస్తుంది. అనుబంధాలు తెగిపోతున్నాయి. అన్ని రంగాల్లోనూ పోటీతత్వం పెరిగి వ్యక్తులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. వీటన్నిటి ప్రభావం వల్ల ఈర్ష్యలు పెరిగిపోతున్నాయి. భౌతికమైన సౌకర్య లాలసకు మనిషికి సంతృప్తిలేదు. తను కూడగట్టిన సంపదలో ఎల్లకాలం ఉండాలని తాపత్రయ పడుతున్నాడు. ఇందుకోసం మొత్తం జీవనవిధానాన్నే వాణిజ్యంగా మార్చుకుంటున్నాడు. ఫలితంగా ప్రతి విషయాన్ని ఆర్థిక సంబంధంగానే పరిగణిస్తున్నాడు. విలువల పతనమయ్యే సంధికాలంగానే ప్రస్తుత కాలాన్ని చూడాల్సివస్తున్నది. ప్రగతిశీల కవిగా అద్దేపల్లి తన సామాజిక బాధ్యతను విస్మరించ లేదనడానికి ఆయన కవిత్వమే సాక్ష్యం. ప్రపంచీకరణ పోకడల్ని నిరసిస్తూ అసమానతల పట్ల ఆవేదన చెందుతారు. అంతర్జాతీయ సమస్యల్ని ఎప్పటికప్పుడు గమనిస్తుంటారు. దేనికైనా హద్దులుపెట్టి సంకుచితత్వంతో ముడుచుకుపోవడం పట్ల అసహనం వ్యక్తపరుస్తారు. సాంస్కృతీకరణ పేరిట భాష, సంప్రదాయాలు తాత్కాలిక వ్యామోహాల బంధీలో చిక్కడంపట్ల వేదనను దాచుకోరు. జీవన వాస్తవికతను ప్రతిఫలించే రచనల పట్ల మక్కువ చూపెడతారు. తనదైన అభివ్యక్తి ప్రత్యేకతతో సొంత గొంతుతో ప్రతిస్పందించడం ఆయన శైలి.

***సాంస్కృతీకరణ పేరిట భాష, సంప్రదాయాలు తాత్కాలిక వ్యామోహాల బంధీలో చిక్కడంపట్ల వేదనను దాచుకోరు. జీవన వాస్తవికతను ప్రతిఫలించే రచనల పట్ల మక్కువ చూపెడతారు. తనదైన అభివ్యక్తి ప్రత్యేకతతో సొంత గొంతుతో ప్రతిస్పందించడం ఆయన శైలి.***

'పొగచూరిన ఆకాశం' ద్వారా అద్దేపల్లి రామ మోహనరావు చెప్పిన కవిత్వ సారాంశం ఏమిటి? ఎక్కుపెట్టిన బాణంలా ఎలుగెత్తిన సముద్రఘోషలా అక్షరాల్ని పదునెక్కించి అద్దేపల్లి ఇచ్చే అసలుసందేశం ఏమిటి? సమకాలీన కృత్రిమ జీవితాల్ని ఎండగట్టడం, సాహిత్యాన్ని ప్రగతిశీల దృక్పథాన్ని చాటే ఆయుధంగా తలచడం, అరువు తెచ్చుకున్న కుహనా సాంస్కృతిక పోకడల్ని నిర్ద్వందంగా తిరస్కరించడం, ఆర్థిక సామాజిక రాజకీయ రంగాల్లో నెలకొంటున్న విలువల విధ్వంసాన్ని ఏకిపారేయడం, ప్రమాదకరమైన పాశ్చాత్యీకరణను నిరసించడం, సంఘటనాత్మకంగా ప్రతిస్పందించి మేల్కొలిపే ప్రయత్నం చేయడం, జాతి తన అస్తిత్వాన్ని కోల్పోకుండా చేసే పోరాటానికి మద్దతివ్వడం, ప్రసారమాధ్యమాల్లోని వికృత రూపాన్ని అద్దంలో చూపించడం, వేగవంతమైన జీవన విధానంలో మనిషి కోల్పోతున్నదేమిటో ఎరుక పరచడం, ధన సంస్కృతి విశృంఖలత్వాన్ని తూర్పారపట్టడం, దిగంతాల దాకా ఎక్కుపెట్టిన బాణం గమనాన్ని గమనించి హెచ్చరికలు చేయడం, ప్రజాస్వామ్య చైతన్యాన్ని పెంపొందించి సామ్యవాద భావజాలాన్ని మనుషుల మనస్సుల్లో నాటడం, పుట్టుకతో వృద్ధులైన వారికి నూతన జవసత్వాల్ని కల్పించడం, దేశీయతకు పెద్దపీట వేసి స్వంత భాషని రక్షించుకోవడం వంటి విషయాలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి తనదైన బాణీలో కవిత్వీకరించడమే అద్దేపల్లి చేసిన పని.

నివాళి

# కలం మూసిన కవితాయోధుడు

- డా॥ జోశ్యుల కృష్ణబాబు
9866454340



***అద్దేపల్లి తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఎప్పుడూ స్తబ్ధంగా ఉంచేవారు కాదు. నిత్యం చైతన్యంతో తొణికిసలాడించేవారు. ఆయన జనవరి 13న అస్తమించారన్న వార్త ఆయన అభిమానకోటికి, ఆప్తులకు, సన్నిహితులకు, సహచరులకు అపార దు:ఖాన్ని మిగిల్చింది. యువ కవుల్ని దిగ్భ్రాంతిపాలు చేసింది. ఎవ్వరికీ తలవంచని అద్దేపల్లి కడకు కాలంతో జరిగిన యుద్ధంలో తలవంచక తప్పలేదు.***

**ఆ**త్మీయుడు అస్తమిస్తే హృదయం విలపిస్తుంది. మస్తిష్కం మందగిస్తుంది. కంఠం గద్గదమవుతుంది. ఆపాదమస్తకం చైతన్యరహితమవుతుంది. కలం కదలదు. అక్షరాలు ఆగిపోతాయి. జీవితమంతా కవిత్వమే శ్వాసగా బ్రతికిన ప్రజాకవి అద్దేపల్లి అందరికీ ఆత్మీయుడే. అజాతశత్రువే. అటువంటి అలుపెరుగని సాహితీయోధుడి జీవితంలోకి మృత్యువు దారితప్పి దొంగచాటుగా ప్రవేశించింది. హఠాత్తుగా ఆయన్ని తనతో తీసుకుపోయింది. ఇంకా ఆయన కాకినాడలోనే ఉన్నట్లుగా, ఏ శ్రీశ్రీ సభకో, జాషువాసభకో వెళ్ళినట్లుగానే ఉంది. ఒక్కసారి ఆయన ఇక లేరనే చేదునిజం మళ్ళీ హృదయాన్ని తాకి భగ్గుమనిపిస్తోంది.

నిన్నమొన్ననే 80వ వసంతంలోకి అడుగుపెట్టిన ఆ సాహితీమిత్రుడు ఇంత హఠాత్తుగా "మిత్రులారా! సెలవు... చెరగని స్మృతులలోనే ఇక నెలవు"... అంటూ నిష్క్రమిస్తాడని ఎవ్వరం ఊహించలేదు. జీన్‌ఫేంట్, ఫుల్‌హాండ్స్ షర్ట్‌తో టక్‌చేసి ఎప్పుడూ ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండే ఆ ప్రజాకవిని ఇలా అనారోగ్యం ఒక్కసారిగా క్రుంగదీసి గుంజుకుపోతుందనీ భావించలేదు.

అద్దేపల్లి తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఎప్పుడూ స్తబ్ధంగా ఉంచేవారు కాదు. నిత్యం చైతన్యంతో తొణికిసలాడించేవారు. ఆయన జనవరి 13న అస్తమించారన్న వార్త ఆయన అభిమానకోటికి, ఆప్తులకు, సన్నిహితులకు, సహచరులకు అపార దు:ఖాన్ని మిగిల్చింది. యువ కవుల్ని దిగ్భ్రాంతిపాలు చేసింది. ఎవ్వరికీ తలవంచని అద్దేపల్లి కడకు కాలంతో జరిగిన యుద్ధంలో తలవంచక తప్పలేదు.

ఒకే వ్యక్తి కవి, పండితుడు, విమర్శకుడు, సమీక్షకుడు, వక్త, గాయకుడు, ప్రోత్సాహకుడు, గురువు, స్నేహశీలి, సహృదయుడు కావడం ఒక అరుదైన విషయం. ఇన్ని విశిష్ట లక్షణాల్ని తనలో ఇముడ్చుకొన్న ఒక సాహితీ శిఖరం అద్దేపల్లి.

అద్దేపల్లి 1936 సెప్టెంబర్ 6న మచిలీపట్నంలో ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టారు. బి.ఏ. వరకు బందరులోనే చదివారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాయంలో ఎమ్.ఏ. తెలుగులో యూనివర్శిటీ ఫస్ట్ సాధించారు.

కొంతకాలం బందరు హిందూ కాలేజిలోను, నందిగామ ఎన్.టి.ఆర్. కళాశాలలోను తెలుగు లెక్చరర్‌గా పనిచేసారు. ఉద్యోగ జీవితంలో ఎన్నో ఆటుపోట్లును ఎదుర్కొన్న అద్దేపల్లిని కాకినాడ అక్కున చేర్చుకొంది. 1971లో కాకినాడ ఎమ్.ఎస్.ఎన్.ఛారిటీస్ కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా పర్మినెంట్ ఉద్యోగం, 1994 సెప్టెంబర్‌లో పదవీ విరమణ. ఈ విధంగా అద్దేపల్లికి బందరు కన్నతల్లి ఐతే కాకినాడ పెంచిన తల్లి అయింది. అద్దేపల్లి చదువుకొనే రోజుల్లో ప్రాచీన కవిత్వంపై లోతైన అధ్యయనం చేసారు. ఒక విధంగా ఆ

రోజుల్లో ఆయన విశ్వనాథకు పరోక్ష శిష్యులు. అప్పట్లో ప్రచలితమైయున్న భావకవిత్వ ప్రేరణతో ఆయన తన కవితా ప్రస్థానాన్ని ఆరంభించారు.

1960లో కృష్ణా పత్రిక ద్వారా అద్దేపల్లి కవిగా తన తొలిఅడుగు వేసారు. 1963లో ఉమర్‌ఖయాం రుబాయీలను 'మధుజ్వాల' అనే పేరుతో పద్యకావ్యంగా స్వేచ్ఛానువాదం చేసారు. అంతర్జ్వాల, రక్తసంధ్య, గోదావరి నా ప్రతిబింబం వంటి కవితా సంకలనాలు తెచ్చారు. మెరుపుపువ్వు అనే దీర్ఘకవిత రాసారు. ప్రపంచీకరణపై పొగచూరిన ఆకాశం, ఆకుపచ్చని సజీవ సముద్రం నా నేల, అయినా ధైర్యంగానే ఉంటూ మూడు దివ్యాస్త్రాలు సంధించారు. ఇక సాంస్కృతిక విధ్వంసాన్ని అక్షరాల్తో చీల్చి చెండాడుతూ రాసిన మరో దీర్ఘ కవిత తెరలు.

అయితే ఒక కవి ఎన్నో గ్రంధాలు రాసినా, ఎన్నో రచనలు చేసినా ఆ కవి పేరు చెప్పగానే అందరికీ గుర్తొచ్చే గ్రంధం ఒకటుంటుంది. అలా అద్దేపల్లి పేరు చెప్పగానే ఎవ్వరికైనా గుర్తొచ్చే కవితా సంకలనం "గోదావరి నా ప్రతి బింబం". దీన్ని 1992లో రాసారు. ఈ గ్రంధం కేవలం గోదావరీ పరీవాహక ప్రాంత ప్రజల హృదయాల్నే కాక తెలుగు ప్రజలందరి హృదయాల్ని గిలిగింతలు పెడుతుంది. గోదావరిని చూడగానే, అసలాపేరు వినగానే ఆయన హృదయం శరీరం రెండూ పులకించిపోతాయి.

'ఎక్కడికి వెళ్ళినా నాకు గోదావరి ఎదురౌతూనే ఉంటుంది' అని కవితను ప్రారంభించి కోటిపల్లి దగ్గర పడవలో రేవు దాటుతున్నపుడు, రావులపాలెం వంతెనపైనుంచి వెళ్తున్నప్పుడు, ఆత్రేయపురం గట్టు మీద నడుస్తున్నప్పుడు, రాజోలుకట్ట దగ్గర మిత్రులతో కవిత్వాన్ని చదువు కొంటున్నపుడు, అంతర్వేది అన్నాచెల్లెలుగట్టు దగ్గర సముద్రంలో కలిసిపోతున్నపుడు ఇలా గోదావరిని గూర్చి కవి తన మదిలో కదిలే భావ పరంపరని ఈ కవితలో ఒక ప్రవాహంలా వెలిబుచ్చారు.

ఇన్ని రకాలుగా వర్ణించి రాజమండ్రిలోని గోదావరిలో మాత్రం నా ప్రతిబింబం చూసుకొందామంటే నాకు వీరేశలింగమే కనిపిస్తారు అనటంలో కవిలోని సంస్కరణాభిలాష, వీరేశలింగంపై ఆయనకున్న ప్రగాఢ గౌరవం తెలుస్తాయి. అంతేకాదు త్రోవ పొడవునా పోరాటాల్ని మోసుకుపోతున్న పరమాణు ప్రవాహంలా గోదావరి కనిపిస్తోందనటంలో ఆయనలోని వర్గ పోరాట దృక్పధం వెల్లివిరుస్తోంది.

అద్దేపల్లి చేయివేయని కవితా ధోరణి అంటూ లేదు. అన్నివాదాలూ ఆయనలో విలీనమై ఉంటాయి. ఆయన కవిత్వానికి గిరులు గీసుకోలేదు. అన్నిటినీ ఆహ్వానించారు. దళిత కవిత్వం దళితులే రాయాలి అనే ధోరణికి సమాధానంగా ఆయన "సజీవ దహనం" అనే కవితలో అస్పృశ్యుల బాధలకు ద్రవిస్తూ ఇలా అంటారు.

***"మంటల ప్రపంచంలోకి వెళ్ళిపోతున్నాను/ మిత్రులారా! సెలవియ్యండి/ ఊరంతకీ అంటరాని వాణ్ణయినా/ మంటకి నేనంటరానివాణ్ణి కాను/ చిన్నప్పటి నుంచీ నాకు/ మంటతోనే వీడని అనుబంధం/ చాలీచాలని గంజినీటితో/ ఆరిపోని కడుపుమంటతో ప్రతిరోజు పెరిగాను/ మనిషికి నన్ను తనలో కలుపుకోవడం తెలియదు/ మంట నన్ను తనలో ఆప్యాయంగా కలుపుకొంటుంది.*** అంటూ మరణం తప్ప గత్యంతరం లేని పరిస్థితిని కల్పించిన అస్పృశ్యతా దురాచారంపై సహానుభూతిలో భగ్గున మండిపడ్డారు. ***చెప్పులు కుట్టేవాడు/ చెప్పులు తొడుక్కొంటే చెప్పరాని కోపం/ చెరువులు తవ్వేవాడు/ చెరువులోని నీళ్ళు ముట్టుకొంటే సహించరాని పాపం/ కాలికింద చెప్పు/ చెంపమీద కసితీర్చుకొనే రోజొస్తుంది*** అనటంలో కవి ఎంత కసిగా దళితుల బాధాతప్త జీవితాన్ని అక్షరీకరించారో అర్ధమౌతుంది.

ఆధునికుల్లో కనుమరుగవుతున్న బాల్యాన్ని ఆర్ద్రంగా చిత్రీకరించిన కవుల్లో అద్దేపల్లి ప్రముఖులు. అమ్మ ఒడిలోనో, చదువులతల్లి బడిలోనో గడపాల్సిన బాల్యం దిక్కులేనిదై ఎలా విలపిస్తోందో "మరకపడ్డ కుర్రాడు" అన్న కవితలో ఎంత ఆర్ద్రంగా వ్యక్తీకరిస్తారు.

***దయగలబాబులు పావలా, అర్ధా, ఇవ్వకపోతారా?/ అన్న ఆశతో ఆరేళ్ళకుర్రాడు / పోస్టాఫీసు వద్ద నిల్చొని అక్కడ ఆగే వాహనాల్ని శుభ్రం చేస్తుంటాడు. /నా స్కూటర్ ముట్టుకొన్నావా తంతా/నా దొంగనా.../ అని బూతులు తిట్టేవాడొకడైతే, / లోకల్ ప్రియురాలికి తన గుండెను రిజిష్టరు పోస్టులో పంపుతూ / ఆ కుర్రాడికి ఒక్క పావలా ఇవ్వడానిక్కూడా గుండె గతుక్కుమనేవాడొకడు. / అర్ధరూపాయిస్తే ఆస్తంతా రాసిచ్చినంతగా వ్యధపడేవాడు మరొకడు./ ఏ దయగల బాబైనా ఒక్క రూపాయిస్తే వాడి***

***కళ్ళు నక్షత్రాలై మెరుస్తాయి./ వాడు మనిషంతా కృతజ్ఞుడౌతాడు.*** అంటూ ఆ బాలుని దయనీయ స్థితిని గూర్చి చెప్పి చివరిగా అద్దేపల్లి తనదైన ధోరణిలో **"ఇద్దరు సమానుల మధ్య కృతజ్ఞత మానవత్వమనీ/రెండు వర్గాల మధ్య కృతజ్ఞత బానిసత్వమనీ/ రేపు వాడికి అర్థమౌతుంది"** అంటూ ముగిస్తారు.

***అద్దేపల్లి మంచి వక్త. ఉపన్యాసం ఇవ్వమని ఎంతదూరం నుండి ఆహ్వానం వచ్చినా ఆయన వెళ్ళారు. అలా దేశమంతా తిరిగారు. ఎందరో యువ కవులకు ఉత్తేజాన్నిచ్చారు. భుజం తట్టి ప్రోత్సహించారు. ఆయన గొప్ప స్నేహశీలి. స్నేహం కోసం ఎన్ని ఇబ్బందులనైనా ఎదుర్కొనేవారు.***

ప్రస్తుతం సమాజంలో పెచ్చుమీరుతున్న కుల మత విద్వేషాలకు మూలం దగాకోరు రాజకీయ వ్యవస్థే అంటూ "కత్తివాదరమీద దేవుడు" అనే కవితలో **"మతం కాళ్ళు ప్రజలనెత్తి మీద ఉండొచ్చుగాని/ వేళ్ళు మాత్రం రాజకీయ బొరియల్లో నాటుకుని ఉన్నై / అది రాజకీయమని తెలియనివ్వకపోవటమే/ రాజకీయ వేత్తల రాజకీయం** అంటారు.

ఉపాధ్యాయుడి జీవితాన్ని గూర్చి చెబుతూ ప్రతి టీచర్లదినం నాడూ రాజకీయ నాయకులంతా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడంటూ అతణ్ణి కొండమీదకెక్కిస్తారు. మిగిలిన దినాల్లో అతని భావాల దీపాన్ని రాజకీయాల్లో ఊదేసి కొండెక్కిస్తారు. అయితే తన సుదీర్ఘ ప్రయాణంలో ***"ఎప్పుడో, ఎక్కడో తన విద్యార్థి ఎదురై/ మంచిఉద్యోగిగా, మహాకవిగా, నవసమాజ నిర్మాతగా,/ తన పాదాలపై కృతజ్ఞతాసుమాలు చల్లినపుడు/ ఆ ఒక్క అనుభూతి కోసం/ ఎన్ని జన్మలైనా/ టీచరు వృత్తిని మోస్తాదతను –"*** అంటూ ఒక అధ్యాపకునిగా తన అనుభవాల్ని అక్షరీకరించారాయన. ఇక కవికి కవిత్వం రాసిన క్షణాలు మాత్రమే అతని సొంతం అంటారు అద్దేపల్లి.

తెలుగు గజల్‌కి అందమైన రూపురేఖలద్దిన కవి కూడా అద్దేపల్లే. 2011లో 40 గజల్స్‌తో ఒక పుస్తకాన్ని తెచ్చారు. సరళమైన భాషతో సూటిగా హత్తుకుపోయే భావాలతో సాగే ఈ గజల్స్ బాల్యం, పర్యావరణం, వ్యక్తిత్వం, స్నేహం వంటి వివిధ అంశాలతో కూడి హృదయాల్లోకి చొచ్చుకుపోతాయి. వ్యక్తిత్వాన్ని సరిదిద్దుకోమంటూ సున్నితమైన సూచనలిస్తాయి.

అద్దేపల్లిలో గొప్ప పరిశోధకుడూ ఉన్నాడు. "అభ్యుదయ విప్లవ కవిత్వాలు–శిల్ప రీతులు" అన్న అంశంపై ఆచార్య. జయధీర్ తిరుమలరావు పర్యవేక్షణలో లోతైన పరిశోధన చేసి తెలుగు విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ అందుకొన్నారు. కవిత్వానికి వస్తువు ఎంత ముఖ్యమో అభివ్యక్తి అంతే ముఖ్యమని అద్దేపల్లి ఈ పరిశోధనలో నిగ్గుతేల్చారు.

అద్దేపల్లి మంచి వక్త. ఉపన్యాసం ఇవ్వమని ఎంతదూరం నుండి ఆహ్వానం వచ్చినా ఆయన వెళ్ళారు. అలా దేశమంతా తిరిగారు. ఎందరో యువ కవులకు ఉత్తేజాన్నిచ్చారు. భుజం తట్టి ప్రోత్సహించారు. ఆయన గొప్ప స్నేహశీలి. స్నేహం కోసం ఎన్ని ఇబ్బందులనైనా ఎదుర్కొనేవారు. ఎన్ని త్యాగాలైనా చేసేవారు. మరో గొప్ప మంచి లక్షణం ఎవరైనా ఉపన్యాసానికి పిలిస్తే, ఖర్చుల గురించి, డబ్బు గురించి అస్సలు ఆలోచించకపోవడం.

అద్దేపల్లి మంచి గాయకుడు కూడా. పద్యాన్ని ఎంతో అందంగా చదివేవారు. ఇక పాటైనా, గజలైనా ఆయన నోట విని తీరాల్సిందే. ***"ఈ ధనమంత పోనీ యవ్వనమంత పోనీ/ భోగాలు పోనీ సరాగాలు పోనీ/ ఈ నాటి ఈ జీవితమ్మంత పోనీ/ ఆనాటి బాల్యాన్ని ఒకసారి రానీ! "*** అంటూ బాల్యంపై ఆయన రాసి ఆలపించిన గజల్ ప్రతి హృదయాన్ని కదిలిస్తుంది. ఈ గజల్ వింటుంటే కంప్యూటర్ ప్రపంచంలో మునిగి తేలుతున్న వర్తమాన నాగరిక బాల్యం ప్రకృతికి దూరమై ఎన్ని మధురానుభూతుల్ని కోల్పోతుందో అని బాధకలుగుతుంది.

అద్దేపల్లి ఒక సద్విమర్శకుడు. శ్రీశ్రీ కవితా ప్రస్థానాన్ని సంప్రదాయ, ఆలంకారిక సూత్రాలతో తూకం వేసి ఒక విలువైన విమర్శనా గ్రంథాన్ని రాసారు. ఒక్క శ్రీశ్రీ పైనే కాదు, కుందుర్తి, గురజాడ, కృష్ణశాస్త్రి, చలం, తిలక్, నండూరి, జాషువా వంటి ఎందరో గొప్ప కవుల్ని పాఠకలోకానికి లోతుగా పరిచయం చేసిన ఘనత కూడా అద్దేపల్లిదే.

ఇంక వివిధ గ్రంథాలకు వీరు రాసినన్ని ముందు మాటలు ఇంకెవరూ రాసి ఉండరు. చేయి తిరిగిన దిగ్గజాల్లాంటి కవులు మొదలుకొని ఇప్పుడిప్పుడే కలం పట్టిన యువకవులదాకా ఎన్నో పుస్తకాలకు వీరు ముందుమాటలు రాసారు.

కవిత

# అక్షరం అద్దేపల్లి

- వల్లభాపురం జనార్దన
8179939547

అభ్యుదయ ప్రజాకవీ
నీ మహాభినిష్క్రమణం
కవితా సమాజానికి షాక్
భావ జలపాతమయి
అక్షరాల్లో మానవతా విద్యుత్తును
వ్యాపింపజేసిన జనరేటరువు
ఎదిగే ఉద్యమాల ఊపిరివి
ప్రగతిశీలతతో ప్రవహించిన మనసువు
అక్షరాల్లో సూర్యుని వేడిని
అంతరంగంలో చంద్రుని వెన్నెలను
నింపుకొన్న
ఉష్ణ, మలయ మారుత స్పర్శవు
బహుళజాతి పాజిటివ్ రక్తాన్ని
ఎక్కించుకొన్న పాలకులను
ఛీకొట్టిన మనిషివి
రెక్కలొచ్చిన అక్షర విహంగానివయి
ఆకాశంలోకి ఎగిరిపోయిన
నీ మహాభినిష్క్రమణం
కవితా సమాజంలో
పూరింపబడని ఖాళీ
కాలం కౌగిలిలోకి వెళ్లిన
నీ గొంతు గుసగుసలు
పదనిసలు ఇకమీద
వినిపించ వంటే
గోదావరి గలగలలు
తలపించు నీ నవ్వు
కనిపించదంటే
భరించలేని బాధామయ దృశ్యమే
అయినా నీకోసం నేను
కన్నీరు కార్చను
నీ భావజాలాన్ని గుండెలో
నింపుకొని,
కలం సిరాగా చేసుకొని
ప్రపంచానికి పంచుతా
నా అక్షరాల్లో నీ స్వభావాన్ని
రూపుకట్టిస్తా
సమాజ అంతరంగంలో లీనమై
కనపడకుండా పోయినా
అక్షరం ఆపకుండా నడవమని
హెచ్చరిస్తూనే ఉంటావు
నీవు లేకపోయినా
నీ అక్షరం శాశ్వతం

---

అద్దేపల్లి సమకాలికులు చాలామంది. ఎక్కడో ఒకచోట అంటే అభ్యుదయ కవిత్వం దగ్గరో, విప్లవ కవిత్వం దగ్గరో ఆగిపోయారు. కానీ అద్దేపల్లి అలా ఎక్కడో ఒకచోట ఆగిపోయి ఆ తరువాత వచ్చిన సాహిత్యమంతా చెత్త అని ఎప్పుడూ భావించలేదు. కాలంతోపాటు ముందుకు నడుస్తూ మినీ కవిత్వంతోపాటు హైకూ, నానీ, రెక్కలు, వ్యంజకాలు వంటి అత్యాధునిక ప్రక్రియలను కూడా ఆయన ఆహ్వానించి ఆస్వాదించారు.

అద్దేపల్లి రచనలపై ఎన్నో పరిశోధనలు కూడా జరిగాయి. జరుగుతున్నాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి వాసా భూపాల్ అనే విద్యార్థి అద్దేపల్లి రచనలపై పిహెచ్.డి., చేసి డాక్టరేట్ అందుకున్నారు. అద్దేపల్లి రచనల్లోని ప్రపంచీకరణపై శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్య.మేడిపల్లి రవికుమార్ పర్యవేక్షణలో ఇంకో పరిశోధన సాగుతోంది. ఆయన రాసిన పీఠికలు, ముందుమాటలపై కూడా పరిశోధన జరగాల్సిఉంది.

అద్దేపల్లి నిగర్వి. ఎన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించినా లోయలవైపు కూడా దృష్టి సారించగల లోతైన తత్త్వం ఆయన సుగుణం. ఎంత చిన్నవాళ్ళలో అయినా ఒక మంచి సుగుణం ఉంటే మనసారా ప్రశంసించే గొప్ప లక్షణం ఆయనలో ఉంది. అందుకే ఆయన్ని అందరూ ఇష్టపడతారు.


గత 3సంవత్సరాలుగా అద్దేపల్లి ఆధ్యక్షంలో కాకినాడ సాహితీ స్రవంతి వేదికగా "నెలనెలా సాహిత్యహేల"లో వివిధ కవులు రాసిన ఎన్నో గ్రంథాల్ని ఆవిష్కరించడం, ఆయా సాహిత్య ప్రక్రియల్లో నిష్ణాతులచేత ఉపన్యాసాలు ఇప్పించటం, ఏదైనా ఒక అంశాన్నిచ్చి కవిత్వం చెప్పమనటం వంటి ఎన్నో సాహిత్య కార్యక్రమాలు నిరంతరాయంగా సాగిపోతున్నాయి.

ఇటీవలే 80వ వసంతంలోకి అడుగుపెట్టిన ఆ ఆధునిక కవికులగురువు శతాధిక వసంతాలు సాహితీయాత్రను కొనసాగిస్తాడనే అందరం భావించాం. కానీ ఒక్కసారిగా వారి ఆరోగ్యంలో ఇంత మార్పు సంభవిస్తుందని, మృత్యువు ఇంత తొందరగా (13-1-2016న) ఆయన్ని ఎగరేసుకు పోతుందని ఎవ్వరం ఊహించలేదు.

అయితే మృత్యువు ఆయన శరీరాన్ని మాత్రమే తాకగలిగింది. ఆయన జ్ఞాపకాలవైపు, ఆయన రచనలవైపు రావటానికి దానికెన్ని గుండెలుండాలి? ఇప్పుడు గోదావరిలో మన ప్రతిబింబం చూసుకోవడానికి ప్రయత్నిస్తే మనందరికీ, వీరేశలింగంతోపాటు అద్దేపల్లీ కనిపిస్తారు. అది నిజం.

**నివాళి**

# కాలం మీద సంతకం చేసి వెళ్ళిపోయాడు




**- కెంగార మోహన్**
***9000730403***

***"ఒక మనిషి వెలిగిస్తున్న దీపాన్ని/ మరో మనిషి ఆర్పేస్తూ/ మరో దీపం వెలిగించే మనిషి లేక/ మనుషుల నీడల్ని ముసుగులుగా కప్పుకుని/ మనుషుల కోసం దేవులాడుతున్నాం / ఎంతమంది ఎన్ని దీపాలార్పేసి పారిపోయినా/ కవి మాత్రం సందు చివర/ దీపస్థంభంలా మట్టి పాతుకొని/ జ్వలిస్తూనే ఉంటాడు"*** అద్దేపల్లి రామమోహనరావు కవికిచ్చిన నిర్వచనం.

ఆయన కవిత్వం గూర్చి మాట్లాడటమన్నా, రాయడమన్నా మనిషి గూర్చి ముఖ్యంగా నిఖార్సైన మనిషి ఆశిస్తున్న సమసమాజం గూర్చి చర్చించడమే. అటువంటి మనిషి కాలం మీద నిర్ధయగా సంతకంచేసి వెళ్లిపోయాడు. ఆయన కవిత్వం ఆధునిక తెలుగు సాహిత్యంలో వెలుగు బాటలు వేసింది. స్పష్టమైన భావజాలం, సైద్ధాంతిక నిబద్ధత కలిగిన కవి. ఆయన అనేక సందర్భాలలో ఆధునిక కవిత్వంలో ఎన్నో లోతైన సంగతులు చెప్పిన సందర్భాలున్నాయి. కాల్పనిక భావన-సామాజిక వేదన కవిత్వంలో ఉండాలని కడవరకు కలలు కనిన అక్షర తపస్వి. శిల్పరీతులు, అభివ్యక్తులు, కవితాత్మకత ముఖ్యం అంటూ ఆయన కవితల నిండా అనుభూతి, అభివ్యక్తి, భావగాంభీర్యం ఏ కోణంలో పాఠకుడు చూసినప్పటికీ, అన్ని సామాజిక కోణాలు ఆయన కవిత్వంలో కనిపిస్తాయి. కవిత బలంగా వస్తే జనం గుండెల్లోకి పోతుంది, కవితకు భావధార ముఖ్యం అని వర్ధమాన యువతరానికి సందేశం ఇస్తారు.

***"అక్షరాలు/ నాభివెనక గాలిగూళ్ళలో కళ్ళు తెరిచి/ హృదయసీమల్లో రెక్కలు తగిలించుకొని/ కంఠమార్గంలో వరసలు వరసలై ఎగిరొచ్చి/ పదాలు పదాలుగా గుంపులు కట్టి/ పెదవుల మీద నిలబడతై"*** ఇలాంటి కవిత్వం ఆయన కలం నుంచి పురుడుపోసుకుంటుంది. అందుకే పదాలు పేరిస్తే కవిత్వం కాదు భావజాలంలోకి వెళ్ళాలంటూ స్పష్టమైన సందేశం ఇచ్చిన కవి.

ప్రపంచీకరణలో భాగంగా పెట్టుబడిదారీ విధానంలో పేదరికం అత్యంత వేగంగా వ్యాపిస్తుందని, అనతికాలంలోనే గమనించిన దార్శనికుడు. కారల్‌మార్క్స్‌ను చదివితే గాని ప్రపంచీకరణ అర్థం కాదంటాడు. జరగబోయే విషయాలను కారల్ మార్క్స్ చెప్పినట్టు ఎవరూ చెప్పలేదని బలంగా చెప్పి ఆఖరి వరకూ అదే మాటపై అదే బాటను నమ్మాడు. సిద్ధాంతం లేకుండా ఏ కవి, కవిగా ఉండకూడదంటాడు. ఐదుసీనుల నాటకం కవితలో -**"ఇక వ్యాపారానికి దేశాల సరిహద్దులు లేవు/ ఇక వల్లకాటికి ఏ కంచెలు లేవు"** అంటారు. ప్రపంచీకరణకు కూడా ఒక సాహిత్య సిద్ధాంతముందని బలంగా నమ్మాడు, అది పోస్ట్ మోడ్రనిజమని, అది సాహిత్యాన్ని కలుషితం చేస్తుందని,

ఆ వ్యామోహంలో కవులు పడకూడదని చెప్పాడు. సిద్ధాంతాలకు కాలం చెల్లిందని పోస్ట్ మోడ్రనిజం చెబుతుందని, వస్తువ్యామోహాలను అది సమర్థిస్తుందంటారు. అందుకే కవికి ఒక చూపు ఉండాలి అది దృక్పథం. దృక్కు అంటే చూపు అనీ, దృక్పథం అంటే చూసే మార్గమని, ఆ పంథాలో ఆ పథం వైపు పాఠకుణ్ణి తీసుకెళ్ళాలన్నదే అద్దేపల్లి బలమైన కాంక్ష. వసుదైక మానవుడివా? గ్లోబైక మానవుడివా? ఎవరు నీవు అనేది నిర్ధారించుకోవాలంటాడు.

కవిత్వం ఆవేశంలోంచి రావాలనుకుంటాం ఇది సత్యం. అయితే కవిత్వానికి ఆవేశం ఒక్కటే ప్రధానం కాదు భావావేశం ప్రధానం. అది అద్దేపల్లి కవిత్వంలో కనిపిస్తుంది. పిల్లలు పరీక్షల్లో కాపీ కొట్టే విధానమంతా అలంకార శాస్త్రంలో ఉందని, అది మంచిది కాదని విద్యార్థులు చదివి పరీక్షల్లో నెగ్గడమొక్కటే ప్రధానం కాదు జ్ఞానం సంపాదించుకోవాలని, విద్యార్థులు చదవకపోతే ప్రపంచీకరణ సమర్థించినట్టేనని గ్లోబలీకరణకు అర్థం చెబుతాడు. అద్దేపల్లి కవిత్వం కుండబద్దలు కొట్టినట్టుంటుంది. మనిషిని వాస్తవంలోకి నడిపిస్తుంది. మనం ఇప్పుడు సంక్రాంతి సంబరాల్లో ఉన్నాం .ఈ ఆనంద సందర్భంలో అద్దేపల్లి మరణవార్త విన్నాం. అయితే అయన ఊహించిన సంక్రాంతి, ఆయన కలలు కన్న సంక్రాంతి వేరు. ఈ కింది కవితలో ఇలా చెప్పారు....

***'దేశాంచలాలు కదిలిపోయేటట్లు/ తలవిదిలించి/ పిడికిళ్ళు బిగించి కత్తుల్ని పట్టి లాగి/ సముద్రంలోకి విసిరేసి/ రాలుతున్న రక్త బిందువులతో/ ఒక వినూతన వ్యవస్థ ముంగిట్లో/ ముగ్గులు పెట్టినప్పుడే/ కొత్త ఇంటిముందు/ సంక్రాంతి పరిమళిస్తుంది./ గ్లోబలైజ్ అవుతున్న హింస/ ముఖం పగిలిపోయేటట్లు / మన తలుపులు మూసేస్తేనే/ మన యింట్లోని ప్రేమ/ విశాలప్రపంచమై కనిపిస్తుంది.'*** కవిత్వ పథం అలాంటింది, పాఠకుడు కూడా ఇటువంటి కవిత్వం చదివితే కవిగా మారిపోతాడు. కొత్త కవితకు ప్రాణం పోస్తాడు. అయన కవిత్వంలో అంత శక్తి ఉంటుంది. ఆయన కలంలోంచి ఎన్నో కొత్త వస్తువులు పుట్టాయి. ఎన్నో భావావేశ తరంగాలు త్సునామీలుగా విరచుకు పడ్డాయి. ఆయన కవిత్వం చట్ట సభల్నీ వదల్లేదు.

***'అమ్మయ్య!/ ఇన్నాళ్ళకు ఈ మంట సెగ/ అసెంబ్లీ గోడలకు తగిలింది/ రోడ్డుమీద కెరటాలు కెరటాలుగా/ పోటెత్తుతూపోయే అసభ్యతా ప్రవాహాల్ని/ ధ్యానముద్రలో మరచిపోతున్న/ బాపూజీ విగ్రహం మీదుగా/ ఈ మంట సెగ'*** అసెంబ్లీ గోడలకు తగిలింది. ఈ రోజు మీడియాలో శారీరక సౌందర్యాలను సొమ్ముచేసుకుంటున్నారు. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు చూపించే జాదూయే కదా ఈనాటి మీడియా దోపిడి అంటూ మీడియా పోకడలన్ని కవిత్వంలో ఎండగట్టాడు. ఇపుడు మనిషి వస్తువయ్యాడు. ప్రతీది వ్యాపారమయం అయ్యింది.మొత్తంగా మనిషినే మార్కెట్ చేసి మాయాజాలం చేస్తున్నాయి బహుళజాతి సంస్థలు. ఈ సందర్భంలో నిరంతరయాత్రగా కవిత్వంతో పాటు కలసి నడిచిన లబ్ధప్రతిష్టుడు అద్దేపల్లి. ఏ కవైనా సమాజ పోరాటాన్నే రాస్తాడని, అలానే రాయాలని కడవరకు అక్షరపోరు చేసిన సాహితీ పిపాసి. ఆయన కవిత్వమంతా అలా సమాజక్షేత్రంపై నాటబడిందే. రైతు గూర్చి గ్లోబల్ సంక్రాంతి కవితలో చెబుతూ...

***విత్తనంలోంచి ఊపిరితీసుకొని/ ఆకుపచ్చని పొలం నిండా/ నారుమడిగా విశ్వసిస్తాడు రైతు/ విత్తనం అతని హృదయం/ విత్తనం అతని సొంతం/ --/ --/ ఇప్పుడతని విత్తనం పరాయిది/ విత్తనం నించి కాలం/ బంగారు పంటల గొడుగుపట్టే/ తెలుగు పండుగ సంక్రాంతి కూడా/ ఇపుడు రైతుకి పరాయిదే-*** అందుకే కవి సృష్టి సామాన్యమైన విషయం కాదు. భావతరంగాలు విరచుకుపడాలి. లోతైన సమాజక్షేత్రంపై వెనువెంటనే మొలకెత్తే కల్తీలేని అక్షరవిత్తనాలు కావాలి. అదే కవిత్వం.

అద్దేపల్లి కవిత్వంలో సకల విషయాలు, సకల వస్తువులు, వైవిధ్యమైన శిల్పరీతులు చూడవచ్చు. ఎంతో వస్తు వైవిధ్యంతో కవిత్వం రాసిన కవి అకాల మరణం చెందాడంటే అది గుండెలో వెలితి. ఆరిపోవాల్సిన దీపమే కావచ్చు కాని చీకటి ఇంకా ఉన్నప్పుడు వెలుగు కావాల్సిందే, ఆ వెలుగు చీకటిని తరిమికొడుతుందంటే పదికాలాలు ఆ దీపం వెలగాలని అనుకుంటాం.

***ఈ వసంతపు అరుణచ్ఛాయలో/ అందరం ప్రమాణం చేయాలి/ తెలుగుభాష నా శ్వాస/ నా శ్వాస నిలిచినంత వరకూ/ తెలుగునై నిలుస్తాను/ తెలుగునై జీవిస్తాను*** అని తెలుగుసాహితీలోకాన్ని వీడి కాలం మీద తెలుగు సంతకం చేసి వెళ్ళిన మహాకవి అద్దేపల్లి రామ్మోహనరావుకు జోహార్!

## వర్తమానం

# కులాల కూపాలు.. తరాల పాపాలు!



***కాళిదాసు మేఘసందేశం, శ్రీహర్షుడు హంసరాయబారం రచిస్తే గుర్రం జాషువా తన వేదనా సందేశం పంపించేందుకు గబ్బిలాన్ని ఎంచుకోవడం యాదృచ్ఛికం కాదు. తలకిందులుగా వేళ్లాడే గబ్బిలమే సత్యాసత్యాల తారుమారు చూడగలుగుతుంది. సమన్యాయం, ప్రజాస్వామిక దృక్పథం, మానవీయ విలువలను పక్కనపెట్టిన వారికి దళిత సమస్య తలకిందులుగా గోచరిస్తుంది. ఉపేక్షిత వర్గాలు ఉద్యమించడమే కులతత్వమై పోతుంది. విజ్ఞాన కేంద్రాలైన ఉన్నత విద్యాసంస్థల్లోనే కులం విలయతాండవం చేస్తున్నదని ప్రొఫెసర్ థోరాట్ కమిటీ వంటివి ఎప్పుడో నివేదించాయి.***

'నేనంటూ కాలగర్భంలో కలసిపోయాక నా గురించి ఏమనుకుంటారనేది నేను పట్టించుకోను' అని చివరి లేఖలో రాశాడు వేముల రోహిత్. బలవన్మరణ క్షణాల్లోనూ బాధావేదనలు అర్థవంతంగా వ్యక్తం చేస్తూ నిష్క్రమించాడు. తన మృతదేహానికి అంత్యక్రియలు హడావుడిగా పూర్తిచేసి ఉనికేలేని తన కులం ఏమిటో తవ్వితీసేందుకు తలపడతారని వూహించి వుండడు. నిరసనలతో కుతకుత వుడుకుతూ రోహిత్ విషాదాంతంతో పరాకాష్టకు చేరిన హెచ్‌సీయూ ఉదంతం వివక్షా భారతానికి వికృత ఉదాహరణ. దాన్ని ప్రతిఘటించే విశాల చైతన్యానికి సమరశీల సంకేతం కూడా. ఒక యూనివర్సిటీలో ఘటనలు దేశంలోనే సంచలనం కలిగించిన సందర్భం ఇటీవలి కాలంలో లేదు. అయినా సరే– ఈ పరిస్థితి తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వం బీజేపీ నేతలు దాన్ని మరింత దిగజార్చడంలో తలమునకలవుతున్నారు తప్ప ఒక్క కన్నీటిబొట్టు విడవడానికి ఒక్క సానుతాప వాక్యం పలకడానికి సిద్ధంగా లేరు. ఉమ్మడి రాజధానిలో ఇదంతా జరుగుతున్నా ఉభయ చంద్రులూ వారి చుట్టూ పరిభ్రమించే తారా వారసులూ తొక్కిచూడలేదు. వామపక్ష ప్రగతిశీల సంస్థలూ విద్యార్థి సంఘాలూ ఆలోచనా పరులూ భుజం కలిపి నిలుస్తుంటే పాలక నేతల నుంచి కొందరు మీడియా మేధావుల వరకూ రంగులు బయిటపెట్టుకుంటున్నారు. గ్రేటర్ ఎన్నికల రణగొణధ్వనుల మధ్య శివార్లలో అన్నపానీయాలు మాని ఆందోళన చేస్తున్న ఆ బిడ్డల గుండె ఘోష వినిపించడం లేదు..

హెచ్‌సీయూలో ఒక విజ్ఞాన శాస్త్రాధ్యాపకుడు చేసినట్టు తామే తవ్వించుకున్న కుల కూపాల్లోనే వుండిపోయిన పండిత ముద్రాంకిత మండూకాలకు సామాజిక న్యాయభావన తలకెక్కదు. కాళిదాసు మేఘసందేశం, శ్రీహర్షుడు హంస రాయబారం రచిస్తే గుర్రం జాషువా తన వేదనా సందేశం పంపించేందుకు గబ్బిలాన్ని ఎంచుకోవడం యాదృచ్ఛికం కాదు. తలకిందులుగా వేళ్లాడే గబ్బిలమే సత్యాసత్యాల తారుమారు చూడగలుగుతుంది. సమన్యాయం, ప్రజాస్వామిక దృక్పథం, మానవీయ విలువలను పక్కనపెట్టిన వారికి దళిత సమస్య తలకిందులుగా గోచరిస్తుంది. ఉపేక్షిత వర్గాలు ఉద్యమించడమే కులతత్వమై పోతుంది. విజ్ఞాన కేంద్రాలైన

ఉన్నత విద్యాసంస్థల్లోనే కులం విలయతాండవం చేస్తున్నదని ప్రొఫెసర్ థోరాట్ కమిటీ వంటివి ఎప్పుడో నివేదించాయి. ఇదే హెచసీయూలో ఇప్పటికి ఏడెనిమిది మంది బలైనారు. ఈ ప్రభుత్వం వచ్చాక అంబేద్కర్ అధ్యయన కేంద్రాలను నిషేధించడం వంటి చర్యలు ఇంకా పెరిగాయి. ఈ నేపథ్యంలోనే దేశవ్యాపితంగా యూనివర్సిటీలలో దళితుల విద్యార్థి వేదికలు క్రియాశీలంగా పెరుగుతున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. వీటితో మరింతగా కలసి పనిచేయాలని వామపక్ష సంఘాలూ గుర్తించాయి.

***ప్రైవేటీకృత ప్రపంచీకరణలో నిర్భాగ్య వర్గాల బాధలు పెరిగే దశలో మనమున్నాం. ఏకలవ్యుడి మహాభారతం నుంచి రోహితాస్యుని మోదీత్వ భారతం వరకూ కుల వ్యవస్థ కర్కశరూపం కరిగేది కాదని నిరూపిస్తున్న హెచ్‌సీయూ బలికేక దేశానికే ఒక హెచ్చరిక. నిమ్నజాతుల కన్నీటి నీరదములు పిడుగులై దేశాన్ని కాల్చివేస్తాయని జాషువా ఎప్పుడో చేసిన ఈ హెచ్చరిక నిజం కాకముందే అణగార్చబడిన వారి ఆగ్రహావేదనలు అర్థం చేసుకోవాలి. అండగా నిలవాలి.***

రాహుల్‌గాంధీ వచ్చాడు గనక కాంగ్రెస్ ముద్ర వేసినా ఉపయోగం లేదు. ఆ లెక్కన ముందు కేంద్రం నుంచి అమిత్‌షానో అరుణ్‌జైట్లీనో లేక ఇన్ని నిర్వాకాలకు ఆధ్వర్యం వహించిన అప్పారావును వీసీగా నియమింప చేశారంటున్న వెంకయ్యనాయుడో వచ్చివుంటే పోయేదికదా! తాము రాకపోగా రోహిత్ గురించి పోరాడే విద్యార్థుల గురించి బీజేపీ ఏబీవీపీ వారు మాట్లాడే మాటలు అసహనానికి అద్దం పడుతున్నాయి. బండారు దత్తాత్రేయ ప్రజలకు దగ్గరగా వుండేవాడన్నా ఆయన ఆరెస్సెస్ సిద్ధాంతాలను తప్పకుండా అనుసరించే వ్యక్తి కూడా. ఎమ్మెల్సీ రామచంద్రరావు కూడా శిష్టసమాజంలో మంచిపేరున్నవారే.

అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్‌పై ఏబీవీపీకి రాజకీయ వ్యతిరేకత వుండొచ్చు. ఆ మాటకొస్తే ఎస్ఎఫ్ఐ వంటి వాటికి సంఘీభావం వున్నా వాటితో ఎప్పుడూ ఏకాభిప్రాయం వుందని చెప్పలేము. ప్రభుత్వానికి అప్రూవర్‌గా మారి అనేక విధాల సహకరించిన యాకూబ్ మెమెన్‌ను ఉరితీయడం సరికాదన్న అభిప్రాయం ప్రముఖులే వ్యక్తం చేశారు. యూనివర్సిటీలోనూ ఏఎస్ఏ దానిపై నిరసన ప్రదర్శన జరిపింది. అంతమాత్రాన జాతి వ్యతిరేకమై పోతుందా? ఉరిశిక్షపై చాలా వ్యతిరేకత వుంది. 2015లో లా కమిషన్ కూడా ఉరిని రద్దుచేయాలని భావించింది. దానిపైన కూడా దేశద్రోహ ముద్ర వేస్తారా? ఏబీవీపీ సుశీల్ కుమార్ కూడా ఫేస్‌బుక్‌లో ఏఎస్ఏ గూండాలు అని రాస్తే రంగారెడ్డి జిల్లా బీజేపీ నేత మాత్రం దత్తాత్రేయకు ఆ విధమైన ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే హెచ్‌సీయూ జాతి వ్యతిరేక శక్తుల అడ్డాగా మారిపోయిందంటూ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి మరింత గట్టి లేఖ బనాయించేశారు. ఏబీవీపీ నాయకుడిపై దాడి చేసిన వారిపట్ల యూనివర్సిటీ అధికారులు చాలా మెతగ్గా వ్యవహరిస్తున్నారని కూడా మందలింపుగా రాశారు. విద్యార్థి సంఘాల మధ్య సమస్యలలో కేంద్ర మంత్రులు జోక్యం చేసుకోవడం ఎక్కడి రాజనీతి? నిజానికి ఆ రోజున వారి మధ్య ఘర్షణ జరిగింది గాని దాడి జరగలేదని ప్రత్యక్ష సాక్షులైన భద్రతాధికారులు చెప్పినట్టు లిఖితపూర్వక ఆధారాలున్నాయి. గట్టిగా మందలించి వదలి వేయాలని కూడా ఒక దశలో భావించారు. కాని మానవ వనరుల శాఖ ఏకంగా అయిదు లేఖలు రాసి మరీ చర్య తీసుకోవాలని ఒత్తిడి పెట్టారు. ప్రతిలేఖలో జాతి వ్యతిరేకులు అన్న ఆరోపణ చేస్తూనే వచ్చింది. కనుకనే ఇది ముమ్మాటికి వివక్షతో తీసుకున్న కక్షపూరిత చర్య అవుతున్నది. వారిని మొత్తంగా వెళ్లగొట్టాలని ఫాక్టొరల్ కమిటీ చెప్పిందట. దయార్ద్ర హృదయుడైన వీసీ అప్పారావు హాస్టల్ నుంచి పరిసరాల నుంచి మాత్రమే వెలివేసి సరిపెట్టాడట. ఈ మొత్తం క్రమంలో నెలలతరబడి ఈ పేద పిల్లలకు స్కాలర్‌షిప్పులు లేకుండా పోయాయి.

ఇక్కడ నేను చేస్తున్న ప్రతి విమర్శకు అధికారిక పత్రాలున్నాయి. రోహిత్ ఆర్థిక దుస్థితిని ఆఖరి లేఖలోనే రాశాడు. ఆత్మహత్య అవాంఛనీయమే అయినా అప్పటికీ స్పందన లేని పాలకమండలిలో కదలికే లేదు. మోదీ నోరువిప్పాకనే సస్పెన్షన్ నిలిపివేసినట్టు ప్రకటించి మళ్లీ కోర్టులో సమర్థించుకుంది. గత్యంతరం లేని స్థితిలో అప్పారావు తప్పుకోగా మొత్తంగా వెళ్లగొట్టాలని సిఫార్సుచేసిన శ్రీవాత్సవ ఆ స్థానం ఆక్రమించడమంటే అంతకన్నా అపహాస్యం ఏముంటుంది? సుశీల్ కుమార్ ఏదో కారణంతో ఆస్పత్రిలో చేరితే గాయాలతో చేరినట్టు చిత్రించి అతని తల్లిగారిని రంగంలోకి తెచ్చారు. మరోవైపు రోహిత్ తల్లి మేము మాలలం అని రోదిస్తున్నా లేనిపోని తవ్వకాలలో

**కవిత**

## చివరి కోరిక




- ఎస్.ఎస్.బి. గేరా
9492922492

*అక్షరాలెప్పుడూ నాకు
అమ్మలాగే అనిపించేవి
కాగితాలు మీలాగే తెల్లగా ఉన్నా
అక్షరాలు మాత్రం నల్లగా నిగనిగలాడుతూ
అచ్చు మా వాడతల్లుల్లాగే ఉండేవి
అందుకేనేమో
చదువంటే నాకు చిన్నప్పట్నుంచి
అమ్మంత ఇష్టం!
మా వాడ బడిని దాటి, మీ ఊరి బడిని దాటి
విశ్వనగర విశ్వవిద్యాలయంలోకొచ్చాకే
తెలిసింది
మీరంటించిన కులం బురద
మా అమ్మకే గాదు
మా అక్షరాలకూ అంటిందని!
మీ చదువుల నిండా బురద
మీ పదవుల చుట్టూ బురద
మీ మాటల్లో బురద
ఊహల్లో బురద
మీరెన్ని పై చదువులు చదివితే
మీకంత బురదెక్కువని
నేను పై చదువుల్లోకొచ్చాకే తెలిసింది!
అంటరాని ఈ బురద,
అక్షరాలకెందుకంటిందో అర్థమైంది
ఎక్కడా కానట్టు
చదువుల తల్లిని తీసుకొచ్చి
కమలం మీద కూచో బెడితే,
కులమతాల బురదగాక
తెలివితేటలెక్కడంటుతాయిరా!
తెల్లరేఖలెక్కడ పల్లవిస్తాయిరా!
నిచ్చెన మెట్ల సమాజాన్ని నిర్మూలించాలనే
నా సమస్త నేస్తాలూ
నాదొక్కటే చివరి కోరిక
అక్షరాల తల్లిని అక్కడ్నుంచి పెకిలించి
అంబేద్కర్ సెంటర్లో
నిలువెత్తు నల్లరాతిపై ప్రతిష్ఠించండి!
కోటి కమలాలు పూయించగల
ఉదయారుణ కిరణాలతో అభిషేకించండి!!*

తరించడం సిగ్గుచేటు.

ఆంధ్రజ్యోతి ఈ విషయంలో వివిధ వాదనలకు చోటు కల్పించడమే గాక రోహిత్ దళిత మూలాలపై హిందూస్తాన్ టైమ్స్ వాస్తవ కథనాన్ని పునర్ముద్రించి మేలు చేసింది. బాల శ్రామికురాలుగా బందితురాలై బాల్యంలో మరో కులం వ్యక్తిని చేసుకుని తన వల్ల బాధలపాలైనానంటున్న రాధిక కథ నిజానికి తరతరాల వ్యథ. భారత మాత ముద్దుబిడను కోల్పోయింది అని ప్రధాని కన్నీరు కారుస్తారు గాని నిజంగా ఆ బిడ్డను కన్న తల్లిని ఆదరించలేని ఈ పాలక వ్యవస్థను ఏమనాలి? ప్రైవేటీకృత ప్రపంచీకరణలో నిర్భాగ్య వర్గాల బాధలు పెరిగే దశలో మనమున్నాం. ఏకలవ్యుడి మహాభారతం నుంచి రోహితాస్యుని మోదీత్వ భారతం వరకూ కుల వ్యవస్థ కర్కశరూపం కరిగేది కాదని నిరూపిస్తున్న హెచ్‌సీయూ బలికేక దేశానికే ఒక హెచ్చరిక. నిమ్నజాతుల కన్నీటి నీరదములు పిడుగులై దేశాన్ని కాల్చివేస్తాయని జాషువా ఎప్పుడో చేసిన ఈ హెచ్చరిక నిజం కాకముందే అణగార్చబడిన వారి ఆగ్రహావేదనలు అర్థం చేసుకోవాలి. అండగా నిలవాలి. హెచ్‌సీయూలో పాక్షిక పాలకులను తొలగించి ప్రక్షాళన చర్యలు ప్రారంభించాలి. బాధితులను ఆదుకోవడమే గాక తగు పరిహారం కల్పించి ప్రధాన స్రవంతిలో భాగస్వాములను చేయాలి.


**- తెలకపల్లి రవి**

(29.01.2016 ఆంధ్రజ్యోతి దినపత్రిక సౌజన్యంతో)

విశ్లేషణ

# స్త్రీవాదుల బాధ్యతను ఎరుకజేసిన 'స్నేహిత'

- అట్టాడ అప్పలనాయుడు
9440031961




*స్త్రీవాదం ఎనభయిలలో ఆరంభదశలో సమాజాన్ని (కనీసం సాహిత్య సమాజాన్ని) ఒక కుదుపు కుదిపింది. కొత్త పదజాలాన్నీ, భావజాలాన్నీ, ఆలోచనలనీ ముఖ్యంగా సాహిత్యావరణంలోకి తీసుకొచ్చింది. ఆ క్రమంలో అది సామాజికంగా గూడా కొత్త ఉద్యమాలకూ తద్వారా సమాజాన్ని ఉన్నతీకరించే సంచలనాలకూ దారి తీస్తుందన్న ఆశను కలిగించింది. బహుశా మిగిలిన అస్తిత్వవాదాలు గూడా యీ విధమయిన ఆశలు రేపి వుంటాయి.*

"..స్త్రీవాదమంటే కేవలం పితృస్వామ్యాన్ని నిరాకరించే ఒక అమూర్త విషయంగానే చూసారు తప్పా దాన్ని ఒక సమగ్ర సిద్ధాంతంగా రూపొందించుకొని మొత్తం సమాజంలో అమలవుతున్న అణచివేత రూపాలను విశ్లేషించేందుకు అవసరమైన సాధనాలను స్త్రీ వాదులు సమకూర్చుకోలేక పోయేరు..."

పై వాక్యాలు చినుకు ప్రచురణగా వెలువడిన కిన్నెర శ్రీదేవి గారి స్త్రీవాద వ్యాససంపుటి 'స్నేహిత'లోని తొలి వ్యాసం 'స్తబ్ధత నుంచి బాధ్యతవైపు" లోనివి. పదిహేడు వ్యాసాలు గల యీ పుస్తకానికి ముందుమాట రాసిన ప్రముఖ రచయిత్రి పి. సత్యవతిగారు స్త్రీవాదం ఒక వాదం కాదు, అదొక తాత్వికత, ఒక జీవనవిధానం. సమాజ ఆరోగ్యానికి గాలీ, నీరూ వంటిదనే ఎరుకను ఈ పుస్తకం కలిగించింది అన్నారు. వాస్తవానికి ఆ ఎరుకను కలిగించడం మాత్రమేగాక యిప్పటిదాకా గమనంలోలేని అనేక అంశాలపట్ల గూడా (స్త్రీ వాదులకు సంబంధించిన) ఆలోచనలను రేకెత్తించడమే గాక స్తబ్దతకు గురయిన స్త్రీవాదం బాధ్యతను గుర్తెరిగి కార్యాచరణకు పూనుకోవాల్సిన అవసరాన్నీ, అంశాలనూ ఎరుక జేసింది.

స్త్రీవాదం ఎనభయిలలో ఆరంభదశలో సమాజాన్ని (కనీసం సాహిత్యసమాజాన్ని) ఒక కుదుపు కుదిపింది. కొత్త పదజాలాన్నీ, భావజాలాన్నీ, ఆలోచనలనీ ముఖ్యంగా సాహిత్యావరణంలోకి తీసుకొచ్చింది. ఆ క్రమంలో అది సామాజికంగా గూడా కొత్త ఉద్యమాలకూ తద్వారా సమాజాన్ని ఉన్నతీకరించే సంచలనాలకూ దారితీస్తుందన్న ఆశను కలిగించింది. బహుశా మిగిలిన అస్తిత్వవాదాలు గూడా ఈ విధమైన ఆశలు రేపిఉంటాయి.

కానీ కాలక్రమంలో అనేకానేక కారణాలతో అస్తిత్వ ఉద్యమాలు ఆరంభదశలోని వాడినీ,వేడినీ ఒక్క మాటలో చెప్పాలంటే ఉద్యమకారణాల పట్ల, వాటి పరిష్కారాలపట్ల ఆనాడుండే నిఖార్సయిన, నిజాయితీనిండిన ఆవేదనా,ఆగ్రహావేశాలూ నేడు లుప్తమయ్యాయి. ఇవాళ అన్ని అస్తిత్వవాదాలూ,ఉద్యమాలూ నాటి వాడీ, వేడీ కోల్పోయి,

చీలికలకు గురయి, రకరకాల కారణాలతో స్తబ్దతకు గురయినాయి. బహుశా అస్తిత్వవాద ఉద్యమాలేకాదు అన్ని సామాజిక ఉద్యమాలూ యివ్వేళ స్తబ్దతకు గురయినాయేమో? ఈ స్తబ్దతను చెప్పి నిశ్వసిస్తారే తప్పా, ఆ స్తబ్దతకు మూలకారణాల అన్వేషణా, స్తబ్దతను బద్దలుగొట్టే మార్గాల సూచనా చేయరెవరూ. స్తబ్దతకు కారణాలు వాటివాటి అంతర్‌బాహిర్ పరిస్థితుల్లో వెదకాలి. సామాజికోద్యమాల మీద అధ్యయనం జరగాలి. విలువయిన విశ్లేషణలందించే దిశగా కృషి జరగాలి. స్త్రీవాద ఉద్యమానికి సంబంధించి యిటువంటి అధ్యయనం, విశ్లేషణా 'స్నేహిత' వ్యాససంపుటి ద్వారా శ్రీదేవిగారు చేసారు.

**పురుషకేంద్రకంగా రాజ్యస్వభావాన్ని పునర్మూల్యాంకనం జేసిన కథల గురించిన విశ్లేషణా వ్యాసమూ ఇవన్నీ స్త్రీవాదానికి సంబంధించిన అనేక దశలనూ,వాటి వివిధకోణాలనూ మన ముందు పరచి,మన ఆలోచనల్లో సవరించు కోవాల్సినవాటినీ, మన ఆలోచనలకు సమకూర్చు కోవాల్సినవాటినీ యెరుకజేస్తాయి!**

నిజానికి విమర్శనా గ్రంధాల నుంచి పాఠకులు ఆశించేదిదే! అప్పటిదాకా కనబడని అంశాలపై వెలుగును ప్రసరింపజేసి చీకటిలో వున్నవాటిని వెలుగులోకి తేవడం, సంశయాత్మకంగా వున్నవాటిని విశ్లేషించి సంశయ నివృత్తిజేయడం, కొత్త విషయాలను చెప్పటం, కొత్తగా చెప్పటం, కొత్త విషయాల పట్ల అవగాహన నందించటం...సాహిత్యంలోనా, సమాజంలోనా సవరించుకోవాల్సిన వాటి గురించీ, సమకూర్చు కోవాల్సిన వాటి గురించీ ఎరుకను కలుగజేయడం విమర్శ కర్తవ్యం!

మూడు అంశాలకు సంబంధించిన వ్యాసాల సంపుటిది! స్త్రీవాదానికి సంబంధించిన తాత్త్వికతచర్చ, తొలితరం నుండీ స్త్రీ రచనల, రచయితల పరిశీలన, చర్చ, స్త్రీవాద కథాగమనం గురించిన వివరణ వంటివి ఒక అంశంగానూ; స్రీవాద కథారచనలో ప్రసిద్ధులైన కొందరి కథలను విశ్లేషించి వాటిల్లో స్త్రీవాద తాత్త్వికత గురించి చర్చించటం రెండో అంశంగానూ మిగిలిన మూడో అంశంగా యితర విషయాలకు సంబంధించి (స్త్రీ సంబంధే) యితరుల రచనల పైన విమర్శనా యిలా యీ సంపుటిని వింగడించవచ్చు! స్త్రీవాద తాత్వికతకు సంబంధించిన వ్యాసాల్లో... దాదాపు స్త్రీవాదం పుట్టుక (పశ్చిమ దేశాల్లో) నుంచీ నేటిదాకా పశ్చిమదేశాల నుంచి తెలుగునేలదాకా దాని పరిణామ చరిత్ర మొదలుకొని, స్త్రీవాదంలోని వివిధ వైవిధ్యాలూ, వైరుధ్యాలనూ పేర్కోవడం మాత్రమేగాక మన నేలలో స్త్రీవాదుల కర్తవ్యాలకు సంబంధించిన కార్యాచరణను సూచించేరు.

స్తబ్దతకు కారణాలుగా...స్త్రీవాద సిద్ధాంతాన్ని రూపొందించుకోలేకపోవడం, కొందరువ్యక్తుల లేదా బృందాల ఇష్టాయిష్టాలకనుగుణ కార్యాచరణకు పరిమితమవడం, స్వచ్ఛందసంస్థల ప్రభావమూ వంటి అంశాలను యెత్తిచూపేరు.'స్తబ్దత నుంచి బాధ్యతవేపు' వ్యాసం మొదలుకొని, తొలితరం కథారచయిత్రుల కథా వికాసం (స్త్రీల కథా సాహిత్యవికాసం వ్యాసం), స్వాతంత్ర్యానంతర కోస్తాంధ్ర స్త్రీల వ్యాస సాహిత్యం గురించిన వ్యాసమూ, తెలుగు సాహిత్యవిమర్శలో స్త్రీవాద దృక్పథమెంతవరకూ ప్రతిఫలించిందన్న చర్చా వ్యాసమూ, ఆరంభం (1980) నుంచీ రెండు దశాబ్దాల స్త్రీవాద కథాగమనం చర్చించే వ్యాసమూ...ఇవిగాక పురుషకేంద్రకంగా రాజ్య స్వభావాన్ని పునర్మూల్యాంకనం జేసిన కథల గురించిన విశ్లేషణా వ్యాసమూ ఇవన్నీ స్త్రీవాదానికి సంబంధించిన అనేక దశలనూ,వాటి వివిధకోణాలనూ మన ముందు పరచి,మన ఆలోచనల్లో సవరించుకోవాల్సినవాటినీ, మన ఆలోచనలకు సమకూర్చుకోవాల్సిన వాటినీ యెరుకజేస్తాయి! ఇంతదాకా స్త్రీవాదం వుందిగానీ స్త్రీవాదసిద్ధాంతం రూపుదిద్దుకోలేదని విశ్లేషించడం, సిద్ధాంత భూమికకు అవసరమయిన కార్యాచరణ వివరించడం 'స్నేహిత ' విశిష్టత!

రెండోఅంశంగా... వసుంధరాదేవి, అబ్బూరి ఛాయాదేవి, ఆచంట శారదాదేవి, ఓల్గా వంటి ప్రసిద్ధుల రచనలను, ఆ రచనల్లోని యెరుక గాంచవలసిన అంశాలను తెలియజేసే వ్యాసాలున్నవి. తొలితరం రచయిత్రుల కథా పరిణామాన్ని చదివిన పాఠకులకు, ఈ వ్యాసాల్లో యీ రచయిత్రుల పరిణితీ, స్త్రీవాదానికి సంబంధించి వెలుగులోకి వచ్చిన కొత్త అంశాలూ, అప్పటిదాకా జీవితంలో గమనంలోకి రాని ఉదాసీన వైఖరికి గురయిన అనేక జీవితానుభవాలను యీ ప్రసిద్ధ రచయితలు కథనం చేయడాన్నీ వ్యాసకర్త

వివరించేరు. ఆత్మిక అంతరంగిక ప్రపంచాన్నించి (వసుంధరాదేవి కథలు)...స్త్రీ అస్తిత్వస్పృహ (ఆచంట శారదాదేవి కథలు), దేశీయస్త్రీవాద భూమిక(ఛాయాదేవి కథలు) నుంచి నవమహిళా ప్రవాహం(ఓల్గా కథలు) దాకా స్త్రీవాద కథాప్రయాణం మనకీ వ్యాసాల్లో తెలుస్తుంది! ఇవిగాక మూడవ అంశంగా వింగడించిన యితర విషయాలకు సంబంధించి...నాలుగు వ్యాసాలున్నవి.

గురజాడ మధురవాణి గురించి ఇప్పటిదాకా గల అభిప్రాయాలకు భిన్నంగా మధురవాణిని గురజాడ వారి గొంతుక, తన ఆదర్శాల కనుగుణంగా తీర్చిదిద్దిన అనుకూల పక్షంలోని పాత్ర (ప్రొటోగనిస్టు) అనీ విమర్శకు లంటుంటారు. కానీ యిది సరికాదని శ్రీదేవి గారు తేల్చివేస్తూ... అపార్థాన్ని తొలగించే ప్రయత్నంలో ప్రవేశపెట్టబడిన పాత్రగా, మధురవాణి విలక్షణతను వివరించడం కొత్త విషయం!

కొన్ని రచనలకు అంతవేగం కాల దోషం పట్టదు. ఒకవేళ రచనలో వస్తువుకి కాలదోషం పట్టినా (కన్యాశుల్కంలా) ఆ రచనలోని వస్తువుని అనుభవంలోకి తీసుకొచ్చే సృజనాత్మక కళా విశిష్టతేదో రచనను నిలబెడుతుంది. ఈ నేపధ్యంలో స్త్రీవాద నవలగా పేరుపొందిన 'కాలాతీత వ్యక్తులు' నవల సమకాలీనత మీద వ్యాసం మనలను ఆలోచింప జేస్తుంది.

అలాగే 'బహుభార్యత్వ వ్యవస్థలో సత్యభామ అస్తిత్వ అన్వేషణ' వ్యాసం...సాధారణంగా సత్యభామ గర్వభంగంగానే పారిజాతాపహరణం కావ్యాన్ని పేర్కొంటారు గానీ శ్రేదేవిగారు అందుకు భిన్నంగా రాచరిక భూమిక,పితృస్వామిక భూమిక దాని ప్రతిఫలనాలు బహుభార్యత్వం కొనసాగేదశలో సత్యభామ కృష్ణుని భర్తగా ప్రేమించటంలో, అతని ప్రేమను పొందటంలో ఒకహక్కుగా తన ప్రేమ అస్తిత్వాన్ని నిలుపుకొనేందుకెలా ఘర్షణపడిందో...సత్యభామనెలా అర్థంచేసుకోవాలో 'పారిజాతాపహరణం' కావ్యనేపథ్యంతో వివరించేరీ వ్యాసంలో !

లోపాలను యెత్తిచూపడం గూడా విమర్శకుల బాధ్యత! చెప్పాల్సివచ్చినపుడు నిర్మొహమాటంగా చెప్పటం అవసరం. సీమ వ్యవ సాయ కథ మీద స్వామి రాసిన వ్యాసంలో స్త్రీల కథలను విస్మరించడాన్ని తప్పుపడుతూ 'స్త్రీల కథలను విస్మరించిన సీమ వ్యవసాయకథ'లో విమర్శకులకు యెంత బాధ్యత వుండాలో తెలియజేసారు. కాల్పనిక రచనలో వ్యక్తమయ్యే భావాలకు రచయిత పాత్రలను బాధ్యుల్ని చేయవచ్చు. కానీ విమర్శలో అలా కుదరదు. విమర్శకుడే ప్రతి వాక్యానికీ జవాబుదారుడంటారు శ్రీదేవి! అంతేగాక దాదాపు ఇరవైముగ్గురు స్త్రీల కథలను పేర్కొని ఆ కథల్లో వ్యవసాయ జీవన సంబంధ సంక్షోభాన్ని ఆయా రచయిత్రులెలా చిత్రించారో ససాక్ష్యంగా చూపించేరు.

'స్త్రీల కథాసాహిత్య వికాసం 'శీర్షికన దాదాపు 1902 నుంచీ 2011దాకా నూటపదేళ్ల కాలంలో వచ్చిన స్త్రీల రచనలను, కథలను వివరించడం, ఆయా కాలాల్లో, ఆయా రచనల్లో వుండకతప్పని పరిమితినీ, ఆ పరిమితిల్లోనే గమనించాల్సిన కథావికాసాన్నీ వివరించేరు.

భండారు అచ్చమాంబ (తొలి ఆధునిక కథగా ప్రతిష్ఠించలేకపోయారా అని విచారం వ్యక్తం చేసారు) మొదలుకొని దశలవారీగా వాసిరెడ్డి సీతాదేవి, రంగనాయకమ్మ, ఓల్గా, కుప్పిలిపద్మ, షాజహానా వంటి వర్తమాన స్త్రీల కథా సాహిత్యవికాస గమనాన్ని ఈ వ్యాసం తెలియజేయడమే గాక, వ్యాసాంతాన1900 నుంచీ1980 వరకూ ఫెమినిజం దశగానూ, 1980 నుండీ వర్తమానం వరకూ ఫెమినిస్టు దశగానూ విశ్లేషిస్తూ, రాబోయే దశను ఫిమేల్ దశగా వుండబోతోందేమో అని ప్రకటించడం స్త్రీవాదానికి సంబంధించిన రాజకీయ,సాహిత్యాచరణపట్ల 'స్నేహిత' ఆకాంక్ష మనకర్థమవుతుంది!

***కాల్పనిక రచనలో వ్యక్తమయ్యే భావాలకు రచయిత పాత్రలను బాధ్యుల్ని చేయవచ్చు. కానీ విమర్శలో అలా కుదరదు. విమర్శకుడే ప్రతి వాక్యానికీ జవాబుదారుడంటారు శ్రీదేవి! అంతేగాక దాదాపు ఇరవైముగ్గురు స్త్రీల కథలను పేర్కొని ఆ కథల్లో వ్యవసాయ జీవన సంబంధ సంక్షోభాన్ని ఆయా రచయిత్రులెలా చిత్రించారో ససాక్ష్యంగా చూపించేరు.***

విశ్లేషణ

# నేటి తెలుగు కవిత్వం - చాకలివారి జీవనం



- పి. దస్తగిరి
8985095506

ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే భారతదేశం ఒక విభిన్నమైన సామాజిక వ్యవస్థను కలిగివుంది. ప్రాచీన-కాలంలో మొదలైన నాలుగు వర్ణాల నిచ్చెనమెట్ల వ్యవస్థ నేటికీ కొనసాగుతూనే ఉంది. ఈ నాలుగు వర్ణాలలో మొదటి మూడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలు కాగా: మొదటి మూడు వర్ణాలవారికి ఊడిగం చేస్తూ బానిసలుగా బ్రతకడం నాలుగో వర్ణమైన శూద్రుల బాధ్యతగా సనాతన సాహిత్యం చెప్తుంది. శూద్ర వర్ణంలో మళ్ళీ శూద్రులు, అతి శూద్రులు అని రెండు రకాలుగా విభజించుకుంటే అందులో మొదటి రకం వారు (రెడ్డి, కమ్మ, యాదవ మొదలగు) సమాజంలో వృత్తి గౌరవాన్ని, సామాజిక గౌరవాన్ని కలిగివుండగా : రెండో రకానికి చెందినవారు (చాకలి, మంగళి, కమ్మరి, కుమ్మరి మొదలగు) తాము చేస్తున్న వృత్తి ఆధారంగానే మిగతా వర్ణాల వారిచేత వివక్షకు, అవమానాలకు గురవుతున్నారు. ఇటువంటి వివక్షలకు, అవమానాలకు గురవుతున్న శూద్రులలో 'చాకలి' సామాజిక వర్గం మొదటి వరుసలో ఉంటుంది.

చాకలి శబ్దం 'చాకు' (ఉతకడం) శబ్దం నుండి వచ్చింది. బట్టలుతకడం చాకలివాళ్ళ వృత్తి. దేవుని ఉత్సవాలకు, పెళ్ళిళ్ళకు దివిటీలు పట్టడం, పల్లకీలు మోయడం కూడ వీరి అదనపు పని. దేవతా ఉత్సవాలలో, గ్రామ తిరుణాళ్ళలో, జాతర్లలో కోళ్ళను, పొట్టేళ్ళను నరకడం, వాటి తలలను కానుకలుగా తీసుకోవడం వీరి కొనసాగింపు పని.

ప్రస్తుతకాలంలో లేకపోయినప్పటికీ కొంతకాలం కిందటి వరకూ ఉన్నత కులాల స్త్రీలు అత్తారింటికిగాని, చుట్టాలిండ్లకుగాని వెళ్ళేటప్పుడు కానుకలు, పిండివంటలు మొదలైనవి మోసుకొని, అంగరక్షకుడుగా చాకలి ముందుగా వెళ్తుండేవాడు. ఆ కులాల మగవాళ్ళు ఏదయినా పనిమీద వేరే ఊళ్ళకు వెళ్ళినపుడు, వారి ఆడవాళ్ళకు ధైర్యంగా, రాత్రి వేళల్లో వారి యిండ్ల దగ్గర గూర్ఖాల్లాగా కావలి వుండడం కూడ నిన్న మొన్నటి దాకా ఉండేది. అయితే ఇప్పుడు ఇది రూపాంతరం చెంది పట్టణాల్లో అపార్టుమెంటుకు కాపలాకాస్తూ, అక్కడ వుండేవారికి బట్టలు ఇస్త్రీ చేయిస్తూ జీవనం సాగిస్తున్నది చాకలివారే.

పల్లెల్లో కొన్ని ఇండ్లకు ఒక చాకలి 'ఇంటి చాకలి'గా

నిర్ణయమ్మై ఉంటాడు. మాసినబట్టల్ని ఉదయం తీసుకెళ్ళడం, వాటిని తిరిగి సాయంత్రం వెనక్కి ఇవ్వడం, రెండుపూటలా భోజనం పెట్టించుకెళ్ళడం గ్రామాల్లోని సాంప్రదాయం.

ఎన్నో వృత్తి జీవితాలను గురించి మాట్లాడిన తెలుగు సాహిత్యం ముఖ్యంగా కవిత్వం చాకలి జీవనం గురించి ఎంతమాత్రం మాట్లాడగలిగిందో వివరించడమే ఈ వ్యాస ప్రధానోద్దేశం.

దేశం మొత్తం జనాభాలో చాకలి జనాభా 3 కోట్లు. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో 49 లక్షలు. ఈ చాకలి వృత్తి అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలేమిటి? అని సాహిత్య ప్రకాశ్ అనే కవి తన "ఒక చాకిరేవు పాట"లో ఈ విధంగా ప్రశ్నిస్తున్నాడు.

*"బాధలు, బాధ్యతలతో*
*శూష్కించిన శరీరాన్ని రేవులోకి దింపి*
*చీరకొంగును వీరవనితలా నడుముకి బిగిస్తుంది*
*ఉస్సోయ్ – ఉస్సోయ్ అని బట్టలను*
*బండకేసి లయబద్ధంగా ఉతుకుతూ*
*మధురంగా తాళం తప్పకుండా గానం చేస్తుంది.*
*రజకుల జీవితాల్లో*
*వెట్టి చాకిరేవులే తప్ప వెతలుదీరే దారే లేదా?!'*

అంటూ చాకలి స్త్రీ శ్రమ సౌందర్యం గురించి మాట్లాడుతూనే, బండచాకిరి చేసినా తమ జీవితాలకు భరోసా ఇవ్వలేని, చేతగాని ప్రభుత్వాలకు, అధికారులకు బాధలను ప్రశ్నించాడు.

సమాజంలో అన్ని కులాలవారు విసిరేసిన మాసినబట్టల్ని, మైలబట్టల్ని చాకలివాళ్ళు తమ రెండు చేతులతో తాకడమేగాదు, ఆ మైలబట్టల్ని మూటలు కట్టుకొని వీపుమీద పెట్టుకొని మోసుకెళ్తారు. అలాంటి చాకలి వాళ్ళను గౌరవించకపోగా, ఏమాత్రం మానవత్వం లేకుండా సిగ్గుమాలిన మాటలతో ఏవిధంగా ఉన్నత వర్గాలవారు ఎగతాళి చేస్తారో పి.సి. రాములు 'యాదుంచుకోండ్రి' అనే తన కవితలో...

*"ఔ! గట్ల గుడ్లుదేరిసి సిత్రంగ నగుతరేంది....?*
*గూన పెంకులెక్క గొడ్తున్నంలే....!*
*సుక్క పొద్దుంగ లేసి ఇల్లిల్లూ దిరిగి జమేసిన*
*మీ మైల బట్టల మూటల్ని మోసి మోసి*
*మా ఎన్నుపూస*
*కాల్చిన సలాకలెక్క జివ్వునంగి పోయినంక*
*మీ లెక్క నిటారుగ నడిస్తందు*
*మాకెన్ని వికేదుంది... బాంచెన్"* అంటున్నాడు.

తెలంగాణా యాసలో పై మాటలను రచయిత మనసు తాకేలా తెలిపాడు.

పొద్దస్తమానం రేవులో గొడ్డు చాకిరిచేసి పిడికెడు బువ్వకోసం వెళ్తే చాకలివాళ్ళను సూదంటు మాటలతో ఎలా బాధపెడతారో కూడా పి.పి. రాములు తన "యాదుంచుకోండ్రి" కవితలోనే వివరించాడు.

*"యింటింటి ముద్దలు*
*మింగేటోళ్ళకొక్కింటిదేం రుచిస్తదే"* అంటూ
*పెట్టే అయింత బువ్వలో సుక కోతబెట్టి*
*మళ్లు మలమల మాడ్చిండ్రు గదమ్మా"*
అంతేకాదు ....
*"నీయవ్వ కూతకచ్చిన పెట్టలెక్క*
*పిటపిటలాడ్తన్నవే పోరీ*
*మస్తు మిడిసిపడ్తన్నవే మైసీ.....*
*మాపానం గుంజేస్తన్నదే ఎల్లీ"* అంటూ
*పరాశికాలాడ్తా..... సతాయించి సత్తెనాశేసిండ్రు"* అని

యుక్త వయస్సుకు వచ్చిన చాకలి వాళ్ళ ఆడపిల్లలు ఉన్నతవర్గాల యిండ్లకు మైలబట్టలకోసం వెళ్ళినపుడు వారు కొవ్వెక్కి ఎలాంటి అవమానకరమైన మాటలతో మనుసులను చంపేస్తున్నారో కూడా పి.సి. రాములే "యాదుంచుకోండ్రి"లో తెలిపాడు.

సమాజంలో ఆదరాభిమానాలులేని చాకలివాళ్ళ గురించి, మంగళ్ళను గురించి సీతారాం తన "రెజ్యూమ్"లో గొంతెత్తాడు.

*"మేమెవరం*
*చాకళ్ళ, మంగళ్ళం*
*చౌడు సున్నాలం సన్నాసులం*
*గాడిద బరువులం ముట్టు మూటలం*
*'ఆదరణ' అంతగాలేని పౌరులం*

----

----

***"సానరాళ్ళ చాకిరేవులం"*** అంటూ కసిగా చెప్పాడు.

చాకలి వృత్తిని నమ్ముకున్నవారికి బండతోనే మెతుకు, బండతోనే బతుకు, 'రెక్కడితేగాని డొక్కాడదు' అన్న చందంగా బండపై బట్టాడితేగాని, పొట్టగడవదు చాకళ్ళకు. పొద్దుకే పొద్దు పొడిచి పొద్దుపోయిందాకా కాలపురాతితో చాకలి తన జీవితాన్ని ఎలా ముడేసుకున్నాడో "ఇస్త్రీవాడు"లో కె. గీత వివరించారు.

***"అతడలా నలిగిన బతుకు మడతల్ని***
***ఆకలి నిప్పు పెట్టితో సాఫీ చేస్తూనే ఉంటాడు.***
***రేవు ముందు లేస్తుందో***
***అతడు ముందు లేస్తాడోగాని***
***నిర్విరామంగా రెండు చేతులా కాలపురాతినతడు***
***మోగిస్తూనే ఉంటాడు"*** అని వివరించింది.

అంతేకాదు.... రెండు కాళ్ళు జివ్వున లాగేస్తున్నా, రెండు కళ్ళు నిప్పుకణిల్లా మండుతున్నా నలిగిన బతుకు మడతల్ని తమ ఆకలి నిప్పు పెట్టెతో సాఫీ చేసే వైనాన్ని కూడ కె. గీత 'ఇస్త్రీవాడు' కవిత ద్వారా మన కళ్ళ ముందుంచింది.

***"చుర్రున కాలే ఇస్త్రీ పెట్టె క్రింద***
***చల్లని నీళ్ళని చిలుకరించుకుంటూ***
***ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గుల మధ్య స్వేదాన్ని***
***ఉదకంలా తాగుకుంటూ***
***బరువుగా చేతుల్నెత్తినబెట్టి***
***అతడలా నలిగిన బతుకు మడతల్ని***
***ఆకలి నిప్పు పెట్టితో సాఫీ చేస్తూనే వుంటాడు"***

మనదేశ జెండా మూడు రంగుల కలయిక, కాషాయం, తెలుపు, ఆకుపచ్చ అంటే భారతీయులంతా ఒక్కటేనని చెప్పుకునే జాతీయ పతాకంలోనే కుల, మత రహిత భావనకు ప్రతీకగా కాషాయం ఉంది. ఈనాడు కాషాయం అంటే నిచ్చెనమెట్ల వ్యవస్థను కలిగివున్న హిందూమతం అని కవి చెప్తున్నారు. అటువంటి నిచ్చెనమెట్ల వ్యవస్థలో వున్న చాకలివాళ్ళు కుల, మతాలకతీతంగా దేశ ప్రజలందరి మైలబట్టలనే కాదు, వాళ్ళ చీము, నెత్తురులా కారే హేయభావాలను కూడా శుభ్రంచేసి, ఎర్రదనానికి నిండుదనాన్నిచ్చే శ్రామిక కులంగా వున్నారని జి.వి. రత్నాకర్ "మాలో పుట్టాల్సిందే తమ్మీ" కవితలో చెప్పాడు.

***"ఈ దేశ జెండాపై నీవు కార్చిన***
***చీము నెత్తుటి మరకల్ని తొలగించి***
***ఎర్రదనానికి నిండు దనాన్నిచ్చిన***
***నల్లటి చాకలి బండని నేను"***

చాకలివాళ్ళు తమ యజమానుల బట్టలు తారుమారుగాకుండా కాల్చిన జీడిగింజతో గుర్తులు వేసుకుంటారు. అలా వేసిన జీడిగింజ గుర్తులను బట్టి ఎవరి బట్టలు వాళ్ళకు చేరుస్తారు. అయితే ఈ క్రమంలో కాల్చిన జీడిగింజలా చాకలివారి జీవితం ఎలా కాలిపోతుందో, అక్షరానికి దూరమై నిరక్షరాస్యులుగా ఎలా మిగిలిపోతున్నారో శిఖామణి "కిర్రుచెప్పుల భాష" అనే కవితలో.......

***"ఇప్పుడు అక్షరాన్ని***
***కాల్చిన జీడిగింజనుచేసి***
***జాతి వస్త్రం మీద***
***నా చాకలి సంతకాన్ని చేస్తున్నాను"*** అంటూ వివరించాడు.

పైన చెప్పిన కవితలు అన్నింటిలో చాకలివారి జీవితం ఎన్ని అవమానాలకు గురవుతున్నదో, ఎంతటి శ్రమ దోపిడీకి బలవుతుందో మనకు తెలుస్తుంది. సామాజికంగా చాకలివారి జీవితం ఎంతగా అణచివేయబడుతుందో వివరిస్తుంది. అంతే తప్ప అంతటి దుర్భర జీవితాల్లో చైతన్యంతో కూడిన మార్పును కవిత్వం తీసుకురావాలి.

రైతు చేతబట్టి నేలను దున్నే నాగలికున్న విలువ చాకలి ఇస్త్రీపెట్టెకు లేదు. గొర్రెలనుకాసే దుడ్డుకర్రకున్న గౌరవం, చాకలి పంగలకర్రకు లేదు. మనిషి ధరించడానికి చక్కగా అందంగా తీర్చిదిద్దే చేనేత వస్త్రానికున్న హోదా, ఆ వస్త్రాన్ని మెరిసేలా సాపు చేసే ఇస్త్రీపెట్టెకు లేదు.

చాకలి వృత్తి వారు మాత్రమే కాదు. సామాజిక గౌరవంలేని ఇంకే వృత్తి వారయినా ఈ సమాజంలో ఇలా వుండటం అవసరమా? అనే ప్రశ్నకు సమాధాన రీతిలో నేడు తెలుగు కవిత్వం రావలసిన అత్యవసరం ఎంతైనా వుంది. ❒

## నచ్చిన రచన



# విస్పష్ట అత్యాధునిక కవిత్వం


- బొల్లోజు బాబా
9849320443


**పో**స్ట్‌మోడర్న్ కవిత్వం అస్పష్టంగా ఉంటుందనే అపప్రథ పోగొట్టుకొని నేటికి స్ఫుటితమైంది. దీనికి ఉదాహరణగా మెర్సీమార్గరెట్ "మాటలమడుగు" కవితా సంపుటిలోని కవిత్వం నిలుస్తుంది. ఈ కవిత్వంలో– చక్కని పదచిత్రాల భాష, "ఆలోచనలు నిలువునా చినిగేదాకా" చేసుకొన్న అంతర్వీక్షణం, ఒక మనిషిగా, ఒక స్త్రీగా, ఎండ్లూరి సుధాకర్ గారన్నట్లు ఒక కిరస్తానీ కోకిలగా సాగే భిన్నఅస్తిత్వాల స్వీయాత్మప్రకటన, నాలుగు గోడలై అంతవరకూ బంధించిన చరిత్రను నిరాకరించటమూ వంటి వివిధ కవితలలో చక్కగా ప్రతిబింబించాయి.

కొత్త అభివ్యక్తి, కొత్తపదచిత్రాల్ని పట్టుకొన్న ఈ కవయిత్రి, ప్రస్తుతతరానికి ప్రతినిధి. అందుకనే ముందుమాటలో వాడ్రేవు చినవీరభద్రుడు "కవిత్వంలో ఉన్న విశేషం ఏమిటంటే ప్రతితరంలోనూ అది మళ్లా కొత్తగా వొనుంలెత్తుతుంది. // అలా పలకడంలో మానవానుభవానికొక కొత్తపార్శ్వం సమకూరుతుంది" అంటారు. ఆ రకంగా "మాటలమడుగు" కవిత్వం విస్పష్ట పోస్ట్‌మోదరన్ కవిత్వంగా తెలుగు సాహిత్యంలో కొన్ని వాదాల, ఇజాల తీవ్రత తగ్గాక వీచిన కొత్తగాలిలా అనిపించకమానదు.

"మాటలమడుగు"పేరుకు తగ్గట్టుగా కవిత్వం నిండా మాటలు. హృదయాన్ని ఊచేమాటలు. అనుభూతి కలిగించిన ఆలోచనల్ని నింపుకున్న మాటలు. చాలాచోట్ల ఆ మాటలు తమ స్వంత అర్థాల్ని వీడి వేరే రమణీయార్థాన్ని వ్యక్తీకరిస్తుంటాయి. అదేకదా ఉత్తమ కవిత్వ లక్షణం.

కవులు అప్పుడప్పుడూ తమ కవిత్వతత్వాన్ని ఏదో ఓ కవితలో నిర్వచించుకొంటారు (Metapoetry). వాళ్ళేం వ్రాస్తున్నారు అనే అంశానికి సంబంధించి ఇదొక స్వీయపరిశీలన లేదా ఎరుక. మార్గరెట్ "కొట్టివేత" అనేకవితలో

***"పాతపాళీకి కొత్తమాటలు***
***అభ్యాసం చేయించి***
***తడిమే ప్రతి చూపులో***
***వినే ప్రతిమాటలో నూత్న వెలుగుతో***
***నన్ను నేను కాల్చుకోవాలి***
***"కొట్టివేతల నుంచి కొత్తగా పుట్టుకు రావాలి"***

(కొట్టివేత) అంటుంది. అత్యాధునిక కవిత్వానికి చరిత్ర నిరాకరణ ఆయువుపట్టు. దీనికి అవసరమైన వ్యూహం కొత్తభాషను సృష్టించుకోవటం. దీన్నే ఈ కవయిత్రి పాతపాళీకి కొత్తమాటలు అని, కొట్టివేతల నుండి కొత్తగా పుట్టుకు రావటం అనీ వ్యక్తీకరించింది. మరోకవితలో ఆ కొత్తభాష ఎలా ఉండాలో చెపుతుంది.

***వ్యాకరణ వాసనలేని***
***ఆధిపత్య అధీనతలేని***
***అణచివేత ధిక్కరణలకు తావులేని***
***ప్రవహిస్తున్న ఒక రహస్యనదిని కనుగొనడానికి***
***సమసమాజస్థాపన చేసే సంస్కృతిలా ఉరకలేసే***
***నదిలాంటి భాషను కనుగొనటానికి(మాట్లాడనివ్వండి)***

అంటూ ఆ కొత్తభాష స్వరూపాన్ని, దానికై జరిపే తన అన్వేషణను తెలియచేస్తుంది.

‘‘పదచిత్రాలతో ఆలోచించటమే కవిత్వం’’ అని అంటారు కవి విమర్శకుడు సీతారాం. “మాటలమడుగు” లో అనేక కవితలు అద్భుతమైన పదచిత్రాలతో అలరారుతుంటాయి. ఆయా పదచిత్రాలు కూడా చక్కని సందర్భశుద్ధి, పొందికతో అమరి అపూర్వమైన పఠనానుభూతిని కలిగిస్తాయి.

***చుట్టూచీకటి***
***అడుగుతీసి అడుగేస్తే***
***ఇసుకలా తగిలే చీకటి*** (చీకటిదీపం) చీకటి ఇసుకలా తగలటం అనేది ఒక నూతనఅభివ్యక్తి.

**ఏ యుగాలనాటి మౌనధ్యానంలో**
**పునీతులై జ్వలిస్తారో కవులు**
**కాగితంపై అడుగేసి**
**కవిత్వమై వెలుగుతారు** (కవులు-కాగితం) ఇక్కడ జ్వలించటం, వెలగటం అనే రెండు పదాల ద్వారా సృష్టించిన ఈ పదచిత్రం ‘కవిత్వమనేది కవుల మనోకాంతి అని అది లోకాల్ని వెలిగిస్తుందనీ’ సూచిస్తుంది.

**చీకటిదండెం మీద**
**ఎవరో**
**జ్ఞాపకాలు ఆరేసుకున్నారు** (చీకటి దండెం) అనటంలో ఒక నిద్రరాని రాత్రివేళ పదేపదే గుర్తుకువచ్చే కొన్ని అనుభూతులు వ్యక్తమౌతాయి.

**ఒక పరిచయం ముగుస్తూనే/ పగలు నుండి రాత్రిని / వేరుచేసే కవ్వమేదో / మనసుని చిలికి / జ్ఞాపకాల వెన్నని చేతిలో / చంద్రుని ముద్దగాచేసి వెళుతుంది** (పరిచయం ముగుస్తూనే). ఒక పరిచిత వ్యక్తి జ్ఞాపకాలను వెన్నగా, ఆ వెన్నని మరలా చంద్రునిముద్దగా వర్ణించటం ఒక అద్భుతమైన కల్పన.

ఈ సంపుటిలో అనేక సామాజికాంశాలపై స్పందించి వ్రాసిన వివిధ కవితలు కనిపిస్తాయి. “అమానత్ స్వరం” (నిర్భయ ఉదంతం) అనే కవితలో ‘తల్లితండ్రులారా వీలైతే మీ కొడుకులకు స్త్రీలను గౌరవించటం నేర్పండి’ అంటుంది. లక్ష్మింపేట ఉదంతంపై వ్రాసిన ఓ కవితలో ‘ఇక్కడ ఒక్కో శ్వాస విస్ఫోటనం చెందే అణుబాంబు అవుతుంది” అని హెచ్చరిస్తుంది. రియానేహ్‌పై వ్రాసిన ఓ కవితలో“నీ ఉత్తరం చదివాక నేను మౌనంగా ఉండలేక పోతున్నాను” అంటూ సహానుభూతిని ప్రకటిస్తుంది. సామాజిక వివక్ష, రాజ్యహింసల పట్ల మార్గరెట్ స్పందించిన తీరులో తనదైన గొంతుక, బలమైన వ్యక్తీకరణ కనిపిస్తాయి. అటువంటి కవితలు నిరలంకారంగా కనిపించవచ్చు కానీ వాటిలో కవి దృక్పథం ఉంటుంది. అలాంటి కవితలే ఈమె ఎవరివైపు నిలబడి కవిత్వం చెపుతున్నదో అర్థమయ్యేలా చేస్తాయి.

మార్గరెట్ కవిత్వం గూఢంగా ఉంటూ ఒక్కోసారి చదువరిని లోనికి రానీయనంత ఇరుకుగా కూడా అనిపిస్తుంది. కొన్ని చోట్లయితే పైకి ఒక మామూలు అర్థానిస్తూ, నిధిని కనుక్కోమని సవాలు విసురుతూ ఉంటుంది. ఇలా పైకి కనిపించే అర్థం ఒకటి, అంతర్లీనంగా మరొక అర్థాన్ని కలిగి ఉండటం పోస్ట్‌మోడర్న్ కవిత్వం యొక్క మరొక లక్షణం. “మిగిలిపోయిన దారం” అనే కవిత – పూలు వాడిపోయాయి, దారం మాత్రం ఆ పూలజ్ఞాపకాలలో ఒంటరిగా మిగిలింది అంటూ సాగుతుంది. ఈ కవితలో ఒకచోట ఆ దారం ‘‘ప్రశ్నల కొక్కాలకు మనల్ని వేలాడదీస్తుంది” అనటం ద్వారా ఇది మామూలు వాచ్యంగా చెప్పిన వస్తుకవిత కాదని అర్థమౌతుంది. కానీ కవయిత్రి ఎక్కడా బయటపడదు. భిన్న అన్వయాలను చదువరులకే విడిచి పెడుతుంది.

మార్గరెట్ కవిత్వానికి శక్తి, పుష్టి, ఆయుషుని ఇచ్చేది ఆమె కవితలలో విస్తారంగా దర్శనమిచ్చే మెటానిమీ. కవిత్వంలో మెటనిమీ అంటే ఒకపదానికి బదులుగా ఆ

## గమనిక

**సాహిత్య ప్రస్థానం చిరునామా మారింది.**

**రచనలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు**
**ఈ దిగువ చిరునామాకు పంపగలరు**
**సాహిత్య ప్రస్థానం**
**27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు**
**ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002**
**ఫోన్: 0866-2577248, సెల్: 9490099059**
ఇ-మెయిల్ : **ssprasthanam@gmail.com**
**www.prasthanam.com**

## సాహిత్య ప్రస్థానం పత్రికకు చందా కట్టారా?

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు చందా కట్టండి!**
**తెలుగు భాషా, సాహిత్య కృషిలో భాగస్వాములు కండి!!**

**1 సంవత్సర చందా రూ. 120/-**
**5 సంవత్సరాల చందా రూ.500 /-**
**10 సంవత్సరాల చందా రూ. 1000/-**

**చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.**


పదంతో దగ్గర సంబంధమున్న మరొక పదాన్ని ఆ స్థానంలో వాడటం. పోస్ట్‌మోడ్రన్ కవిత్వానికి మెటానిమీ వెన్నెముక వంటిది. కానీ మెటానిమీ వాడటం కత్తిమీదసాము. కవి ఉద్దేశించిన భావాల్ని చదువరి అందుకోలేకపోతే ఆ కవిత అస్పష్ట లోయలోకి జారినట్లే. పోస్ట్‌మోడ్రన్ కవిత్వం అర్థం కావటం లేదన్న విమర్శలు మొదట్లో ఎదుర్కోవల్సి వచ్చింది ఇందుకే. 'మాటలమడుగు' కవిత్వంలో కనిపించే మెటానిమీ తేటగా, నూతనంగా ఉంటూ కవితలోని అంతరార్థాన్ని తెలుసుకోమని కవ్విస్తూంటుంది. ముడి విప్పుకొన్న చదువరికి మంచి పఠనానుభవాన్ని కలిగిస్తుంది.

కథనాత్మక పద్ధతిలో నడిచే "దోసిలిలో నది" అనే కవితలో మెటానిమీ ఉత్తమస్థాయిలో ప్రకాశిస్తూ గొప్ప కవితానుభూతి ఇస్తుంది. ***"బయటకి ప్రవహించేందుకు దారి వెతుకుతూ నాలుగుగోడల మధ్య ఒకనది"*** అంటూ మొదలౌతుంది కవిత. ఒక వలసపక్షి గోడపై వదిలిన విత్తనంవల్ల గోడ బలహీనమై ఒకపక్కకు ఒరగగా, నదికి రెక్కలొచ్చి, సహాయానికి, సహనానికి నిలువెత్తుసాక్ష్యమై స్వేచ్ఛగా ప్రవహించిందట. ఆ నదిని తీసుకొన్న ప్రతిఒక్కరి దోసిలిలో పక్షిలా మారుతూనే ఉందట. మార్మికంగా సాగే కవిత ఇది. ఇక్కడ నదికి బదులుగా ఆ స్థానంలో మతవిశ్వాసాలు / ఒకజాతి అస్తిత్వం / స్వేచ్ఛ అనేపదాలతో భిన్న విధాలుగా అన్వయం చెప్పుకోగలిగేలా కవిత ఉండటం కవయిత్రి ఊహాపటిమకు, నిర్మాణ కౌశలతకు అద్దంపడుతుంది.

కొందరు వ్రాసే కవిత్వంలో మత ప్రస్తావన చాలాసార్లు అన్యమతంపట్ల దూషణ లేదా విధ్వంసక స్థాయిలలోనో కనిపిస్తుంది. కానీ "మాటలమడుగు" కవిత్వంలో అలా ఉండదు. ఈ సంపుటిలోని రెండు, మూడు కవితల్లో కవయిత్రి తాను విశ్వసించే మతం తాలూకు పరిభాష దొర్లుతుంది. అది ఆ మతంలోని ఉదాత్తమైన భావనల్ని కవిత్వీకరించటం గమనార్హం. ఉదాహరణకు – ***"పొరలు రాలిన క్షణం" అనే కవితలో"అయినా పర్లేదు /'దమస్కు మార్గానికి'/ ఇప్పుడు చేరానన్న ఆనందం"***అంటుంది కవయిత్రి. ఇక్కడ "దమస్కు మార్గం" అనే వాక్య ఔదాత్యం అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. సౌలు అనేవ్యక్తి డమస్కస్దారిలో ఏసుక్రీస్తు దర్శనాన్ని పొందుతాడు. అంతవరకూ ఏసుపట్ల అవిశ్వాసి అయిన సౌలు విశ్వాసి అయి, సెయింట్ ఫాల్‌గా మారి ప్రభువు దివ్యత్వాన్ని గానం చేసి ధన్యత నొందినట్లు బైబిలు ద్వారా తెలిసే ఒక మహిమాన్విత ఉదంతం. ఆంగ్లభాషలో **Road to Damascus** ను ఒక వ్యక్తి జీవితంలో కలిగిన ఏదేని ఒక గొప్ప దైవికమైన మార్పును వర్ణించే ఇడియమ్‌లా వాడతారు. తెలుగు కవిత్వాన్ని పరిపుష్టం చేసే ఇలాంటి ప్రయోగాలు ఆహ్వానించ దగినవి.

ప్రశ్నలగది, వెన్నెలస్నేహితా, సముద్రాంబర, జోలాలి వంటి కవితలు శిల్పపరంగా గొప్పగాఉన్నాయి. ఈ పుస్తకానికి ఆత్మీయ మాటలు వ్రాసిన కవి, విమర్శకుడు అఫ్సర్ అన్నట్లు "మెర్సీ యెన్ని కవిత్వదూరాలు వెళ్ళిందో అక్కడల్లా తన **footprints** లాంటి వాక్యాల్ని ముద్రించి సాగిపోయింది. మంచి కవిత్వాన్ని ఇష్టపడేవారికి మెర్సీమార్గరెట్ "మాటలమడుగు" తప్పక నచ్చుతుంది.

# స్వీకారం

## అలౌకికం

**- లలితానంద్ కవిత**

వెల : 200/- పేజీలు: 303

ప్రతులకు : 9247499715




జీవన సంఘర్షణల పట్ల ఆర్తి కలిగిన కవి గీచిన పద చిత్రం ఒక్కొక సారి కఠినంగానూ ఉంటుంది. మరొకసారి కరుణ రస ప్లావితంగానూ ఉంటుంది. ఈ 'అలౌకికం' కవితా సంపుటిలోని కవితలన్నీ అంతటి వైవిధ్య వంతమైనవే. ప్రగతి శీలమైన మన:ప్రవృత్తిలో, సామాజిక, ఆర్థిక, రాజకీయాది విషయ పరిజ్ఞానంతో, సమకాలీన జీవన చిత్ర రచనకు పూనుకొన్న కవి లలితానంద్.

**- సి. వేదవతి**

## సహచరణం

**జగద్ధాత్రి**

వెల : 150/- పేజీలు:168

ప్రతులకు : 0891-6617988




ఈ కవయిత్రి ప్రేమ గురించో పూల గురించో లేక ఆమె జీవితంలోని అతని గురించో కవిత్వం రాసి పూరుకుందనుకుంటే పొరపాటే. సమాజం పట్ల తనకున్న బాధ్యతను మర్చిపోకుండా కొన్ని కవితల్లో తనదైన శైలిలో స్పందించిందీ కవయిత్రి. ఉద్వేగ భరితమైన భావనా పటిమతో లోతైన భావజాలాన్ని వెలువరించడంలో సిద్ధహస్తురాలని నిరూపించుకుంది.

**- సలీం**

## దొరకని నాణెం (కథలు)

**వి. వెంకట్రావు**

వెల : 60/- పేజీలు: 212

ప్రతులకు : 9247235401




ఈ పుస్తకం తిరగేసిన వాళ్ళకు నేను చెప్పదలుచుకొన్న విషయం ఒకటే. మీరు మీ పిల్లలకు పుస్తకాలు చదివే అలవాటు చెయ్యండి. తరచూ బాల సాహిత్యం అందుబాటులో ఉంచండి. పుస్తకాలు చదవడం వలన పిల్లల్లో పసిమనసులు వికసిస్తాయి. ప్రపంచం అంటే ఏమిటో తెలుస్తుంది. పుస్తకాలు లేని ఇల్లు గాలీ, వెలుతురు లేని చీకటి గుహలు.

**- వి. వెంకట్రావు**

## సాధిత

**సాహిత్య వ్యాసాలు**

వెల : 195/- పేజీలు: 190

ప్రతులకు : 9989265444




అయ్యగారి సీతారత్నం కళింగాంధ్ర ప్రాంతం నుంచి ఎంతో నిబద్ధతతో సాహిత్యలోకంలో గత నాలుగు దశాబ్దాలుగా కృషి చేస్తున్నారు. ఆమె రాసి ప్రచురించిన, చదివి వినిపించిన అనేక వ్యాసాలలో ఎంపిక చేసిన ఇరవై వ్యాసాల సంపుటి "సాధిత" సాహిత్య వ్యాసాలను సిక్కోలు బుక్ ట్రస్ట్ నాలుగవ ప్రచురణగా మీ ముందుకు తీసుకువస్తోంది.

**- సిక్కోలు బుక్‌ట్రస్ట్**

## అజరామరం

**ఎమ్వీ రామిరెడ్డి కవిత్వం**

వెల : 80/- పేజీలు: 102

ప్రతులకు : 9866777870




'ఒక నిర్మాణం కోసం సామూహిక జీవనసూత్రం ధ్వంసం కావడం వ్యవస్థీకృత విషాదం' అని నిజాన్ని చెప్తున్న రామిరెడ్డి కవిత్వంలో విమర్శనా వాస్తవికత ఉంది. 'నుదుటి మీద చందమామల్ని', 'దేహం నిండా దీపాల వెలుగు'లను చూపిస్తున్న 'సజీవ దృశ్యాల సమ్మేళనం' ఈ కవితాసంపుటి.

**- పెనుగొండ లక్ష్మీనారాయణ**

## మృత్యు క్రీడ

**ప్రకృతి వైపరీత్య కథలు**

**డా॥ వి.ఆర్. రాసాని**

వెల : 30/- పేజీలు: 48

ప్రతులకు : 9848443610




నేను రాసిన మూడు ప్రకృతి వైపరీత్య కథల్ని ఈ పుస్తకంగా ప్రచురించాను. ఇలా ప్రకృతి వైపరీత్య కథల ప్రచురణలో ఇదే తొలిమెట్టు అవుతుందనీ, అలాగే దీన్ననుసరించే భవిష్యత్తులో ప్రకృతి విధ్వంస నేపథ్య కథల సంకలనాలు, సంపుటాలు రాగలవని నా నమ్మకం.

**- వి.ఆర్. రాసాని**

# స్వీకారం

## అన్నవి... అనుకొన్నవి ప్రసంగాలు, సమీక్షలు

**అవధానుల మణిబాబు**

వెల : 100/- పేజీలు: 107

ప్రతులకు : 9948598966




విమర్శకులలో, సమీక్ష కులలో ఎవరి శైలి వారిది. మణిబాబు చిన్నతనంలోనే తనదైన ఒక శైలిని స్వంతం చేసుకున్నారు. రచయితల నుడులు, సంప్రదాయానుగతమైన నానుడులు పుణికి పుచ్చుకొని వాటిని అవసరమైన చోట అద్ది, సర్ది వ్రాయటం ఒక విమర్శకుడుగా వారి విజయవానికి కారణం. **- టి. విశ్వనాథరావు**

## కొన్ని తీగలు కొన్ని రాగాలు

**ఎన్. అరుణ**

వెల : 100/- పేజీలు: 90

ప్రతులకు : 9391028496




వాడి లోకంలోకి వెళ్ళకుండా
వాడి జీవితాన్ని
చెక్కాలనుకుంటాం మనం
నిజానికి వాడు
సహజ జ్ఞాని
మనది నేర్చుకున్న వాణి.


**- ఎన్. అరుణ**

## మనుషులపై మిర్చీలు

**బత్తుల వీవీ అప్పారావు**

వెల : 50/- పేజీలు: 67

ప్రతులకు : 9010601919



అప్పారావు మాటలోనూ, రాతలోనూ ఒక వ్యంగ్యం ప్రసరిస్తూ వుంటుంది. అదొక ఆకర్షణ. కొట్టి 'సారీ' చెప్పడం అప్పారావుకు తెలియదు. అప్పారావు వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేవే అతని వామీలు. ఈ కవిత్వానికి ప్రయోజనముంది. ఇదొక ప్రయోగంగా మిగులుతుంది. ఇది దాదాపు మూడు పదులకు పైగా సాహిత్య జీవితం వెలిగించిన కవితా రూపం. **- ఎం.కె. సుగమ్ బాబు**

## వెన్నముద్దలు

**జనార్ధన మహర్షి**

వెల : 100/- పేజీలు: 224

ప్రతులకు : 9848034309




కడుపులో బిడ్డ
తిరగబడ్డాడు
పెద్దాపరేషన్
కోలుకోవడానికి
రెండేళ్ళు పట్టింది.
ఇరవై రెండేళ్ళ తర్వాత
మళ్ళీ తిరగబడ్డాడు
ఇంకేం కోలుకుంటుంది.

**- జనార్ధన మహర్షి**

## మనసులో వెన్నెల

**చైతన్య పింగళి**

వెల : 50/- పేజీలు: 96

ప్రతులకు : 08886983399



ఇంద్రధనస్సులోని ఏడు రంగుల్లా..ఈ పుస్తకంలో ఏడు కథలున్నాయి. భిన్నమైన వృత్తుల్లో, భిన్నమైన పరిస్థితుల్లో ఉన్న స్త్రీల జీవితాల్లో ఉండే విషయాలే వీటిలో కథాంశాలు.

**- చైతన్య**


## నవ్యాలోకనం

**సాహిత్యవ్యాసాలు**

**- చందు సుబ్బారావు**

వెల : 150/- పేజీలు: 165

ప్రతులకు : 9949075859




భిన్న వాదాలను స్వాగతించడం, అదే సమయంలో వాటికున్న పరిమితులను గుర్తు చేయడం, ప్రపంచ సాహిత్య ప్రముఖుల విలువైన మాటలను అరిచేతిలో ఉసిరికాయలా, పాఠకులలో రోగనిరోధక శక్తి పెంపొందేలా అందజేయడం, తాను చదువుకున్న చదువులో నిలకడవున్న ఆచార్య చందు వంటి విమర్శకులు మాత్రమే చేయగలిగిన పని. **- రామతీర్థ**

# అద్దేపల్లికి ఘన నివాళి



కాకినాడలో అద్దేపల్లి అంత్యక్రియలలో పాల్గొని నివాళులర్పిస్తున్న సాహిత్య ప్రస్థానం సంపాదకులు తెలకపల్లి రవి, వొరప్రసాద్, తదితరులు

ప్రముఖ అభ్యుదయ కవి డాక్టర్ అద్దేపల్లి రామ్మోహనరావుకు సాహితీ వేత్తలు, అభిమానులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల నడుమ అంతిమ వీడ్కోలు పలికారు. సాహితీవేత్తలు, అభిమానులు, వామపక్ష నాయకులు, కార్యకర్తలు కాకినాడ అచ్యుతాపురంలో ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాహిత్య ప్రస్థానం సంపాదకులు తెలకపల్లి రవి అద్దేపల్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జనవరి 14న మధ్యాహ్నం 12 గంటలకు అద్దేపల్లి పార్థివదేహానికి అంతిమ యాత్ర నిర్వహించారు. అనంతరం దహన సంస్కారాలు నిర్వహించారు. సాహితీవేత్తలు కృష్ణశ్రీ, రారాసి, జోస్యుల కృష్ణబాబు, డాక్టర్ స్టాలిన్, వరం, కె.వి. రమణారెడ్డి, లంకా వెంకటేశ్వర్లు, సన్నిదానం నరసింహశర్మ, ఎస్.ఆర్.పృథ్వి, మణిబాబు, గడల శివప్రసాద్, గనారా, శిరీషతోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు, నగర కార్యదర్శి పి.వీరబాబు, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పి టాన్యా, జె వెంకటేశ్వర్లు, లిబరేషన్ నాయకులు, యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.సత్తిరాజు, జిల్లా గౌరవాధ్యక్షులు ప్రభాకరవర్మ తదితరులు పాల్గొని కడసారి వీడ్కోలు పలికారు.

**అక్షరయోధుడు అద్దేపల్లి**

నిత్యం తన సాహిత్యం ద్వారా ప్రజా ఉద్యమాలను నడిపిన ప్రజా కవి అద్దేపల్లి రామ్మోహనరావు ఆదర్శనీయుడని సాహిత్య ప్రస్థానం సంపాదకులు తెలకపల్లి రవి అన్నారు. అద్దేపల్లి అంత్యక్రియల సందర్భంగా నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. అద్దేపలి మృతి సాహితీవేత్తలతోపాటు అభ్యుదయవాదులను, అన్ని వర్గాల ప్రజలనూ తీవ్ర విచారంలో ముంచిందన్నారు. నిత్యం ప్రజలను చైతన్యం చేస్తూ తన స్నేహశీలతను పంచుతూ సాహిత్యమే జీవితంగా అద్దేపల్లి జీవించారన్నారు. ప్రముఖ కవిగా, విశ్లేషకులుగా, విమర్శకుడుగా పేరుగాంచిన అద్దేపల్లి నిబద్ధతకు నిదర్శనమన్నారు. అద్దేపల్లి ఇంటిపేరు అక్షరమని, నిత్య సాహిత్య సంచారిగా జీవించారని పేర్కొన్నారు. ఆయన చివరిఘట్టం వరకూ క్రియాశీలంగా పనిచేసి తన సాహిత్యంతో ప్రజా ఉద్యమాలను నడిపారని కొనియాడారు. శ్రీశ్రీ సాహిత్యంపై గ్రంథంగా రచించినది అద్దేపల్లి మాత్రమేనన్నారు. వామపక్ష భావజాలంతో ప్రజలను ఆలోచింపజేసిన అద్దేపల్లి స్ఫూర్తి చెరిగిపోదన్నారు. ఆయన ఆశయ సాధనకు సాహితీ ప్రియులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. న్యూడెమోక్రసీ నాయకులు వాడపల్లి, పౌరహక్కుల సంఘం నాయకులు మనోహర్, జనసాహితి నాయకులు రమాదేవి, విరసం ప్రతినిధి అరసవెల్లి కృష్ణ, సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వొరప్రసాద్, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కొండా దుర్గారావు, గౌతమీ గ్రంథాలయం ఇన్‌ఛార్జి సన్నిధానం నరసింహ శర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టిఎస్ ప్రకాష్ తదితరులు తమ ప్రసంగాల్లో అద్దేపల్లి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

**అద్దేపల్లికి ఘన నివాళి**

తెలుగునాట సాహితీవేత్తలు, పలు సంస్థలు అద్దేపల్లికి ఘన నివాళి అర్పించాయి. సాహితీస్రవంతి ఆధ్వర్యంలో కాకినాడ, విజయవాడ, విజయనగరం, కర్నూలు, పెద్దాపురం, తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో ఖమ్మంలో సభలు జరిగాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నిత్య సంచారిగా ఉన్న అద్దేపల్లిని కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అనేకచోట్ల సభలు నిర్వహించి అద్దేపల్లి సాహిత్యకృషిని కొనియాడారు.

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**



2006లో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగిన గోదావరి సాహిత్యశాల




2012లో హైదరాబాద్‌లో సాహితీస్రవంతి నిర్వహించిన
కవిత్వ శిక్షణా శిబిరంలో




2013లో సుందరయ్య
శతజయంతి జనకవనంలో




హైదరాబాద్‌లలో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన
అద్దేపల్లి కవిత్వం ఇంగ్లీషు అనువాదం 'ఐ నీడ్ ఎ లెటర్' ఆవిష్కరణ సభ



విజయవాడలో 2012లో గురజాడ 150వ జయంతి సభలో




2015 లో గుర్రం జాషువా 120వ జయంతి సభలో








కాకినాడ సాహితీస్రవంతి
ఆధ్వర్యంలో ప్రతీనెలా జరిగే
'సాహిత్యహేల'


**సాహితీస్రవంతి నిర్వహించిన సభలలో**
**అద్దేపల్లి రామమోహన రావు**

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/16-18
Date of Posting : 06.02.2016 ▪ Date of Publication: 03.02.2016



# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు





వెల : రూ.40/-





వెల : రూ.100/-





వెల : రూ.45/-




వెల : రూ.100/-





వెల : రూ.125/-





వెల : రూ.150/-




వెల : రూ.150/-





వెల : రూ.35/-




వెల : రూ.30/-




వెల : రూ.35/-




వెల : రూ.45/-

ప్రజాశక్తి బుక్‌హౌస్, డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి, గవర్నరుపేట, రాఘవయ్య పార్కు వద్ద, విజయవాడ - 520 002. ఫోన్ : 9490099202


If Un delivered please return to: Prasthanam, C/o M.H. Bhavan, Plot No. 21/1,
Near RTC Kalyana mandapam, Azamabad, Hyderabad - 500 020. Ph: 040- 27660013, Cell: 9490099059